



Estd. 1938

# ఆంధ్రప్రభ

www.prabhanews.com
Journalism first!

సంపుటి: 58 • సంచిక: 164 • బుధవారం 2 అక్టోబర్ 2019 • హైదరాబాద్ * పేజీలు: 10+4 • వెల: 5.00

Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore







ప్లాస్టిక్‌తో పర్యావరణం
యమలోక తోరణం!
ప్రకృతితో జీవనం
సామాజిక సౌందర్యం!

# పర్యావరణ హిత...
# మన జాతిపిత

గాంధీ 150వ జయంతి ముగింపు ఉత్సవాలు

- గాంధీజీకి మాటిద్దాం! ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం
- ఒకసారి వాడిపారేసే ప్లాస్టిక్‌కు నేటితో స్వస్తి
- పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో ముందడుగు
- ప్రపంచానికి ఆదర్శంగా నిలవనున్న భారత్
- ప్రధాని మోడీ పిలుపుతో బృహత్తర కార్యాచరణ

గాంధీ కల **స్వచ్ఛ భారత్**

అలుపెరుగని **బాటసారి**

ప్లాస్టిక్ వ్యర్థాలతో భారీ చరఖా

బాపూ.. నీ బాటన నడిచే బలమివ్వు!

15 దశాబ్దాల గాంధీయిజం

వివరాలు లోపలి పేజీల్లో...



నేడు అట్ల బతుకమ్మ

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో
అట్ల బతుకమ్మ ఉయ్యాలో

## పౌరసత్వ చట్టం తీసుకొస్తాం



9

- చొరబాటుదారులను తరిమేస్తాం
- శరణార్థులను ఆదుకుంటాం
- బెంగాల్‌లో ఎన్నార్సీ: అమిత్ షా

## ముహూర్తం

శ్రీ వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వీయుజ మాసం; తిథి: శుక్లపక్షం చవితి ఉ.11.39 వరకు; నక్షత్రం: విశాఖ మ.12.52; అమృతకాలం: తె.2.05 నుండి 3.38 వరకు; వర్జ్యం: సా.4.45 నుండి 6.19 వరకు; దుర్ముహూర్తం: ఉ.11.41 నుండి 12.29 వరకు; రాహుకాలం: మ.12.05 నుండి 1.34 వరకు; యమగండం: ఉ.7.38 నుండి 9.07 వరకు;

## ఔరా..!




# సమ్మె వద్దు

ఆర్టీసీ కార్మికులకు కేబినెట్ విజ్ఞప్తి

## పండుగ వేళ ఇబ్బందులు పెట్టొద్దు

### కూర్చున్న కొమ్మను నరుక్కోవద్దు

- ఆర్టీసీ సమస్యలపై ముగ్గురు ఐఏఎస్‌లతో కమిటీ • కార్మికులతో నేడు
- సోమేష్ కుమార్ బృందం చర్చలు • నివేదిక అందగానే చర్యలు
- ఆర్టీసీ పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం • హితవు పలికిన మంత్రిమండలి



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** దసరా, దీపావళి పండుగల సమయంలో ఆర్టీసి కార్మికులు సమ్మెకు వెళ్ళి ప్రయాణీకులను ఇబ్బందుపాలు చేయవద్దని, సంస్థను నష్టపరచవద్దని, కూర్చున్న కొమ్మను నరుక్కోరాదని తెలంగాణ మంత్రి మండలి కార్మిక సంఘాలకు హితవు పలికింది. సీఎం కేసీఆర్ అధ్యక్షతన మంగళవారం సాయంత్రం నుండి అర్ధరాత్రి వరకు ప్రగతిభవన్‌లో ఏకబిగిన ఏడున్నరగంటలకు పైగా జరిగిన మంత్రి మండలి సమావేశంలో ఆర్టీసి కార్మికుల డిమాండ్లు, సమ్మె అంశాలపైనే ప్రధానంగా చర్చించారు. కార్మికుల డిమాండ్లు పరిశీలించి ప్రభుత్వానికి తగిన నివేదిక ఇవ్వడం కోసం సీనియర్ ఐఏఎస్ అధికారులతో కమిటీ వేయాలని మంత్రి మండలి నిర్ణయించింది. దీనికి అనుగుణంగానే ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి సోమేష్‌కుమార్ నేతృత్వంలో రామకృష్ణారావు, సునీల్ శర్మ సభ్యులుగా ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ బుధవారం ఆర్టీసీ కార్మికులతో చర్చిస్తుంది. వారి డిమాండ్లను సమగ్రంగా పరిశీలించి, ప్రభుత్వానికి వీలైనంత త్వరలో నివేదిక అందించాలని మంత్రి మండలి కోరింది. అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. పేద ప్రజలకు రవాణాసౌకర్యం కల్పిస్తున్న ఆర్టీసిని ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకోవాలని మంత్రి మండలి నిర్ణయించింది. ఇందుకోసం అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించింది. అధికారులు నివేదిక ఇచ్చిన తర్వాత ఆర్టీసి పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని మంత్రి మండలి నిర్ణయించింది. ఆర్టీసి ఇప్పటికే నష్టాల్లో ఉన్నందున సమ్మె యోచన విరమించి కార్మికులు సహకరించాలని, ఆర్టీసి కార్మికులు తమ డిమాండ్లను ప్రభుత్వం నియమించిన అధికారుల కమిటీతో చర్చించాలని కేబినెట్ సూచించింది. ఆర్టీసి కార్మికులు ఇప్పటికే తమ డిమాండ్లు వివరించారని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన అధికారుల కమిటీతో చర్చించాలని మంత్రివర్గం సూచించింది.

**సుదీర్ఘంగా మంత్రివర్గ సమావేశం**

*పేద ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్న ఆర్టీసీని ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకోవాలి.*

*త్రిసభ్య కమిటీ నివేదికొచ్చిన తర్వాత ఆర్టీసీ పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.*

డిమాండ్లను సామరస్యంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని, ప్రభుత్వం కూడా ఆర్టీసిని కాపాడాలనే కృతనిశ్చయంతో ఉందని మంత్రి మండలి సూచించింది. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వానికి ఎప్పటికపుడు తగు సూచనలు చేసేందుకు ఆయా శాఖల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలు పరిశీలించేందుకు శాశ్వత ప్రాతిపదికన మంత్రివర్గ ఉపసంఘాలను నియమించాలని కేబినెట్ నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ విధానం, పౌల్ట్రీ పాలసీ రూపొందించాలని నిర్ణయించారు.

## 8 మంత్రివర్గ ఉపసంఘాలు

- పథకాల అమలు, పర్యవేక్షణ బాధ్యతలు
- మంత్రులందరికీ కమిటీల్లో భాగస్వామ్యం
- ఒక్కో కమిటీకి ఒక్కో మంత్రి కన్వీనర్

## 10న కలెక్టర్ల సదస్సు

- 30 రోజుల ప్రణాళికపై చర్చ
- గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళిక
- వ్యవసాయ రంగంపైనే ప్రధాన దృష్టి
- వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుపై చర్చ

వివరాలు 3లో...

## ప్రగతి పట్టాలపై హైస్పీడ్

- దక్షిణమధ్య రైల్వేకు నేటితో 53 ఏళ్లు
- 754 స్టేషన్లు, 6234 కి.మీ. సేవలు
- ఆర్థికంగా దూకుడు

7

## వర్సిటీల్లో త్వరలో వెయ్యి పోస్టులు

- వీసీల నియామకం పూర్తయిన వెంటనే భర్తీకి చర్యలు
- వీసీ పోస్టులకు 984 దరఖాస్తులు
- మంత్రి సబితారెడ్డి

5

## కాశ్మీర్ విభజన ఆపలేం

- సుప్రీం కోర్టు వ్యాఖ్య
- ఆంక్షలు సడలించాం
- పిల్లల్ని నిర్బంధించలేదు
- సుప్రీంకు కమిటీ నివేదిక

9

## మున్సిపోల్స్‌కు సిద్ధం కండి

- తుది తీర్పుకు లోబడే ఉండాలి
- నోటిఫికేషన్ ఇప్పుడే ఇవ్వొద్దు
- మున్సిపోల్స్‌పై ముగిసిన వాదనలు
- హైకోర్టు తీర్పు వాయిదా




**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** మునిసిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందస్తు ప్రక్రియలోని అంశాలు పూర్తి చేసుకోవచ్చని హైకోర్టు స్పష్టంచేసింది. తుదితీర్పుకు లోబడే ఉండాలని షరతు విధించింది. ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయబోమని ఎన్నికల కమిషన్ కోర్టుకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని హైకోర్టు పేర్కొంది. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ముందస్తు ప్రక్రియలో అక్రమాలు చోటు చేసుకున్నాయని పేర్కొంటూ హైకోర్టులో దాఖలైన వ్యాజ్యాలపై హైకోర్టులో సుదీర్ఘంగా కొనసాగిన వాదనలు ముగిశాయి. అయితే హైకోర్టు తన తీర్పును మాత్రం వాయిదా వేసింది. ఈ వ్యాజ్యాల్లో ఎలాంటి నిలుపుదల ఆదేశాలు లేవని హైకోర్టు పేర్కొంది. తెలంగాణ ➪ 3వ పేజీలో...

## సెక్రటేరియట్ కూల్చొద్దు!

- తుది తీర్పు వరకు ఆగండి
- కేసులు విచారణలో ఉండగా ఎలా చేస్తారు? • ప్రభుత్వానికి
- హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** హైకోర్టులో మంగళవారం ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ సర్కారుకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సచివాలయం భవన సముదాయం కూల్చివేతను ఆపాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రస్తుత సచివాలయ భవనాల కూల్చివేతను సవాలు చేస్తూ దాఖలైన అయిదు ప్రజాహిత వ్యాజ్యాల్లో తాము తుది తీర్పు వెలువరించే వరకు కూల్చివేత ప్రక్రియను నిలిపివేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై 2016లో మూడు, 2019లో రెండు ప్రజాహిత వ్యాజ్యాలు దాఖలయ్యాయని, అవి విచారణలో ఉండగా సచివాలయ భవనాలను ప్రభుత్వం ఎలా కూల్చివేస్తుందని హైకోర్టు ➪ 3వ పేజీలో...



## టీఆర్ఎస్‌కే సీపీఐ మద్దతు

- ఉపఎన్నిక వరకే వర్తింపు • ప్రజా సమస్యలపై పోరాడుతాం • ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాల్సిందే • సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి

2

**సీపీఎం అభ్యర్థి సహా 45 నామినేషన్లు తిరస్కరణ**

## 4న వస్తున్నా



- దసరా తర్వాత మళ్లీ వస్తా • గెలుపు తెరాసదే • కాంగ్రెస్ మునిగే నావ • టీడీపీ, బీజేపీ సోయిలోనే లేవు: కేటీఆర్

## నవరాత్రి శోభ

### చిన్నశేషవాహనంపై శ్రీవారు



తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవరోజు మంగళవారం ఉదయం శ్రీ మలయప్పస్వామి మురళీకృష్ణుని రూపంలో చిన్నశేష వాహనంపై అధిరోహించి భక్తులను కనువిందు చేశారు. పట్టు పీతాంబరం, మరకత మాణిక్యాదుల వంటి విశేష ఆభరణాలు, వివిధ రకాల పుష్ప మాలలతో స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఐదు శిరసుల శేషుడినీడలో వేణువు చేతపట్టిన శ్రీకృష్ణుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన వాహన సేవ 11 గంటల వరకు కన్నుల పండుగగా సాగింది.

### రావణునిపై భూకైలాసనాథుడు



శ్రీశైల మహాక్షేత్రంలో దసరా నవరాత్రులలో భాగంగా మూడవ రోజు మంగళవారం రాత్రి భూకైలాస నాథుడు, భ్రమరాంబ దేవి సహిత అలంకృత అమ్మవారితో పాటు దశకంఠునిపై ఆసీనులై శ్రీశైల పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వగా వేలాది మంది భక్తులు స్వామి అమ్మవార్లను కనులారా వీక్షించి తరించారు. మంగళవారం రాత్రి చంద్రఘంట అలంకారంలో భ్రమరాంబ దేవి దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అష్టోత్తర శత నామాలతో కుంకుమ పూజలు నిర్వహించారు.

### గాయత్రి మాతగా భద్రకాళి..



ఓరుగల్లు భద్రకాళీ దేవస్థానంలో శరన్నవ రాత్రి మహోత్సవములలో 3వ రోజు భద్రకాళీ అమ్మవారిని గాయత్రి మాతగా అలంకరిం చారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం నిత్యాహ్నికం నిర్వహించి ఉదయం చంద్రఘంటా క్రమంలో బోధాయ నోక్త దేవతపూజ, సాయంకాలం మహిష మర్దిని క్రమంలో అమ్మవారికి కల్పోక్త ప్రకారంగా హోమం, అర్చన, అభిషేకాలు నిర్వహిం చారు. ఆగమ శాస్త్ర ప్రకారం ఉదయం సింహ వాహనంపై సాయంత్రం గజవాహనంపై ఊరేగిం చారు.

### చంద్రఘంటగా బాసర అమ్మవారు



చదువుల తల్లి కొలువు దీరిన బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ దేవి సన్నిధిలో మూడవ రోజు మంగళ వారం అమ్మవార చంద్ర ఘంట అవతారంలో భక్తులకు దర్శన మిచ్చారు. అమ్మవారికి కొబ్బరి నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారి చెంత ఆలయ అర్చకులు, వేద పండితులు శ్రీ లలిత సహస్రనామ, నివేదన, మహా మాతృ పుష్పం చతుర్వేద సేవలు నిర్వహించారు. భక్తులు ఉదయం నుండి గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి ఆలయంలోని అమ్మవార్లను దర్శించుకున్నారు. అమ్మవారి సన్నిధిలో తమ చిన్నారులకు అక్షరాభ్యాసము చేయిస్తూ కుటుంబ సభ్యులతో అమ్మవారి అనుగ్రహం పొందుతున్నారు.

### గాయత్రి మాతగా దుర్గమ్మ



దేవీ శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీ గాయత్రి దేవిగా విజయవాడ కనకదుర్గమ్మ భక్తులకు దర్శన మిచ్చారు. వేదస్వరూపిణి అయిన దుర్గమ్మ పంచ ముఖాలతో దర్శనమివటంతో భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారి దర్శనానికి వచ్చారు. మొత్తం 90వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్, రాష్ట్ర మం త్రులు బాలినేని శ్రీనివాస రెడ్డి, మోపిదేవి వెంకట రమ ణ తదితరులు కుటుంబ సమేతంగా అమ్మ వారిని దర్శించుకు న్నారు. వీరికి వేదపండితులు అమ్మవారి తీర్థప్రసా దాలు అందించి, ఆశీర్వచనాలు ఇచ్చారు.

# గోదావరిలో జలక్రీడలు

● హుస్సేన్ సాగర్ మాదిరిగానే రెగెట్టా పోటీలు ● గోదావరి ఖనివద్ద ఏర్పాట్లు... క్రీడలశాఖకు బాధ్యతలు ● తెలంగాణ పురోగతికి ఇదే నిదర్శనం ● 'మత్స్యవీర కేసీఆర్' కప్ పోటీలపట్ల ఎమ్మెల్యే చందర్‌కు ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందనలు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : హుస్సేన్‌సాగర్‌లో జరుగుతున్న విధంగానే గోదావరిఖని వద్ద గోదావరి నదిలో కూడా నిత్యం రెగెట్టా పోటీలు జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు క్రీడలశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను ఆదేశించారు. 'తెలంగాణ మత్స్య వీర కేసీఆర్' కప్ పేరిట గోదావరిఖని సమీపంలో రాష్ట్రస్థాయి తెప్పల పోటీలు నిర్వహించిన ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను మంగళవారం ప్రగతి భవన్‌లో తనను కలిసిన సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. దండంపెట్టి నదిలో పైసలు వేయడానికి నీళ్ళ కోసం వెదికిన కాలం చూసిన తెలంగాణ నేడు నిండు గోదావరిలో పడవల పోటీలు నిర్వహించే స్థాయికి ఎదగడం శుభ పరిణామమని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైన తర్వాత రాష్ట్ర పునర్ నిర్మాణ క్రమంలో సాధిస్తున్న పురోగతికి ఇది నిలువెత్తు సాక్ష్య మన్నారు. గోదావరిఖనిలో పడవల పోటీలు నిర్వహించాలన్న ఆలో చన వచ్చి దాన్ని విజయవంతంగా పూర్తిచేసిన ఎమ్మెల్యే చందర్ చొర వ అభినందనీయమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితంగా సుందిళ్ళ బ్యారేజీ నుంచి ఎల్లంపల్లి బ్యారేజీ వరకు 41 కిలోమీటర్ల గోదావరి నది సజీవంగా ఉంటుందని సీఎం కేసీఆర్ తెలిపారు. ఇందుకోసం తాను కొన్ని దశాబ్దాలుగా కలలు కన్నామన్నారు. నదిలో నీటి ప్రవాహం లేని సమయాల్లో జల క్రీడలకు ఎంతో అనువుగా ఉంటుందని, ఆ దిశగా క్రీడల శాఖ ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసుకుని క్రీడా కారులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి యేటా హుస్సేన్ సాగర్‌లో జరుగుతున్న మాదిరిగానే గోదావరిఖని రెగెట్టా పోటీలు నిర్వహిస్తే ఆ ప్రాంతం ప్రాచుర్యంలోకి వస్తుంద న్నారు. నీటి పారు దలశాఖ, క్రీడలు, సాంస్కృతిక శాఖలు సంయుక్త భాగస్వామ్యంతో, సెయిలింగ్ క్లబ్ సహకారంతో పడవల పోటీలు నిర్వహించాలన్నారు. ఇది ఒకసారి కాకుండా ప్రతియేటా నిర్వహించేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు.



# గాంధీజీ స్ఫూర్తితోనే తెలంగాణ సాధించా

● నా నిరవధిక దీక్ష దేశానికే ఆదర్శం ● 'జ్వలిత దీక్ష' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సీఎం కేసీఆర్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : జాతిపిత మహాత్మాగాంధీ చూపిన అహింస, సత్యాగ్రహ దీక్షల స్ఫూర్తితోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. తెలం గాణ ఉద్యమాన్ని గాంధీమార్గంలోనే శాంతియుతంగా ముందుకు నడిపామని, స్వరాష్ట్రం సాధించగలిగామని పేర్కొన్నారు. 2009, నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 వరకు తాము చేసిన ఆమరణ నిరా హారదీక్ష సందర్భంగా తెలంగాణ ప్రజలు చూపిన సహనం, అహిం సామార్గం దేశానికి మార్గదర్శకంగా మారిందని స్పష్టం చేశారు. కేసీఆర్ చేపట్టిన నిరాహారదీక్షపై ఆయన పౌర సంబంధాల అధికారి గటిక విజయ్ కుమార్ 'జ్వలిత దీక్ష' నవల రెండో ముద్రణను మహా త్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని సీఎం మంగళవారం ఆవి ష్కరించారు. జ్వలిత దీక్ష మొదటి ముద్రణను సుగుణ ఫిల్మ్స్ అండ్ పబ్లిషర్స్ ప్రచురించగా, రెండో ముద్రణను అడుగు జాడలు పబ్లికే షన్స్, సుగుణ ఫిల్మ్స్ అండ్ పబ్లిషర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ముద్రించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ, మహాత్ముని సత్యాగ్రహ సిద్ధాంతాల ద్వారా దేశ ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకురాగలిగారని, ఫలితంగా స్వాతంత్ర్యం సిద్ధించిందని అన్నారు. 2009లో తాను అదే శాంతియుత మార్గాన్ని అనుసరించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామన్నారు. నాడు కరీంనగర్, వరంగల్, ఖమ్మం, హైదరాబాద్ నగరాల్లో నెలకొన్న పరిస్థితులను, తెలంగాణ వ్యాప్తంగా నెలకొన్న భావోద్వేగ సన్నివేశాలను జ్వలిత దీక్ష పుస్తకంలో రచయిత విజయ్ కుమార్ గొప్పగా అక్షరీకరించారని తెలిపారు. దీక్ష సంద ర్భంలో తన మదిలో మెదిలిన భావనలను తన అంతరంగంలోకి తొంగిచూసినట్లే ఆవిష్కరించడం గొప్ప విషయమని ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్ర సమితి స్థాపించిన తొలినాళ్ళలోనే మహాత్మాగాంధీ చూపిన అహింస మార్గంలోనే ప్రత్యేక రాష్ట్రాన్ని సాధిస్తానని తాను చేసిన ప్రకటనను ఈ సందర్భంగా గుర్తుచేశారు. జ్వలిత దీక్ష రెండో ముద్రణ బాధ్యత తీసుకున్న బీసీ కమిషన్ సభ్యుడు గౌరీ శంకర్‌ను ఈ సందర్భంగా సీఎం అభినందించారు. మంగళవారం ప్రగతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, సీపీఆర్‌వో జ్వాల నరసింహారావు, సీఎం ఓఎస్‌డీ శ్రీధర్‌దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

# 4న వస్తున్నా



● టీడీపీ, బీజేపీలు సోయిలోనే ఉండవు ● హుజూర్‌నగర్ ఇన్‌చార్జిలతో మంత్రి కేటీఆర్ టెలీకాన్ఫరెన్స్ ● ఉన్నతస్థాయి రిపోర్టులు అద్భుతంగా ఉన్నాయ్ ● క్షేత్రస్థాయి పరిస్థితులు వివరించిన ఎన్నికల ఇన్‌చార్జి పల్లా, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : కాంగ్రెస్ మునిగిపోతున్న పడవ అని, అలాంటి పార్టీకి ప్రజలు ఓటేయరని, హుజూర్‌నగర్ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఘోరపరాభవం ఖాయ మని టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. మంగళవారం హుజూర్ నగర్ నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జిలతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. దేశ్ళుగా టిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని అక్కడి ప్రజలకు వివరించాలని పార్టీ ప్రచార ఇన్ ఛార్జి లను వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామా రావు కోరా రు. ప్రజలు వె య్యి శాతం టిఆర్ఎస్ పాలన పట్ల సంతృప్తిగా ఉన్నారని, ఈ పదిహే ను రోజుల పాటు విస్తృతంగా ప్రచా రం కొనసా గించాలని పార్టీ శ్రేణు లను కోరారు. తాను స్వ యంగా ఎన్ని కల ప్రచారంలో పాల్గొం టానని, 4వ తేదీతో పాటు పండుగ తర్వాత ఒకటి, రెండు రోజులు హుజూర్‌నగర్ ప్రచారానికి వస్తాన న్నారు. ప్రస్తుతం అక్కడ జరుగుతున్న ప్రచార శైలిని, ప్రజల స్పందనను టెలికాన్ఫరెన్స్‌లో నాయకుల నుండి అడిగి తెలుసుకున్నారు. పార్టీ ఎన్నికల ఇన్ ఛార్జి పల్లా రాజేశ్వరరెడ్డి ఈ సంద ర్భంగా క్షేత్రస్థా యి ఫీడ్‌బ్యాక్‌ను కేటీఆర్‌కు వివ రించారు. పలు వురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుకూడా ప్రచారం సంద ర్భంగా తమ అనుభవాలను వివరించారు.

**మంచి మెజారిటీతో గెలుస్తున్నాం**

హుజూర్‌నగర్ నియోజకవర్గం నుండి అందుతున్న క్షేత్రస్థాయి రిపోర్టులు అద్భుతంగా ఉన్నాయని, టిఆర్ఎస్ వందశాతం గౌరవప్రద మెజారిటీతో విజయం సాధిస్తుం దని కేటీఆర్ నేతలతో అన్నారు. గత ఎన్నికల్లో కలిసి పోటీచేసి ఘోర పరాభవం మూటగట్టుకున్న విప క్షాలు.. ఈ ఎన్నికల్లో ఎవరికి వారే యమునాతీరే అన్నట్లు పోటీ చేస్తున్నందున వారి అనైక్యతను కూడా ప్రజలు గుర్తించారన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లో అధి కారంలో లేని కాంగ్రెస్ గెలుపు వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయో జనం లేదని, ప్రభుత్వంలో లేని వారు ఎలాంటి అభివృద్ధి చేస్తారన్నారు. కాంగ్రెస్‌కు హుజూర్‌నగర్‌లో ఘోరపరాజయం ఖాయ మని, పోటీలో ఉన్న తెలుగుదేశం, బిజెపిలు సోయిలో లేకుండా పోతాయన్నారు. ప్రజలు వాటిని పట్టించుకోరన్నారు. కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీల నుండి పెద్ద సంఖ్యలో ప్రతిరోజూ టిఆర్ఎస్‌లో చేరుతు న్నారని, ఇది గెలుపు వాతా వరణానికి అద్దం పడు తుందన్నారు. తెలంగాణ రాష్ట్రసమితి హుజూ ర్‌నగర్ నియోజకవర్గంపై తొలిసారి జెండా ఎగరేయడం ఖాయమన్నారు. గత ఐదేళ్ళుగా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ప్రభుత్వం అభివృద్ధి చేయలేదని ఉత్తమ్ అనడం కూడా శుద్ధ అబద్ధమన్నారు. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే ఉన్నా ఎలాంటి వివక్షత చూపకుండా, అన్ని నియోజక వర్గాలతో సమానంగా హుజూర్ నగర్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామన్నారు. గత ఐదేళ్ళలో శాసనసభ్యుడిగా తన నియోజ కవర్గానికి ఫలానా పని కావాలని ఉత్తమ్ రాష్ట్ర ప్రభుత్వానికి ఒక్క లేఖ కూడా రాయలేదన్నారు.

# తెరాసకే సీపీఐ మద్దతు

### ఈ ఉప ఎన్నికల వరకే పరిమితం:చాడ



**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు సీపీఐ ప్రక టించింది. టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి విజయానికి కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది. రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో పార్టీ కార్యవర్గం మంగళ వారం భేటీ అయ్యింది. సుదీర్ఘంగా చర్చించిన అనం తరం టీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి వెల్లడించారు. టీఆర్ ఎస్ అభ్యర్థి తరపున ప్రచారంలో కూడా పాల్గొంటామని తెలిపా రు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో అందరి అభిప్రా యాలు తీసుకున్న తర్వాతే టీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని నిర్ణయించి నట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతానికి హుజూర్ నగర్ ఉప ఎన్నికల వరకు మద్దతివ్వాలని నిర్ణయించామని, విప్లవ పార్టీ అయిన సీపీఐ మద్దతు తీసుకుంటున్న టీఆర్ఎస్ మరింత బాధ్యతతో కమ్యూనిస్టుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటుందనే ఆశాభావం తమకుందన్నారు. టీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నంత మాత్రాన ప్రజాసమస్యలను ఎట్టి పరిస్థితు ల్లోనూ విస్మరించబోమని, నిరసనలు, ఉద్య మాలు కొనసాగి స్తామని ఆయన స్పష్టం చేశారు. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజా కూటమిగా ఏర్పడి టీడీపీ కాంగ్రెస్ పార్టీలతో పొత్తు పెట్టుకున్నామని, ఎన్నికల అనంతరం ఆ పార్టీలతో పొత్తు ముగిసిం దన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు కలిసి పనిచేశాయని ఆయన గుర్తు చేశారు. టీడీపీ, కాంగ్రెస్ పార్టీలకు మిత్రపక్షంగా కొనసా గినప్పుడు ప్రజా సమస్యలపై అసెంబ్లీ బయట, లోపల పోరాటం చేశామని, ఇప్పుడు కూడా ప్రభుత్వం తప్పుడు నిర్ణ యాలు తీసుకుంటే ఎత్తిచూపుతా మని చాడ తెలిపారు.

**ఆర్టీసీని విలీనం చేయాలి.. చర్చలు జరపండి**

బతుకమ్మ, దసరా పండుగ సమయంలో ఆర్టీసీ సమ్మెకు పిలుపునిచ్చిన దరిమిలా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే వారితో చర్చించి సమ్మె నివారణకు చర్యలు తీసుకో వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు. పండుగ సీజన్‌లో గ్రామాలకు వెళ్ళే ప్రజలు ఇబ్బందులు పడ కుండా చూడాలని ఆయన కోరారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరు తూ తీర్మానం చేసినట్లు చాడ వెంకటరెడ్డి వెల్లడించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శులు అతుల్ కుమార్ అంజన్, డాక్టర్ డి. నారాయణ, కార్యవర్గ సభ్యుడు సయ్యద్ అజీజ్‌పాషా తదితరులు హాజరయ్యారు.

# 31 నామినేషన్లు ఓకే

● సీపీఎం అభ్యర్థి సహా 45 తిరస్కరణ ● వృద్ధురాలికి నో చాన్స్ ● చిన్న కారణాలతో తప్పించారు.. హైకోర్టుకు వెళతామని హెచ్చరిక

**నల్గొండ, ప్రభన్యూస్ బ్యూరో** : హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో నామినేషన్లు తిరస్కరణకు గుర య్యాయి. ఎన్నికల బరిలో మొత్తం 76మంది అభ్యర్థులు నామి నేషన్ దాఖలు చేయగా పరిశీలనలో 45 దరఖాస్తులను తిరస్క రించారు. స్క్రూట్నీ అనంతరం ఉప ఎన్నికల బరిలో 31మంది అభ్యర్థులు మిగిలినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రయ్య ప్రకటించారు. అయితే గురువారం నామినేషన్ల ఉపసంహ రణకు గడువు ముగిసిన తరువాత అసలు రంగంలో మిగిలింది ఎందరన్నది తేలుతుంది.

నామినేషన్లు తిరస్కరణకు గురైన వారిలో సీపీఎం పార్టీ అభ్యర్థి పారేపల్లి శేఖర్‌రావు, 85ఏళ్ళ వృద్ధురాలు అమరవాది లక్ష్మీనరసమ్మ ఉన్నారు. నామపత్రాలు సక్రమంగా లేకపో వడంతో తొలగించినట్లు అధికారులు చెపుండగా, ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే అభ్యర్థుల సంఖ్య తగ్గించేందుకు చిన్న చిన్న కారణాలు చూపి తిరస్కరణకు గురిచేశారని సీపీఎం పార్టీ నేతలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు మండిపడుతున్నారు. సెప్టెంబర్ 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు హుజూర్‌నగర్ ఉప ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ జరిగింది. 76 మంది అభ్యర్థులు 119 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. పలువురు అభ్యర్థులు డిపాజిట్ చెల్లించపోవడం, ఫారం-26 సరిగ్గా నింపకపోవడం, నామినేషన్ల ఫారంలో కాక వేరే ఫారంలో నామినేషన్ దరఖాస్తు చేయడం, నామినేషన్ ఫారంపై సంతకాలు చేయకపోవడం, పదిమంది ప్రతిపాదకులు లేకపోవడం, ఫారం 26లో అభ్యర్థులు సంతకాలు చేయకపోవడం మూలంగానే అత్యధికంగా నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు అధికారులు చెప్తున్నారు.

**సీపీఎం ధర్నా.. తోడుగా సంఘాల నేతలు**

సీపీఎం అభ్యర్థి శేఖర్‌రావు, హెచ్‌యుఎఫ్ కాలం లేకుండా దరఖాస్తులు నింపడంతో తిరస్కరణకు గురైందని అధికారులు చెప్తున్నారు. అయితే దీనిని అంగీకరించని సీపీఎం పార్టీ నేతలు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం ముందు ధర్నా చేశా రు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే అభ్యర్థుల సంఖ్యను తగ్గిం చేందుకే నామినేషన్లను తిరస్కరించారని ఆరోపించారు. వీరితో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేసి తిరస్కరణకు గురైన వారు కూడా ఆందోళన చేశారు. వికలాంగుల సంఘం అధ్యక్షులు, సర్పంచ్‌ల సంఘం అభ్యర్థులు, పోడుభూముల అభ్యర్థులు ఆందోళనలో పాల్గొన్నారు.

**హైకోర్టుకు వెడతాం**

నామినేషన్లు తిరస్కరణకు గురికావడంపై హైకోర్టును ఆశ్రయిస్తామని అభ్యర్థులు చెప్తున్నారు. చిన్నచిన్న కారణాలను చూపి తొలగించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నిస్తున్నారు. ఉప ఎన్నికల బరిలో ఎక్కువమంది అభ్యర్థులు ఉంటారని అనుకున్నప్పటికి నామినేషన్లను సక్రమంగా నింపకపోవడంతో తొలగించడం ఉపబరిలో అభ్యర్థుల సంఖ్య తగ్గిపోయింది. నామి నేషన్ల స్క్రూట్నీలో తొలగించిన అభ్యర్థుల అభ్యంతరాలపై అధికారులకు విన్నవించుకోనున్నారు. ఈనెల 3వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగనుంది. 3వ తేదీ సాయంత్రం తర్వాత ఎంత మంది బరిలో ఉంటారన్నది తేలి పోనుంది. బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించడంతో పాటు వారికి క్రమసంఖ్యను కూడా అధికారులు కేటాయించనున్నారు. ఏది ఏమైనా ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న హుజూర్‌నగర్ ఉపఎన్నికల పోరులో ఒక్కొక్క ఘట్టం ముగుస్తూ వస్తుంది. ఉపసంహరణల ప్రక్రియ పూర్తయితే అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోనున్నారు.

# మాకు మద్దతివ్వండి



**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : హుజూర్‌నగర్ ఉపపోరులో కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వాలని తెలంగాణ జనసమితి నేతలను కాంగ్రెస్ బృందం కోరింది. మంగళవారం టీజేఎస్ కార్యాల యంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షు డు కోదండరామ్‌ను టీ పీసీసీ కోశాధికారి గూడూరు నారా యణరెడ్డి నేతృత్వంతో ఆ పార్టీ నేతలు కోదండరెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ తదితరులు కలిశారు. రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగిస్తున్న టీఆర్ఎస్‌ను ఓడించేందుకు కాంగ్రెస్‌తో కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, అందుకోసం ఐదుగురితో సబ్ కమిటీ వేశామని కాంగ్రెస్ నేతలకు కోదండరామ్ వివరించారు. మా పార్టీకి ఉన్న వనరులు పరిమితం కాబట్టే.. హుజూర్‌నగర్ ఉపపోరులో పోటీకి దూరంగా ఉన్నట్లు చెప్పారు. టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పని చేస్తున్నారని చాలామందిని పోలీసులు అరెస్టు చేయడం తగదని ఆయన హితవు పలికారు. సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భూమన్నయాదవ్‌ను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతామని ఆయన చెప్పారు. కాంగ్రెస్‌కు టీజేఎస్ మద్దతు ఉంటుందని గూడూరు నారాయణరెడ్డి ఆశాభవం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, టీజేఎస్‌లది సిద్ధాంత పరంగా ఒకే ఎజెండా అని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. నిరంకుశ, నియంతృత్వ పాలనకు మా రెండు పార్టీలు వ్యతిరేకమన్నారు. ఎన్నికల్లో ఓట్లను కొనుగోలు చేయడమే టీఆర్ఎస్ నేతల పని అంటూ విమర్శించారు.

# నా పరిధి నాకు తెలుసు!

● మూడు సార్లు ఎంపీగా చేశా ● ప్రజలు నా దగ్గరకు వస్తారు ● ఎన్నికలతో సంబంధం ఏముంది!: మండలి చైర్మన్



**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : హుజూర్‌నగర్ ఎన్నిక నేప థ్యంలో తనపై కొందరు ఆరోపణలు చేస్తున్నారని, తనపై విమర్శలు చేస్తున్న వారి గెలుపుకోసం క ూడా తాను పనిచేశాననేది వారు గుర్తుంచుకోవాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మంగళ వారం అసెంబ్లీ ఆవరణలో బతుకమ్మ ఉత్సవాలను ప్రారంభించిన ఆయన ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు స్పందించారు. తాను మూడు సార్లు ఎంపీగా పనిచేశానని, స్థానిక ప్రజలు తన దగ్గరికి సహజంగా వస్తుంటారన్నారు. దానికి ఎన్నికలతో సంబంధం లేద న్నారు. రాజ్యాంగ పదవిలో ఉన్న తాను మండలి ఛైర్మన్ పదవి గౌరవాన్ని కాపాడుతానన్నారు. ఆ పదవికి ఉన్న పరిధి, బాధ్యతలు అన్నీ తనకు పూర్తిగా తెలుసునన్నారు. తనపై గవర్నర్‌కు ఫిర్యాదుచేసిన వాళ్ళు మండలి ఛైర్మన్, గవర్నర్ అధికారాలేంటో తెలుసుకుని మాట్లాడితే మం చిదన్నారు.

# తెరాస, బీజేపీ తోడు దొంగలు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : టీఆర్ఎస్, బీజేపీ పార్టీలు తోడు దొం గలని, అలాకానిపక్షంలో, దమ్ముంటే తెరాస ప్రభు త్వం అవినీతిపై కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం విచారణ జరిపించాలని టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ డిమా ండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కు పొన్నం ప్రభాకర్ లేఖ రాశారు. టీఆర్ఎస్ ప్రభు త్వం భారీగా అవినీతికి పాల్పడు తోందని బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీనడ్డాతో పాటు, రాష్ట్ర బీజేపీ నేతలు కూడా ఆరోపించిన విషయాన్ని పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. బీజేపీ, టీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని, తెలం గాణ కోసం బీజేపీ ఏమి చేసిందో చెప్పాల న్నారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు కట్ట దెబ్బతింటే బీజేపీ ఎందుకు మాట్లాడటం లేదని ఆయన ప్రశ్నిం చారు.



**హైకోర్టు ప్రాంగణంలో బతుకమ్మ ఉత్సవాలను ప్రారంభించిన సీజే రాఘవేంద్రసింగ్ చౌహాన్. ఉత్సవాల్లో పాల్గొన్న న్యాయమూర్తి జస్టిస్ జి.శ్రీదేవి, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు టి.సూర్యకరణ్ రెడ్డి, మహిళా న్యాయవాదులు.**



# మున్సిపోల్స్ జాప్యం?

## నవంబర్ లేదా డిసెంబర్ మొదటి వారంలో నిర్వహించే అవకాశం



- వార్డుల విభజన, రిజర్వేషన్లపై దృష్టి సారించిన హైకోర్టు
- ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తెరాస, కాంగ్రెస్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్రంలో నగర, పురపాలక ఎన్నికల నిర్వహణ మరింత ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికలకు సంబంధించి హైకోర్టు ధర్మాసనం తాజాగా ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈ ఎన్నికలు నవంబర్ చివరి వారంలో జరిగే వీలుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి జరిగే ప్రక్రియను పూర్తి చేయాలని తుదితీర్పుకు లోబడి ఎన్నికల నోటిఫికేషన్‌ను జారీ చేయాలని హైకోర్టు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించిన సంగతి తెలిసిందే. హైకోర్టు తీర్పును దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో నగర పాలక, పురపాలికలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. తీర్పును వెలువరించిన రెండు, మూడు రోజుల్లోనే ఎన్నికల నోటిఫికేష న్‌ను జారీచేసి ఇరవై రోజుల వ్యవధిలో పోలింగ్‌ను నిర్వహిం చి ఫలితాలను ప్రకటించాలని ఎన్నికల సంఘం భావించింది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. అయితే వార్డుల పునర్విభజన హేతుబద్ధంగా జరగలేదని ఇష్టానుసారంగా వార్డులను ప్రకటించారని, బీసీ జనగణన చేయలేదని, రిజర్వేషన్ల అంశంలోనూ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిం చిందని ఆరోపిస్తూ వివిధ సంఘాలు, రాజకీయ పక్షాలు హైకోర్టును ఆశ్రయించాయి. ఈ అంశాలపై విచారించిన హైకోర్టు ధర్మాసనం 75 పురపాలక సంఘాలకు ఎన్నికలు నిర్వహించరాదని, పిటిషనర్లు ఆరోపించినట్టుగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్లు నిబంధనలకు లోబడి చేయాలని ఆ తర్వాతే ఎన్నికల నిర్వహణకు సంబంధించి తుదితీర్పును వెలువరిస్తామని హైకోర్టు ఆదేశించింది. దీంతో ఎన్నికల సంఘం స్టే విధించిన 75 పురపాలక సంఘాలను పక్కనబెట్టి మిగతా మునిసిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిం చేందుకు అనుమతించాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. జరిగిన లోపాలను సరిదిద్దకుండా వార్డుల విభజన ఆశించిన రీతిలో చేయకుండా, రిజర్వేషన్లను అమలు చేయ కుండా ఎన్ని కలు ఎలా నిర్వహిస్తారని హైకోర్టు ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించిన సంగతి తెలిసిందే. ఎన్నికల సంఘం దాఖలు చేసిన పిటిషన్లపై మంగళవారం విచారణ జరిపిన హైకోర్టు ఎన్నికల నిర్వహణకు ముందు జరిగే ప్రక్రియను పూర్తి చేయాలని ఆ తర్వాతే ఎన్నికల నోటిఫికేషన్‌ను జారీ చేయాలని అది కూడా హైకోర్టు తుదితీర్పుకు లోబడి ఉండాలని ఆదేశించింది.

### సిద్ధమే కానీ..

రాష్ట్రంలో 131 పురపాలక సంఘాలకు మూడు నగర పాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థల పదవీకాలం ఎప్పుడో పూర్తి కావడం ప్రస్తుతం ప్రత్యేకాధి కారుల పాలనలో ఇవి నిర్వహిస్తుండడంతో క్షేత్రస్థాయి లో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రభుత్వం చెబుతోంది. ఒక్కో అధికారికి నాలుగైదు పురపాలక సంఘాల నిర్వహణ బాధ్యతలను అప్పగించామని, భారీ వర్షాలు కురుస్తున్న ఈ సమయంలో నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో పారిశుధ్యం కాపా డాల్సిన అవసరం ఉందని అందుకే ఎన్నికల నిర్వహణకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం కోరుతోంది. హైకోర్టు తీర్పు అనుకూలంగా వస్తే రెండు, మూడు రోజుల్లోనే ఎన్నికల నోటిఫి కేషన్‌ను వెలువరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రిజర్వేష న్లను కూడా ఖరారు చేసి ఎన్నికల సంఘానికి జాబితా ఇచ్చేం దుకు పురపాలకశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. అధికార పార్టీ తెరాస సైతం పురపాలక ఎన్నికలను అత్యంత ప్రతిష్టా త్మకంగా తీసుకోవడంతో పాటు సవాల్‌గా స్వీకరించిం ది. పుర పాలకశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తెరాస కార్యని ర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు మంత్రిగా బాధ్యత లు చేపట్టిన కొన్ని రోజుల్లోనే పార్టీ ముఖ్యులతో, ఎమ్మెల్యేలు, ఎమ్మె ల్సీలు, మంత్రులతో సమావేశమై పురపాలక, నగర పాలక సంస్థల ఎన్నికలకు సంబంధించి దిశానిర్దే శం చేశారు. హుజూర్‌నగర్ ఉపఎన్నికలకు పార్టీ తరపున ఆ నియోజక వర్గానికి వెళ్లిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలు స్థాని కంగా ఉంటూ పురపాలక ఎన్నికలపై కూడా నేతలతో చర్చిస్తు న్నట్టు తెలుస్తోంది. ఎన్నికలు జరిగే జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులను హుజూర్ నగర్ ఉపఎన్నిక ప్రచారానికి పంపిం చకుండా వారి జిల్లాలోనే ఉంటూ పురపాలక ఎన్ని కలపై దృష్టిసారించాలని పార్టీ అధినేత కేసీఆర్ మంత్రి కేటీ ఆర్‌కు ఆదేశిం చారు. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాలకు చెందిన నేతలను మాత్రమే హుజూర్‌నగర్ ఉపఎన్నికలకు సంబంధిం చి సేవలను వినియోగించు కుంటున్నా రు. ఖమ్మం, వరంగల్ నగర పాలక సంస్థలకు ఇప్పట్లో ఎన్నికలు లేకపో వడంతో ఈ రెండు కార్పొ రేషన్లకు చెందిన పార్టీ నేతలను హుజూర్‌నగర్ ఉపఎన్నిక ప్రచారానికి పార్టీ అధినాయకత్వం పంపించింది.

### ముందస్తు ఏర్పాట్లపై దృష్టి

హైకోర్టుకు బుధవారం నుంచి ఈనెల 13 వరకు దసరా సెలవులు ప్రకటించిన సంగతి తెలిసిందే. 14వ తేదీ తిరిగి హైకోర్టు పనిచేయడం ప్రారంభిస్తుంది. 14 తర్వాత మునిసిపల్ ఎన్నికలకు సంబంధిం చి విచారణ జరుపు తామని హైకోర్టు ధర్మాసనం తెలిసింది. ఈలోపు ఎన్నికలకు సంబంధించిన మిగతా పనులను చక్కబెట్టేందుకు ఎన్నికల సంఘం సమాయత్తం కావాలని నిర్ణయించింది. బీసీ జనగణనతో పాటు ప్రతియేటా జనవరిలో ఓటర్ల జాబితాను సవరించాల్సి ఉంటుంది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, రాజకీయ పక్షాల ప్రతినిధులతో, అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి ఎన్నికలకు సమాయత్తమ య్యారు. నగర పాలక సంస్థల్లోనూ ఈ తరహా సమావేశాలను నిర్వహించారు.

వార్డుల విభజనపై వివిధ సంఘాలు, రాజకీయ పక్షాలు లేవనెత్తిన అభిప్రాయా లను, చేసిన ఆరోపణలపై దృష్టి సారించిన ఎన్నికల సంఘం చేసిన తప్పులను సవరిస్తామని హైకోర్టుకు నివేదించింది. ఇప్పటికే జిల్లా స్థాయిలో ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను ప్రకటించింది. ఒక్కో ఓటరుకి రెండు, మూడుచోట్ల ఓటువేసే అవకాశం ఉండడాన్ని కూడా కొందరు పిటిషనర్లు తప్పుబట్టి ఈ విషయాన్ని హైకోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ అంశంపై కూడా హైకోర్టు ధర్మాసనం తీవ్ర ఆక్షేపణ వ్యక్తంచేసింది. మహిళా రిజర్వేషన్ల విషయంలోనూ తప్పిదాలు చోటు చేసుకున్నాయని వివిధ రాజకీయ పార్టీల నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాయి. ఈ నేపథ్యంలో నగర పాలక, పురపాలక సంఘాల పాలక మండలికి సంబంధించిన ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే అవకాశాలు లేకపోలేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. హైకోర్టు తప్పుబట్టిన, వెలుబుచ్చిన అనేక అంశాలను సవరించే ప్రయత్నం చేస్తున్నామని రిజర్వేషన్లను ఖరారుచేసే అధికారం ప్రభుత్వానిదని అంతిమంగా ఈ రిజర్వేషన్లు హైకోర్టు సంతృప్తి చెందకపోతే ఎన్నికలు మరికొన్ని రోజులు వాయిదా పడక తప్పదని అభిప్రాయ పడుతున్నారు.

# 8 మంత్రివర్గ ఉపసంఘాలు

- పథకాల అమలు, పర్యవేక్షణ బాధ్యతలు
- మంత్రులందరికీ భాగస్వామ్యం.. తక్షణం ఏర్పాటు
- 10న కలెక్టర్లతో భేటీ... 30 రోజుల ప్రణాళికపై సమీక్ష
- వ్యవసాయంపై ఫోకస్.. కొనుగోళ్లపై విస్తృత చర్చ
- ఏడున్నర గంటలుపాటు సాగిన కేబినెట్ భేటీ... కీలక నిర్ణయాలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ప్రభుత్వ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేసేందుకు, క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలవుతున్నదీ లేనిదీ పర్యవేక్షించేందుక ు శాశ్వత ప్రాతిపదికన వేర్వేరుగా ఎనిమిది మంత్రివర్గ ఉపసంఘాలను నియమించాలని మంత్రిమండలి నిర్ణయించింది. ఈ కమిటీల్లో మంత్రులందరికీ భాగస్వామ్యం కల్పిస్తూ, సంక్షేమ, వ్యవసాయ, వైద్యఆరోగ్యం, గ్రామీణ పారిశుద్ధ్యం, పట్టణ పారిశుద్ధ్యం, వనరుల సమీకరణ, పచ్చదనం, పౌల్ట్రీ కమిటీలను ఏర్పాటు చేసింది. అలాగే గ్రామాల్లో ప్రస్తుతం అమలవుతున్న 30 రోజుల ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక అమలు తీరుపై చర్చించేందుకు ఈ నెల 10న సీఎం కేసీఆర్ అధ్యక్షతన మంత్రులు, కలెక్టర్లతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. అదేవిధంగా రాష్ట్రంలో ప్రస్తుత వ్యవసాయ రంగ పరిస్థితిని సుదీర్ఘంగా చర్చించిన మంత్రివర్గ వర్షాకాలంలో పండిన అన్ని రకాల పంటలను ప్రభుత్వ పరంగా కొనుగోలు చేయడానికి పౌర సరఫరాల సంస్థతోపాటు, అన్ని ప్రభుత్వ సంస్థలు సంసిద్ధం కావాలని తీర్మానించింది. వేసవి కాలం పంటలకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను ముందస్తుగానే సమీక రించుకోవాలని ఆదేశించింది. దీనికవసరమైన విధాన రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. మంగళవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ అధ్యక్షతన ఏడున్నర గంటలపాటు జరిగిన మంత్రిమండలి సమావేశంలో కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేశారు. ప్రభుత్వ కార్యక్రమాల పకడ్బందీ అమలు, ఎప్పటికప్పుడు కార్యక్రమాల పర్యవేక్షణకు, ప్రభుత్వానికి తగు సూచనలు చేసే లక్ష్యంతో మంత్రివర్గ ఉప సంఘాలు పనిచేయనున్నాయి. ఈ మేరకు కమిటీలను కూడా ఆమోదిస్తూ మంగళవారం మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అయితే ఈనెల 10న జరగనున్న మంత్రులు, కలెక్టర్ల సమావేశంలో డిపిఓలను, డీఎల్పీవోలను క ూడా ఆహ్వానించనున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం కాపాడేందుకు ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, భవిష్యత్‌లో తీసుకోవాల్సిన పనులపై ఈ సమావేశంలో చర్చించి కీలక నిర్ణయాలు ప్రకటించనున్నారు.

**ఇవీ కమిటీలు,వ్యవసాయ కమిటీ**

వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అధ్యక్షతన మంత్రులు గంగుల కమలాకర్, జగదీష్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావులు సభ్యులుగా వ్యవసాయ కమిటీని నియమించింది. సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించడం, కల్తీలను నిరోధించడం, వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న కార్యక్రమాలను అమలు చేయడం, విత్తనాలను, ఎరువులను సేకరించేందుకు సమగ్ర విధానం రూపొందించడం తదితర కార్యక్రమాలను ఈ కమిటీ పర్యవేక్షించనుంది. రైతులకు గిట్టుబాటు ధర, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పడం వంటి ఇతర కార్యక్రమాలనూ పరిశీలించనుంది.

**సంక్షేమ కమిటీ :** సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ నేతృత్వంలోని ఈ కమిటీలో మంత్రులు మహమూద్ అలీ, సత్యవతీ రాథోడ్, గంగుల కమలాకర్‌లు సభ్యులుగా కొనసాగుతారు. వివిధ వర్గాల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలను ఈ కమిటీ పర్యవేక్షించనుంది.

**వైద్య, ఆరోగ్య కమిటీ:** కమిటీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ అధ్యక్షతన పనిచేయనుంది. ఇందులో మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ సభ్యులుగా కొనసాగనున్నారని ప్రభుత్వం తెలిపింది. ఈ కమిటీ ప్రధానంగా రాష్ట్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వివిధ సీజన్లలో వచ్చే అంటువ్యాధులు, ఇతర రోగాల విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ పరంగా చేయాల్సిన పనులను పర్యవేక్షించి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సూచనలు చేయనుంది.

**గ్రామీణ పారిశుద్ధ్య కమిటీ:** పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాక ర్ రావు అధ్యక్షతన మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, పువ్వాడ అజయ్‌లను సభ్యులుగా నియమించారు. ప్రస్తుతం అమలవుతున్న 30 రోజుల ప్రణాళిక అమలులోనూ. భవిష్యత్తులో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ఈ కమిటీ పర్యవేక్షణ చేస్తుంది. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు అవసరమైన కార్యాచరణను అమలు చేసే విషయంలో ఈ కమిటి ప్రతినిత్యం అప్రమత్తంగా ఉంటుంది.

**పట్టణ పారిశుద్ధ్య కమిటీ:** మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అధ్యక్షతన మంత్రులు హరీస్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి సభ్యులుగా పట్టణ పారిశుద్ధ్య కమిటీని ప్రభుత్వం నియమించింది. పట్టణాలను పరిశుభ్రంగా ఉంచే కార్యాచరణను ఈ కమిటీ పర్యవేక్షించి ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోనుంది.

**వనరుల సమీకరణ కమిటీ:** ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు అధ్యక్షతన మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్ సభ్యులుగా వనరుల సమీకరణ కమిటీని ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర స్థాయిలో వనరులను సమీకరించుకోవడం, కేంద్ర ప్రభుత్వంనుంచి నిధులను రాబట్టడం తదితర అంశాలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది.

**పచ్చదనం కమిటీ:** అటవీ శాఖ మంత్రి అల్లో ఇంద్రకరణ్‌రెడ్డి అధ్యక్షతన మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ప్రశాంత్‌రెడ్డిలు సభ్యులుగా ఈ కమిటీని ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణలో పచ్చదనం పెంపు, అడవుల పరిరక్షణ, కలప స్మగ్లింగ్ అరికట్టడం వంటి పనులను పర్యవేక్షించనుంది.

**పౌల్ట్రీ కమిటీ:** పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఈటెల రాజేందర్, నిరంజన్‌రెడ్డి సభ్యులుగా ఏర్పాటైన ఈ కమిటీ రాష్ట్రంలో ఈ రంగంపై ఆధారపడిన రైతాంగాన్ని ఆదుకునేందుకు, పౌల్ట్రీ పరిశ్రమ పటిష్టానికి అవసరమైన పౌల్ట్రీ పాలసీ తీసుకురావడంతోపాటు, పౌల్ట్రీ అభివృద్ధికి తీసుకునే చర్యలను పర్యవేక్షించనుంది. మంచి పౌల్ట్రీ పాలసీ విధానాలు అవలంబిస్తున్న రాష్ట్రాల్లో పర్యటించి అక్కడి విధానాలను అధ్యయనం చేయనుంది.

# అటవీ భూముల సరిహద్దు సర్వేకు రెడీ

- రెండు శాఖలతో ప్రత్యేక బృందాలు
- సర్వే నెంబర్లతో స్పష్టత
- సీఎం కేసీఆర్ ఆదేశాలు
- చర్యలు తీసుకుంటున్న అటవీ, రెవెన్యూశాఖలు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** అటవీ భూముల సరిహద్దుల సమస్యల తీర్చేలా రెవెన్యూ శాఖ సమన్వయంతో ముందుకెళుతోంది. రాష్ట్రంలోని ఈటవీ, రెవెన్యూ భూముల మధ్య సరిహద్దుల సర్వేకు ప్రభుత్వంలో కదలిక వచ్చింది. కలెక్టర్‌లకు ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. త్వరలో సరిహద్దు సమస్యలను తీర్చేందుకు మరో సర్వేకు తెలంగాణ ప్రభుత్వం విప్లవాత్మక అడుగులు వేయనున్నది. ఈ నెలాఖరులోగా ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఐఎల్ఆర్ఎంఎస్) పోర్టల్‌లో వివాదాల్లే ని భూములను నమోదు చేయనున్నారు. సర్వే నెంబర్లు వేసి పక్కాగా జాతకం సిద్ధం చేయాలని సర్కార్ ఆదేశాలకనుగు ణంగా రెవెన్యూ శాఖ కసరత్తు చేస్తున్నది. సర్వే నెంబర్లు లేని భూములకు ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ఆధారంగా నెంబర్లను కేటాయించను న్నారు. నల్గొండలో 33212.11 ఎకరాలు, భూపాలపల్లిలో 26,507 ఎకరాలు, కుమరం భీం జిల్లాలో 21,753ఎకరాలు, మంచిర్యాలలో 20,155 ఎకరాలు, మెదక్ జిల్లాలో 17,947 ఎకరాలు, వికారాబాద్‌లో 16,319 ఎకరాలు, కామారెడ్డిలో 15730 ఎకరాలు, నిజామాబాద్‌లో 12689 ఎకరాలలు, మహబూబాబాద్‌లో 12644 ఎకరాల భూముల్లో సరిహద్దు సమస్యలు తేల్చాల్సి ఉంది. మొత్తంబీద 30 జిల్లాల్లో 2చ18,980 ఎకరాల భూముల్లో సరిహద్దు వివాదాలు రెవెన్యూ, అటవీ శాఖల నడుమ నలుగుతున్నాయి. 2017లో జరిగిన భూ రికార్డుల ప్రక్షాళనలో 41.74 లక్షల ఎకరాల అటవీ భూమి ఉన్నట్లు గుర్తించగా, సరిహద్దు వివాదాలు భారీగా పరిష్కరించాల్సి ఉందని ఆ తర్వాత వెల్లడైంది. ప్రభుత్వ శాఖల మధ్య సరిహద్దు సమస్యలు లేకుండా చూడా లన్న సీఎం కేసీఆర్ ఆదేశాలతో అధికారులు కీలక చర్యలకు శ్రీకారం చుడుతున్నారు. సరిహద్దు సమస్యలు, ఆక్రమణల నివారణకు రెవెన్యూ, అటవీ అధికారులతో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందా లను గతంలోనే ఏర్పాటు చేశారు. ఫారెస్ట్ భూముల పరిరక్షణకు ఉమ్మడి రాష్ట్రంలో జాయింట్ సర్వేకు సర్కార్ చొరవలేకపోవడంతో మధ్యలోనే నిల్చిపోయాయి. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో అటవీ సరిహద్దు సమస్యలు రైతులకు శాపంగా మారాయి. ఈ నేపథ్యంలో ప్ర భుత్వం భూ రికార్డుల ప్రక్షాళనలోనే సర్వే చేయాలని భావించింది. కానీ పనిఒత్తిడితో సాకారం కాలేదు. రెండు శాఖలు సంయుక్తంగా సమన్వయంతో చేపట్టే జాయింట్ సర్వేద్వారా ఆదివాసీల సమస్య కూడా కొలిక్కి రానుంది. 6లక్షల ఎకరాల్లో గిరిజనులు, ఆదివాసీలు పోడు వ్యవసా యం చేసుకుంటున్నారని, వాటిపై తమకు పట్టాలు ఇవ్వాలని షెడ్యూల్ తెగలు, ఇతర ఆదివాసీలు అటవీ హక్కుల గుర్తింపు చట్టం-2006 కింద లక్షా 83వేలకుపైగా దరఖాస్తులు ప్రభు త్వానికి సమర్పించారు. ఇందులో ఆదివాసీలతోపాటు ఇతరు లు కూడా ఉన్నారు. అయితే 93,639 మంది ఆదివాసీలకు 3,00,284 ఎకరాల భూములకు చెందిన అటవీ హక్కు పత్రాలిచ్చారు. ఇంకా 90 వేల మంది దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచారు. త్వరలో వీటిపై ప్రభుత్వం స్పష్టత తేనున్నది. రాష్ట్రంలోని భూభాగంలో 33 శాతం అటవీ భూ మి ఉందని ఒక అంచనా. ఈ రికార్డులకు లెక్కలు లేకపోగా రెండు శాఖల మధ్య భిన్నమైన వివరాలు నమోదయ్యాయి. అటవీ భూములకు చెందిన 41.74 లక్షల ఎకరాల్లో వివాదాలు లేకుండా పక్కాగా ఉండగా, 25 లక్షల ఎకరాల భూమి సర్వే చేయాల్సి ఉంది. ఇవి రెవెన్యూ రికార్డుల్లో ఫారెస్టు, పోరంబోక ు, జంగ్లత్, మహషురా తదితర పేర్లతో నమోదై ఉన్నాయి. ఆయా భూములకు చెందిన రికార్డుల్లో అటవీ భూమి అనే ఒకే పేరుతో రికార్డులను సరిదిద్దాలని సర్కార్ భావిస్తోంది.

# పదవి కోసం 'క్లినికల్' రాజకీయాలు!

- బయటకు పొక్కడం... విచారణ వరకు అంతా పథకం ప్రకారం వ్యవహారం
- వైద్యవర్గాల ఆధిపత్య పోరు... ఆచితూచి ప్రభుత్వం అడుగులు
- డీఎంఈ డా. రమేష్ రెడ్డి వర్సెస్ హెచ్ఓడీ డా. రవికుమార్
- మధ్యలో ఆర్ఎంఓ ఆరోపణలు

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** కలకలం రేపిన నిలోఫర్ ఆసుపత్రి క్లినికల్ ట్రయల్స్ ఉదంతం వైద్యుల నడుమ ఆధిపత్యపోరును తెరపైకి తెచ్చిం ది. అరోపణల దగ్గర నుంచి విచారణ వరకు ఓ వర్గం పక్కా ప్రణాళికతో పావులు కదుపుతోంది. దీనివెనక వైద్యశాఖలోని ఉన్నతాధికారుల పాత్రకూడా ఉన్నట్లు వైద్యులు చర్చించుకుంటు న్నారు. పథకం ప్రకారం ఓ వర్గం డాక్టర్లు సచివాలయం వేదికగా చక్రం తిప్పుతూ ప్రత్యర్థి వర్గం డాక్టర్లపై పెత్తనం సాగిస్తున్నారు. వీరిలో ప్రధానంగా చిన్నపిల్లల ఆసుపత్రి నిలోఫర్ అడ్డాగా ఈ వ్యవహారాలు నడుపుతుండటం చర్చనీయాంశంగా మారింది. ఓ వర్గంగా ఏర్పడిన వీరు ఇతర సీనియర్ల అవకాశాలకు అడ్డుపుల్లలు వేయడానికే నిలోఫర్ అంశాన్ని తెరమీదికి తెచ్చినట్లు ఆసుపత్రి వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో పత్రికలకు లీకులువ్వటం, వివాదం ముదిరాక దానిపై విచారణ రూపంలో అవతలి వర్గం వైద్యులను ఇరకాటంలో పెట్టేందుకు ఓ ప్లాన్‌ను అమలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేసి ప్రస్తుతం డీఎంఈగా ఉన్న డా.రమేష్ రెడ్డి, క్లినికల్ ట్రయల్స్‌లో అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ విభాగం హెచ్ఓడి డా.రవికుమార్ సహాధ్యాయులు. డీఎంఈ పదవి సీనియర్ టీచింగ్ డాక్టర్ల కు రొటేషన్ విధానంలో వచ్చేది. అయితే డా.రమేష్ రెడ్డి పదవీకాలం రెండేళ్లు పూర్తయ్యింది. కానీ ఆ పదవిని వీడకుండా వైద్యశాఖ ఉన్నతాధికారుల అండతో కొనసాగుతున్నారని ఆరోపణ ఉంది. ఈయన తరువాత ఈ అవకాశం దక్కాల్సిన సీనియర్లలో ఈయన సహాధ్యాయి డా.రవికుమార్ ముందువరుసలో ఉన్నారు. ఈ విషయాన్ని గుర్తుచేస్తూ డా. రవికువూర్ ఇటీవల ఉన్నతాధికారులను వాకబు చేశారు. ఈ విషయం తెలుసుకున్న సదరు డీఎంఈ ఈయనను ఆ పదవిలోకి రాకుండా నిలోఫర్ క్లినికల్ ట్రయల్స్‌ను వివాదాస్పదం చేసినట్లు వైద్యులు చర్చించుకుంటున్నారు. ఇదే విషయాన్ని డా.రవికుమార్ మీడియా ముఖంగా ఆరోపించటం ఈ వాదనకు బలాన్నిస్తోంది. ఈ క్లినికల్ ట్రయల్స్ కూడా డా. రమేష్‌రెడ్డి నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ గా పనిచేసిన సమయంలో ఇచ్చినవే కావటం గమనార్హం. ఓ పథకం ప్రకారం కొన్ని పత్రికలకు లీకులిచ్చి, ఈ వార్తల నేపథ్యంలో విచారణ జరుపుతున్నట్లు ఓ విచారణ కమిటీ వేయటం వెనక ఓ పథకం ఉన్నట్లు వరుస సంఘటనలను పరిశీలిస్తే అవగతమవుతోంది. అదే ఆసుపత్రిలో ఆర్ఎంఓగా పనిచేస్తున్న డా:లాలూప్రసాద్ రాథోడ్ విచారణ కమిటీని తప్పుపడుతూ ఐదు ట్రయల్స్ పైన ఐదుగంటల్లో ఎలా విచారించగలరని ప్రశ్నించారు. సీబీసీఐడీ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. క్లినికల్ ట్రయల్స్ అంశంపై సంబంధిత సూపరింటెండెంట్‌ను పరిగణనలోకి తీసుకోకుండా ఆయన బాహాటంగా ఆరోపణలు చేయటం వెనక పెద్దల హస్తం ఉందని చర్చ జరుగుతోంది. అతడు వైద్యుల సంఘం అధ్యక్షుడి హోదాలో మాట్లాడినా, అది ఆధారాలు లేకుండా మాట్లాడటం ఎంతవరకు సమంజసం అనే మరొవిషయం. తాను చేసిన ఆరోపణలను నిగ్గు తేల్చాల్సింది విచారణ కమిటి అని పేర్కొంటున్నప్పటికి, ఔషధ నియంత్రణ అధికారులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. కానీ అలాంటిదేమీ పాటించలేదని సమాచారం. ఇప్పటికే పరిమితికి మిచి వచ్చే చిన్నారి పేషంట్లతో ఎప్పుడూ రద్దీగా ఉంటుండటంతో ఇక్కడి వైద్యులు, ఇతర సిబ్బంది సతమతవుతున్నారు. దీనికి తోడు తమ ఆధిపత్యం కోసం కొందరు సృష్టిస్తున్న వివాదాలు వీరిని మరింత కుంగదీస్తున్నాయనే వాదన వినిపిస్తోంది. ఏదేమైనా ఇప్పటికైనా ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి వివాదానికి కారకులైన వారిపై చర్య తీసుకొని నిలోఫర్ ఆసుపత్రిని గాడిలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. విచారణ కమిటీ ఇచ్చిన ప్రాథమిక నివేదికపై భిన్న వాదనలు ప్రచారంలోకి వచ్చాయి. ఏ విషయం స్పష్టంగా చెప్పని డీఎంఈ వారంలోగా నివేదిక అందించాలని మాత్రం సర్క్యులర్ విడుదల చేశారు.




## మున్సిపోల్స్‌కు సిద్ధం కండి

(మొదటిపేజీ తరువాయి)

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్, జస్టిస్ ఎ.అభి షేక్ రెడ్డితో కూడిన డివిజన్ బెంచ్ మంగ ళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.'

### 27 రోజుల్లో ఎన్ని కలు పూర్తి చేస్తాం.

వార్డుల పునర్విభజన, రిజర్వేషన్లు, వంటి ముందస్తు ప్రక్రియను పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం నివేదించింది. ప్రభుత్వం ఎన్నికల ముందస్తు ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత ఓటర్ల జాబితా విడుదల చేసేందుకు వారం రోజుల సమయం పడుతుందని, ఆ తర్వాత ఎన్నికలు పూర్తి చేయడానికి 20 రోజులు మొత్తం 27 రోజుల సమయం పడ్తుందని ఎన్నికల సంఘం తరపు సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ విన్నవించారు.

## సెక్రటేరియట్ కూల్చొద్దు!

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించింది. ఒక వేళ ప్రభుత్వం కూల్చివేతకు ఉపక్రమిస్తే అది ఉపన్యాయం (సబ్ జుడి స్) అవుతుందని పైగా న్యాయప్రక్రియ మొత్తం వృధా అవుతుందని హైకోర్టు వ్యాఖ్యానించింది. సచివాలయ భవనాల కూల్చివేతకు తమ సమ్మతి తెలిపే వరకు ప్రభుత్వం ఎలాంటి పనులు చేపట్టకూడదని హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది. ఈ విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేయా లని తెలంగాణ అడ్వకేట్ జనరల్ కు హైకోర్టు స్పష్టం చేసింది. కాగా ప్రస్తుత సచివాలయం నుంచి మొత్తం కార్యాల యాలను బీఆర్ కేఆర్ భవనానికి తరలించినట్లు తెలంగాణ ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ ఎ.అభిషేక్ రెడ్డి తో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ఈనెల 14కి వాయిదా వేసింది.

### ఐదు వ్యాజ్యాలు...

సచివాలయ సముదాయంలోని భవనాలను కూల్చివేసి, అదే స్థలంలో నూతనంగా భవనాలను నిర్మించకుండా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థిస్తూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హైకోర్టులో 2016లో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. అలాగే సచివాలయ కూల్చివేతను సవాలు చేస్తూ న్యాయవాది టీ రజనీకాంత్ రెడ్డి, ఫోరం ఫర్ గవర్నెన్స్ కార్యదర్శి పద్మనాభరెడ్డి, సామాజిక కార్యకర్త ఓఎం దేబరా హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. సచివాలయం కూల్చివేతను సవాలు చేస్తూ విశ్రాంత ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్ రావు కూడా ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన సంగతి విదితమే. సచివాలయాన్ని కూల్చివేయకుండా ఆదేశించాలని అభ్యర్థిస్తూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎంపీ ఎ.రేవంత్ రెడ్డి కూడా తాజాగా ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎస్ సత్యంరెడ్డి వాదనలు వినిపిస్తూ.. .సచివాలయ భవనాల కూల్చివేత వ్యవహారంపై వాస్తవ పరిస్థితిని టీఏజీ ద్వారా తెలుసుకోవాలని ఉందని విన్నవించారు. దీనిపై స్పందించిన సీజే తెలంగాణ అడ్వకేట్ జనరల్ ను పిలిపించారు. వాస్తవ పరిస్థితిని వివరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తెలంగాణ అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ...ప్రస్తుత సచివాలయం నుంచి కార్యాలయాలను మొత్తం బీఆర్‌కేఆర్ భవన్‌కు తరలించినట్లు తెలిపారు. సచివాలయ భవనాలను కూల్చివేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు నివేదించారు. ఇది తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయమని తెలిపారు. అందువల్ల ఈ ప్రజాహిత వ్యాజ్యాలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని, తద్వారా సచివాలయ భవనాలను కూల్చివేసి, వాటి స్థానంలో ఆధునిక సచివాలయ సముదాయాన్ని నిర్మించేందుకు ప్రభుత్వానికి దారి చూపాలని అభ్యర్థించారు. దీనిపై సీజే స్పందిస్తూ నూతన భవన సముదాయం నుంచి పనులు కొనసాగించాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ ప్రజాహిత వ్యాజ్యాలపై విచారణ వీలైనంత త్వరగా ముగించ నున్నట్లు ప్రకటించారు. తదుపరి విచారణ ఈ నెల 14 కి వాయిదా వేశారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

బుధవారం 2 అక్టోబర్ 2019

# మహాత్ముడికి మహా నివాళి

అక్టోబరు 2 .. పిన్నల నుంచి పెద్దల దాకా గుర్తుండిపోయే రోజు. విశ్వమానవాళికి విశ్వమంతటి సందేశాన్ని అందించిన జాతిపిత మహాత్మాగాంధీ పుట్టిన రోజు. నూట యాభయ్ ఏళ్ల తర్వాత కూడా ప్రపంచం ఆయన నామస్మరణ చేస్తున్నది. ఇప్పటికీ ఆయన మోము అదే చిర్నవ్వుతో ద్యోతకమవుతుంటుంది. సజీవుడిగా కళ్లముందు సాక్షాత్కరిస్తుంటారు. ఇది ఆయన సంకల్పానికి చిరునామా. ఏదేశానికి ఆ దేశం మన జాతిపితను తమ జాతిపితగా భావిస్తున్నది. అందుకు ఆయన ప్రవచించిన సూక్తులొక్కటే కారణం కాదు. ఆయన జీవితం, జీవన విధానం ప్రధాన కారణం. తనెలా ఉండాలనుకున్నారో అలాగే ఉంటూ, భేషజాల్లేని నిరాడంబరుడిగా తనని తాను ఆవిష్కరించుకున్నారు. జీవితమంటే ఇదేనన్న ఇంగితాన్ని నేర్పుతూనే సర్వులకూ జ్ఞానోదయమయ్యేలా నడుచుకున్నారు. కృతకానికి తావులేని నిష్కళత్వం ఆయన సొంతం. భారత స్వాతంత్ర్య సమరంలో కత్తులు, కటార్లతో పనిలేకుండా చేతికర్ర సాయంతో నడుస్తూ కూడా లక్ష్యాన్ని సాధించొచ్చని నిరూపించిన అసలుసిసలు పోరాటయోధుడు. ఉద్యమకారుడు. ఎదిరించి పోరాడాలంటే ఆవేశం, ఆక్రోశాలెంతమాత్రం అవసరం లేదని సరికొత్త నిర్వచనం చెప్పిన నాయకుడు. డిమాండ్లు సాధించుకోవాలంటే సత్యాగ్రహమొక్కటే తిరుగులేని ఆయుధమని చేతల్లో చూపిన ఆదర్శవాది. అహింసను ఆభరణంగా ధరించిన శాంతిదూత. ఒక్క మనిషిలో ఇన్ని బహురూపాలు ఉండటం అరుదైన విషయం.

అది ఒక్క గాంధీలోనే చూస్తాం. నిరాడంబరత్వానికి నిలువుటద్దం. మతసామరస్యానికి మరో రూపం. పర్యావరణ ప్రేమికుడు. ఇవన్నీ ఆయనకు ఎవరో తగిలించిన భూషణాలు కాదు. భారతదేశానికి వాటిని ప్రతీకలుగా తీర్చిదిద్దిన ఒక ఆశావాది. మహాత్ముడు కలలు గన్న భారతదేశంలోనే మనం ఇప్పుడు జీవిస్తున్నామా అని ఈ సందర్భంలో ప్రతిఒక్క భారతీయుడు సమీక్షించుకోవాల్సిన తరుణమిది. మహాత్ముడే గనక ఇప్పుడు సజీవంగా ఉండిఉంటే.. లేదంటే మహాత్ముడు మళ్లీ పుడితే.. ప్రస్తుత భారతీయాన్ని చూసి ఆయన ఏమని అనుకుంటారన్న ఆసక్తికరమైన ధర్మసందేహం చాలామంది నుంచి వస్తుంటుంది. నిజానికి ఆహార్యం నుంచి ఆదర్శాల దాకా ఆయన బాటలో పయనిస్తున్నామా అంటే నిస్సంకోచంగా లేదనే చెప్పుకుంటాం. మహాత్మాగాంధీ 2020లో ఉండిఉంటే ఆయన ఆహార్యం ఎలా ఉంటుందని అడిగినప్పుడు ఆయన మనుమరాలు, దక్షిణాఫ్రికాలోని గాంధీ డెవలప్‌మెంట్ ట్రస్టు వ్యవస్థాపకురాలు, ట్రస్టీ అయిన ఈలా గాంధీ చాలా ఆసక్తికరమైన విశ్లేషణ చేశారు. గాంధీ ఇప్పటి సంస్కృతికి తగ్గట్టు నిగనిగలాడే బూట్లు వేసేవారా అన్న ప్రశ్నకు.. గాంధీ పాదాలు శాండల్స్‌కే అలవాటైపోయాయి. అవి లేవంటే అసలేమీ లేకుండానే నడవడానికి ఇష్టపడతారు. గ్లోబల్ వార్మింగ్ నేపథ్యంలో ఆయన తన అలవాటుని మార్చుకుంటారని అనుకోవడం కష్టమని జవాబిచ్చారు. అలాగే నేటి రాజకీయ నాయకులని చూసి గర్వపడేవారా అన్న ప్రశ్నకు.. లేదు లేదని ఆమె కరాఖండిగా జవాబిచ్చారు. ఏ సిటీలో ఉండేందుకు ఇష్టపడతారన్నదానికి.. నిస్సందేహంగా ఏ సిటీలోనూ ఉండరు. గ్రామీణ జీవనాన్నే కోరుకుంటారని ఆమె తెలిపారు. ఆయన సమయపాలనకు విలువిస్తారని, అందువల్ల గడియారం మాత్రం ధరిస్తారన్నారు. పాత వాచ్ ఇప్పటిదాకా పనిచేయడం కష్టసాధ్యమైనా.. దాన్నే మరమ్మతులు చేయించి వాడతారని, ఇక అది పనిచేయదని తేలాకే కొత్తది అనుమతిస్తారని, అదికూడా అతి సామాన్యుడు వాడే తేలికపాటి వాచ్‌నే ఇష్టపడతారని ఆమె వెల్లడించారు. దీనర్థం మారుతున్న కాలానికి తగినట్టు ఆయన మారడం కాకుండా తాను నమ్మిన బాటనే ప్రపంచాన్ని నడిపించగల మార్గనిర్దేశకుడు మహాత్మాగాంధీ అని అమె చెప్పకనే చెప్పినట్టు అర్థమవుతున్నది. ఆయన ఆదర్శాలను ఆదర్శాలుగా మాత్రమే మనం భావిస్తున్నాం. కాని అవి జీవనవేదాలని గుర్తించలేకపోతున్నాం. నిరాడంబరతలో మనమంతా గాంధీనెప్పుడో మరిచిపోయాం. సగటు భారతీయుల్లో 70-80 శాతం మంది ఆడంబరాలకే ప్రాధాన్యమిస్తున్నట్టు కొన్ని సర్వేలు తేల్చి చెప్పాయి. ఇక స్వదేశీ భావన గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. ప్రపంచీకరణలో స్వదేశీ-విదేశీ భావనల మధ్య ఒకప్పటి దట్టమైన పొరలు మంచుతెరలై కరిగిపోయిన నేపథ్యంలో స్వదేశీ ఉద్యమాలకు కాలం చెల్లిపోయింది. గాంధీ మహాత్ముడు విదేశీ బట్టలను త్యజించాలని ఒక్క పిలుపిస్తే లక్షలాదిమంది విదేశీ బట్టలను తగులబెట్టిన వైనాన్ని చరిత్ర పుటల్లో విన్నాం. అంగవస్త్రం తప్ప ఏ ఆభరణమూ ధరించని గాంధీ ఒక్క పిలుపిస్తే యావద్దేశం కదలివచ్చి నగలు, నగదు స్వచ్ఛందంగా దానం చేసి స్వాతంత్ర్యోద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన ఉద్వేగభరిత దృశ్యాలనూ చూశాం. గాంధీలో స్వతస్సిద్ధంగా నిబిడీకృతమై ఉన్న దృఢ సంకల్పమే జాతిజీవన తంత్రుల్ని మీటింది. అలాంటి కాలం కరిగిపోయింది. ఇప్పుడు ప్రపంచమే మన ముంగిళ్లకు వచ్చేసింది. సర్వం విదేశీమయం అయిపోయింది. చదువుల నుంచి ఉపాధి దాకా విదేశాల వైపే చూస్తున్నాం. విదేశీ వస్తువుల మీదే మోజు. ప్రస్తుతం మన ఇళ్లల్లో ఉపయోగించే టీవీల నుంచి రిఫ్రిజిరేటర్లు, స్మార్ట్ ఫోన్లు.. ఇలా ప్రతిఒక్కటీ విదేశీయమైన స్థితిలో విదేశాల్లోనే స్థిరపడిపోతున్న పరిణామాలు మహాత్ముడి పాదముద్రలకు దూరంగా జరిగిపోతున్న దయనీయ దృశ్యాలు మనకు నిత్యం అనుభవైకవేద్యమే. అయితే గాంధీ నివసించిన కాలానికి, ఇప్పటి కాలానికి బోలెడంత వ్యత్యాసం ఉన్నమాట నిజం. అప్పటి పరిస్థితులే ఇప్పుడూ ఉండాలనుకోవడమూ అవివేకమే అవుతుంది. ఈ విషయంలో గాంధీ ఆలోచనలూ దీనికి భిన్నంగా ఉంటాయనుకోనక్కర్లేదు. జాతి పురోగమనంలో అనేకానేక పరివర్తనలుంటాయి. ఆధునికీకరణ నుంచి యాంత్రికీకరణ దాకా అనేకానేక మార్పుల్ని పాక్షికంగానైనా ఆహ్వానించాల్సిన సమయం వస్తుంది. అలాంటి సందర్భాల్లోనే గాంధీ ఆలోచనలు ఆపద్ధర్మంగా ఉపకరిస్తాయి. నిజానికి మహాత్మాగాంధీ అభ్యుదయవాది. సాంప్రదాయక అభ్యుదయవాదిగా ఆయన్ని గుర్తించాలి. ఆయన ఎన్ని మాటలు చెప్పినా.. ఎన్నిరకాలుగా చెప్పినా.. వాటి అంతర్లీనం ఒక్కటే. నైతికతను వీడరాదన్నదే ప్రధాన సూత్రం. ఇందులో కరడుగట్టిన సాంప్రదాయక ఛాందసభావాలెక్కడ ఉంటాయి? ఇది ఆధునిక అభ్యుదయ బాటకు ప్రతిబంధకమెలా అవుతుంది? ఇక్కడే గాంధీని అర్థం చేసుకోవడంలో చాలా సందర్భాల్లో తప్పటడుగులు పడుతున్నాయనిపిస్తుంది.

ఇక పర్యావరణ పరిరక్షణ విషయంలో గాంధీ దూరదృష్టిని ప్రశంసించకుండా ఉండలేము. పర్యావరణమంటే పరిసరాలను ఆరోగ్యదాయకంగా ఉంచుకోవడమొక్కటే కాదు. పర్యావరణం పట్ల విధ్వంసకరంగా ఉండరాదనీ చెప్పారు. తాను ప్రవచించి ఆచరించిన అహింసావాదాన్ని పర్యావరణానికీ ఆపాదించి పాటించాలన్నారు. ఆ ప్రవచనాలు నేటికి నినాదాలై ప్రభుత్వాలను అప్రమత్తం చేస్తున్నాయి. అందుకే కేంద్ర ప్రభుత్వంతోపాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణకు అనేక కార్యక్రమాలు అమలుచేయసాగాయి.

ముఖ్యంగా హరితహారం పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయి. వందల కోట్ల రూపాయలు దీనిమీద ఖర్చుచేయడానికి ప్రభుత్వాలు వెనకాడటం లేదు. ఉష్ణతాపం పర్యావరణాన్ని ఎలా దెబ్బతీస్తున్నదో స్వానుభవమవుతున్నందున అటు ప్రభుత్వాలు, ఇటు ప్రజలు మేల్కొంటున్నారు. బుధవారం నాడు ఒక్క భారతదేశమే కాదు..యావత్ ప్రపంచం గాంధీ జయంతిని ఒకపండుగలా జరుపుతున్నారు. గాంధీని ఒక్క భారతదేశం సొంతం చేసుకుంటానంటే అంగీకరించడానికి ప్రపంచదేశాలు సిద్ధంగా లేవు. ఇది భారతదేశానికి గర్వకారణం కాక మరేమవుతుంది! వర్తమాన ప్రపంచీకరణలో వెల్లువెత్తుతున్న ఒత్తిళ్లలో కరడుగట్టిన చైనాలాంటి దేశాలనుంచి పెత్తందారీ పోకడలకు పెట్టింది పేరైన అమెరికా దాకా అందరూ అనివార్యంగా గాంధీగిరినే ఆశ్రయిస్తున్నారు. ఆచరణలో ఎవరి బాట వారిది కావచ్చు. కాని వారందరూ తమ జాతిపిత గాంధీయేనని విశ్వసిస్తున్నారు. జయహో గాంధీ!!




# గాంధీ కల స్వచ్ఛ భారత్

ప్రతి భారతీయుడి కృషితో ఈ స్వచ్ఛభారత్ కార్యక్రమం ప్రజా ఉద్యమంగా ఎదిగింది, చక్కటి ఫలితాలు వచ్చాయి, 8.5 కోట్ల కుటుంబాలకు





తొలి సారి మరుగుదొడ్డి సౌకర్యం వచ్చింది. దాదాపు 40 కోట్ల మంది భారతీయులు కాలకృత్యాలకు బహిరంగ ప్రదేశాలకు వెళ్లవలసిన అవసరం లేదు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం గౌరవప్రద జీవితానికి, మెరుగైన భవిష్యత్తుకు ఉద్దేశించినది. ముఖ్యంగా మహిళల ఆత్మగౌరవానికి ఆసరా నిలిచింది మనందరి ''స్వచ్ఛభారత్''. స్వచ్ఛ భారత్ మిషన్ ఒక ప్రజా ఉద్యమంగా రూపాంతరం చెందుతుంది. గణనీయమైన ప్రగతి దిశలో ముందుకు సాగుతూ ఈ మిషన్ లక్ష్యం 100 శాతం సాధించి పురోగతి సాధించాలని ఇందుకు భారతదేశంలో ఉన్న ప్రతి ఒక్కరు ''మనది, మనకోసం'' అని భావించడంతో సాధించవచ్చు.

పారిశుద్ధ్యం పరమావధిగా 2014 అక్టోబర్ 2న ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభమైన ''స్వచ్ఛ భారత్'' కార్యక్రమం మనదేశంలో ఆరోగ్య భారత్‌కు బాటలు వేస్తుంది. కేంద్ర ప్రభుత్వ లక్ష్యం మహాత్మాగాంధీ 150వ జయంతి ఉత్సవమైన అక్టోబర్ 2, 2019 నాటికి దేశవ్యాప్తంగా నూరు శాతం అమలు చేయగలిగితే అక్షరాలా 3 లక్షల మంది ప్రాణాలను కాపాడినరు అని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. పోషకాహార లోపం బాధితులు ఈ మేరకు మృత్యువును జయిస్తారని వెల్లడించింది. ఇప్పటికే స్వచ్ఛభారత్ కారణంగా లక్షా ఎనభై వేల మంది మృత్యువాత పడకుండా ప్రాణాలతో ఉన్నారని తెలిపింది. ముఖ్యంగా 2014 తో పోలిస్తే ఆగస్టు 2, 2018 నాటికి గ్రామాల్లో పరి శుభ్రత 89.07 శాతం మెరుగుపడింది. ఆరుబయట కాలకృత్యాలను విడనాడాలని కోరుతూ ప్రతి ఇంటా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలని ప్రోత్సహించడంతోనే సత్ఫలితాలు వచ్చాయని విశ్లేషించింది.

కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా దేశంలోని అన్ని రాష్ట్రాలలో అప్పటికే అమలులో ఉన్న ''నిర్మల్ భారత్ అభియాన్'' కార్యక్రమాలను స్వచ్ఛభారత్‌గా మార్పు చేశాయి. డబ్ల్యుహెచ్ఓ నివేదిక ప్రకారం అపరిశుభ్రత కారణంగా ప్రతి సంవత్సరం 19.9 కోట్ల మంది నీళ్ల విరేచనాలతో బాధపడుతున్నారు. ఐదు సంవత్సరాల లోపు చిన్నారులు ఎక్కువగా మృత్యువాత పడటానికి డయేరియా కూడా ముఖ్యకారణం, చిన్నారులను బలి తీసుకుంటున్న వ్యాధుల్లో ఇది రెండో స్థానాన్ని ఆక్రమించింది. పారిశుద్ధ్యం మెరుగుపడటంతో ప్రజలు స్వచ్ఛమైన త్రాగునీరు త్రాగేవారు సైతం గణనీయంగా పెరిగారు. పారిశుద్ధ్యం మెరుగైన కారణంగా ప్రజలకు ప్రొటీన్లతో కూడిన పోషకాహారం లభిస్తుంది. అంటు వ్యాధులు రాకుండా ఉంటాయి. బహిరంగ కాలకృత్యాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం విస్తృత ప్రచారం సత్ఫలితాలనిస్తుంది, ఇచ్చింది కూడా. మన దేశంలోని గ్రామాల్లో 92 శాతం మేర స్వచ్ఛభారత్ లక్ష్యాన్ని త్రాగునీరు, పారిశుద్ధ్య లక్ష్యాన్ని సాధించి అదేవిధంగా గ్రామాల్లో పట్టణాలలో బహిరంగ మల విసర్జన నివారణ దిశగా అడుగులు వేస్తున్నది. గడిచిన 4 సంవత్సరాలలో దేశవ్యాప్తంగా 8.3 కోట్ల మరుగు దొడ్ల నిర్మాణాలు పూర్తయి నాయి అని నివేదికలు చెబుతున్నాయి. అదేవిధంగా 4.3 లక్షల గ్రామాలు 444 జిల్లాలు బహిరంగ కాలకృత్యాల విసర్జన రహితంగా మారినాయి. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛత పథకంగా పేరొందింది. ప్రతిష్టాత్మక స్వచ్ఛభారత్ నాలుగవ వార్షికోత్సవం సందర్భంగా ''స్వచ్ఛత హి సేవ'' ప్రాధాన్యాన్ని ఇస్తూ పౌరులందరూ పైన లక్ష్యసాధన బాధ్యత ఉంటుంది.

**అవగాహన కల్పించడం:** బహిర్గత కాలకృత్యాల, మూత్ర విసర్జనకు స్వస్తి పలికి అంతర్గత కాలకృత్యాయల విసర్జనకు పునాది వేయడం కోసం మనదేశంలో ప్రజలందరికీ అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి. స్వచ్ఛ భారత్ కార్యక్రమం 100 శాతం సాధించడానికి, ఈ ప్రయాణంలో గ్రామీణ స్థాయి నుంచి సర్పంచులు, మునిసిపాలిటి స్థాయి నుంచి చైర్మన్లు, కౌన్సిలర్లు, ముఖ్యంగా మహిళా నాయకులు ఇందులో భాగస్వాములవుతున్నారు. పారిశుద్ధ్య సమస్యకు సాంకేతికత పరిష్కారం కోసం స్వచ్ఛభారత్‌ను ప్రజల ఉద్యమంగా మార్పు చేయడమే కాకుండా మరుగుదొడ్ల సాంకేతికత దాని అమలుపై దృష్టి సారిస్తుంది.

**స్థానిక సంస్థల స్వచ్ఛత సాకారం:** ఈ స్వచ్ఛత ఉద్యమంలో సమాజంలోని అన్నివర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని, దీన్ని ఒక ప్రజా ఉద్యమంగా మార్చారు. ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు ముఖ్యంగా స్థానిక సంస్థలు ఈ ఉద్యమంలో రోజు రోజుకు అధిక సంఖ్యలో ప్రజలు ప్రజలను భాగస్వాములుగా ప్రోత్సహిస్తున్నాయి. సురక్షిత త్రాగునీరు, తగినంత పారిశుద్ధ్యం, పరిశుభ్రతకు స్థానిక సంస్థలు తన వంతు కృషి చేస్తున్నాయి. స్థానిక సంస్థలు చెత్తను సేకరించి వాటిని తడి, పొడి చెత్తను వేరు చేసి వాటి నుండి విద్యుత్, ఎరువుల తయారీకి ప్రణాళికలు తయారు చేసింది.

అధికార గణాంక లెక్కల ప్రకారంగానే, దేశంలో ఏటా ఆరు కోట్ల 20 లక్షల టన్నుల భూపరిమాణంలో చెత్త ఉత్పత్తి అవుతుంది. అందులో ప్లాస్టిక్ వ్యర్థాలు వాటా 56 లక్షల టన్నులు. 79 లక్షల టన్నుల వరకు హానికరమైన వ్యర్థాలు, 15 లక్షల టన్నుల మేర ఇ-వ్యర్థా లతోపాటు భారీగా జీవ వ్యర్థాలు పోగు పడుతు న్నాయి. పురపాలక సంస్థలు సేకరిస్తున్న సుమారు నాలుగు కోట్ల 30 లక్షల టన్నుల చేతలు పరిశుద్ధ పునర్వినియోగ ప్రక్రియకు నోచుకుం టుంది. 22 శాతం నుండి 28 శాతం అని ప్రభుత్వమే అంగీకరిస్తుంది. ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, హైదరా బాద్ వంటి మహానగరాల్లో ప్రతిరోజు వేల టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. ఈ ఒరవడికి పగ్గాలు బిగించే మహదాశయంతోనే 2019 అక్టోబర్ నాటికి నాలుగు వేలకు పైగా నగరాలు, పట్టణాల్లో ఘనవ్యర్థాల శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు కేంద్రం నిబద్ధత చాటింది. స్వచ్ఛభారత్ నినాదంతో చెత్త నుంచి విద్యుత్, ఎరువుల తయారీకి ప్రణాళికలు సిద్ధం చేశారు. దేశవ్యాప్తంగా ఇంటింటి నుంచి చెత్త సేకరణ కార్యక్రమం సగం పురపాలక వార్డులోని అమలవుతున్నాయి. దాదాపుగా 83 వేల మున్సిపల్ వార్డుల్లో 44650 వార్డుల్లోని చెత్త సేకరణ జరుగుతుండడం తక్షణ మరమ్మత్తు చర్యల ఆవశ్యకతపై సమయం ఆసన్నమైంది.

**ఘన వ్యర్థాల వినియోగం / నిర్వహణ:** గ్రామ పంచాయతీలో ఘన వ్యర్థాల నిర్వహణకు గోబర్ థాన్ (గల్వానైజింగ్ ఆర్గానిక్ బయో ఆగ్రో రిసోర్సెస్ థాన్) ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. ఈ పథకం పశువుల పేడ, ఘన వ్యర్థాలను కంపోస్ట్, ఎరువు, బయోసిఎన్జిగా మార్చేందుకు రూపొందించారు. దేశీయంగా పట్టణ వ్యర్థాలతో గ్రామాలకు ఎరువుల తయారీని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, పరిమిత సంఖ్యలోని పంచాయతీలో ఫలితాలు అందిస్తున్నాయి.

వ్యర్థాల సేకరణ విభజన పునశ్శుద్ధి కేంద్రాలకు తరలింపు, ఎరువులు విద్యుత్‌గా రూపాంతరీకరణ పగడ్బందీగా సాగే సుదృఢ యంత్రాంగాన్ని దేశంలో అన్ని గ్రామాలలో అవతరింపజేయడం తక్షణ అవసరం. ఈ స్ఫూర్తికి గొడుగు పట్టేలా పురపాలక సంఘాలకు అన్ని విధాల సహాయ సహకారాలు అందజేతలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాటుపడుతున్నయి. టన్నుల కొద్దీ చెత్తను ఆరబెట్టిన, పేరపెట్టిన, తగలబెట్టిన ప్రజారోగ్యానికి పర్యావరణానికి ముప్పు తప్పదు. ఈ పెను విపత్తును అధికమించేందుకు వ్యర్థాల రాశిని ఆర్థిక వనరుగా మలచడమే తెలివైన పరిష్కారమని భాగ్యనగర్ వేదికపై ఇటీవలి అంతర్జాతీయ సదస్సులో పిలుపునిచ్చింది.

**యువత సాకారం:** పరిశుద్ధమైన, ఆరోగ్యవంతమైన భారత్‌ను ఆవిష్కరించాలన్న గాంధీ మహాత్ముని కలను నిజం చేసి చూపించాలని ప్రధాని నరేంద్ర మోడీ ఈ సందర్భంగా మన దేశ ప్రజలకు పిలుపు ఇచ్చారు. మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్ వద్ద ప్రధాని చీపురు చేతబట్టి చెత్తాచెదారాన్ని ఊడ్చి వేయడం ద్వారా ప్రధాని స్వయంగా ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. తొమ్మిదిమంది ముందుకు వచ్చి ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని ప్రధాని కోరారు, అలాగే 9 మరో తొమ్మిది మందిని ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా ఆహ్వానించాలని ప్రతి ఒక్కరికి విజ్ఞప్తి చేశారు. ఈ స్ఫూర్తితో యువత ముందుకు వచ్చే వారికి ''స్వచ్ఛ భారత్ మిషన్'' కింద త్రాగునీరు- పారిశుద్ధ్యం మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో యువతకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో భాగంగా స్వచ్ఛత సంబంధిత సమస్యలు, ఆరోగ్యం- పరిశుభ్రత గురించి అవగాహన కల్పించే కార్యక్రమాలలో యువత ముందంజలో ఉన్నారు.ఈ పథకం యొక్క ఆవశ్యకత ఎంతైనా అవసరం, తక్షణ ఈ మేరకు ప్రజా ప్రభుత్వాలు ధర్మం నిర్వహిస్తూ, పౌర సమాజాన్ని జాగృతపరిచే ప్రజలు, సామాజిక కార్యకర్తలు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు భాగస్వామ్యం కలిస్తేనే సంపూర్ణ స్వచ్ఛభారత్‌ను దేశంలో నూరుశాతం అమలుపరచుట వీలవుతుంది.

-డా. పుల్లయ్య దూదేకుల
9490402696



## పువ్వులలో మహాత్ముడు

కవిత

పుష్పాల్ని చూడగానే
మహాత్ముడు గుర్తు కొస్తాడు,
బాగున్నావా అని ఆప్యాయంగా
పలకరిస్తున్నట్లుంటుంది
నా మనసుకు...
అయ్యో, నే నెప్పుడైనా
ఈ దేశానికి
కాస్త పరిమళం పంచానా
అని దిగులుపడుతుంటాను,
పరిమళాల మాట
అట్లా ఉంచితే
దేశానికి నే నంటించిన
మురికి గురించి సిగ్గుపడుతుంటాను...
లతాంతాల్ని, మహాత్ముల్ని
అర్థం చేసుకోవాలంటే
తల ఉన్నంత మాత్రాన సరిపోదు,
పచ్చగా బతుకుతుండాలి,
పది మందినీ
పచ్చగా బతికిస్తుండాలి...
మహానుభావుల మనసులు కుసుమాలే గదా
అనుకుంటున్నారా,
కరకు కసాయి కంపు ముళ్ళను ఓడించే
ప్రవహిస్తున్న పరిమళాల ప్రేమికులు,
దండయాత్రలు చేస్తున్న
వేడి వేడి వడగాలుల్ని
మృదువైన ఆయుధాలతో జయించే
నవ్వుల సైనికులు...
పువ్వుల్ని
తూక మెయ్యటం తప్పు,
పైగా రాళ్ళతో
తూక మెయ్యటం
ఇంకా పెద్ద తప్పు...
నువ్వు నీ అవసరాలకోసం
తయారుచేసుకొన్న కొలమానాల రాళ్ళతో
తూక మెయ్యటం
ఇంకా ఇంకా పెద్ద తప్పు!

-డా. రావి రంగారావు,
9247581825

# లాల్ బహదూర్ @115

జై కిసాన్, జై జవాన్ అన్న నినాదంతో భారత దేశంలో ప్రతి ఒక్కరిని ఉత్తేజపరచి దేశభక్త ప్రపూరితులుగా చేసిన మహనీయమూర్తి లాల్‌బహదూర్ శాస్త్రి. ఆజన్మాంతం ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేసి నిస్వార్థసేవా పరాయణత్వంతో నిరాడంబర జీవనంతోను, అకళంక దేశ భక్తితోను మానవతా మూర్తిగా ప్రజాసేవలో అసువులర్పించిన శాంతి దూత లాల్ బహదూర్ శాస్త్రి. 1904 అక్టోబర్ 2వ తేదీన కాశీకి ఏడుమైళ్ల దూరం లోనున్న మొఘ ల్‌సరాయ్ రైల్వేకాలనీలో జన్మించారు. జాతిపిత మహాత్మా గాంధీ జన్మదినం నాడే లాల్‌బహదూర్ శాస్త్రి జన్మించడం ఒక విశేషం.

తండ్రి శారదా ప్రసాద్, తల్లి రామదులారీదేవి. తండ్రి శాస్త్రి బాల్యంలోనే మరణించడంతో కొంత కాలం మేనమామ రఘు నాథ్ ప్రసాద్ శాస్త్రిని పెంచి పెద్ద చేశారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం శంకుస్థాపనకు గాంధీజీ వచ్చినప్పుడు లాల్ బహ దూర్ శాస్త్రి గాంధీజీ దర్శనం చేసుకొన్నారు. శాస్త్రి కాశీవిద్యాపీఠంలో చదివి డిగ్రీ పొందారు. శాస్త్రి అను పదము వారు పొందిన డిగ్రీ లో భాగము కాని, తండ్రి పెట్టిన పేరులో భాగం కాదు. శాస్త్రి తోటి విద్యార్థులతో గాంధీ అహింసాయుత సహాయనిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నందుకు కొద్దిరోజులు నిర్బంధింపబడ్డారు. 1926లో డిగ్రీ సంపాదిం చారు. శాస్త్రి స్వగ్రామం నుండి విద్యాలయానికి ప్రతి దినము 16 మైళ్ళు కాలినడకన వెళ్లి చదువుకున్నారు. అనంతరం 1928లో పంజాబు కేసరి లాలా లజపతిరాయ్ స్థాపించిన సర్వెం ట్స్ ఆఫ్ ది పీపుల్స్ సొసైటీలో సభ్యులుగా చేరారు.

1927లో మీర్జాపూర్‌కు చెందిన లలితా దేవిని వివాహం చేసుకున్నారు. నెహ్రూ అధ్యక్షతన జరి గిన లాహోర్ కాంగ్రెస్‌కు శాస్త్రి హాజరయ్యారు. 1930లో శాసనోల్లఘనం లో పాల్గొని రైతులను ప్రభు త్వానికి పన్నులు చెల్లించ వద్దని పిలుపు నిచ్చారు. ఫలితంగా బ్రిటిష్ ప్రభుత్వం రెండున్నరేళ్లు జైలులో నిర్బంధించింది. నైనిటాల్ జైలులో ఉన్నప్పుడు మేడమ్ క్యూరి జీవిత చరిత్రను హిందీలోకి అనువదించారు.

1946లో ప్రొవిన్షియల్ అటానమీ కింద రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పడినప్పుడు పండిత గోవింద వల్లభపంత్ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. శాస్త్రిని పార్లమెంటరీ సెక్రటరీగా నియమించుకున్నారు. యునైటెడ్ ప్రావిన్స్‌లో మంత్రిగా ఉన్న రఫీ అహమ్మద్ ఖిద్వాయ్ కేంద్రమంత్రిగా నియమింపబడినప్పుడు శాస్త్రి యునైటెడ్ ప్రొవిన్సెస్‌లో పోలీస్, ట్రాన్స్‌పోర్ట్ మంత్రిగా నియమింపబడ్డారు. 1951లో శాస్త్రి రాజ్యసభ సభ్యులయ్యారు. రైల్వే, ట్రాన్స్‌పోర్ట్ మంత్రిగా నియమింపబడ్డారు. అరియలూర్‌లో జరిగిన రైలు ప్రమాదంలో 114 మంది ప్రయాణికులు మరణించారు. ఆ ప్రమాదానికి నైతిక బాధ్యత వహించి మంత్రి పదవికి రాజీనామా చేశారు. 1957లో నెహ్రూ శాస్త్రిని కేబినెట్‌లోకి తీసుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ 1964 మే 27వ తేదీన మరణించారు. పిమ్మట శాస్త్రి 1964 జూన్ 9వ తేదీన ప్రధానమంత్రిగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. లాల్‌బహదూర్ శాస్త్రి ప్రధానమంత్రి ఐన తర్వాత 1965లో ఇండియా - పాకిస్తాన్ మధ్య యుద్ధం జరిగింది. 1966 జనవరి 10వ తారీఖున తాష్కెం ట్‌లో ఉభయ దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. 11వ తేదీన ఆయన హఠాత్తుగా గుండె పోటుతో మరణించారు. ఆయన మరణానంతరం రాష్ట్రపతి రాధాకృష్ణన్‌శాస్త్రికి 'భారతరత్న' బిరుదును ప్రసాదించారు.

-రాపాక ఏకాంబరాచార్యులు



## సలాము లివియె..

కవిత

లాల్ బహదూర్ శాస్త్రి! సలాము లివియె
సి॥ వేషధారణలోన భేషజం బెఱుగని
శిష్టవర్తనలో విశిష్టు డతడు;
నైతిక బాధ్యతా రీతికే ప్రీతిగా
పదవికే గౌరవం బాయెనతడు;
డంబెఱుంగని నిరాడంబర వృత్తిలో
ప్రజల కాదర్శమై వరలెనతడు;
పదియు నెన్మిది నెలల్ పాలించినన్ గాని
జవహరున్ మరపింపజాలెనతడు;
'జై జవాన్ - జై కిసాను' తేజమ్మె అతడు;
పగతుర కహర్నిశలు గుండె దిగులె అతడు;
పొట్టివాడె - విక్రమ మందు గట్టివాడు;
'లాలు బహదూరు శాస్త్రి-' సలాము లివియె॥

-రామడుగు వేంకటేశ్వర శర్మ
9866944287

# వర్సిటీల్లో త్వరలో వెయ్యి పోస్టులు




• వీసీల నియామకం పూర్తయిన వెంటనే భర్తీకి చర్యలు • యూనివర్సిటీలను సందర్శిస్తా... పరిశ్రమలతో అనుసంధానం అవసరం • రిజిస్ట్రార్ల సమావేశంలో మంత్రి సబితారెడ్డి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న విశ్వ విద్యాలయాల ఉప కులపతుల నియామకం కోసం ఇప్పటికే సెర్చ్ కమిటీలను వేశామని, త్వరలో వీసీలను నియమిస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి తెలిపారు. వీసీల నియామకం పూర్తయిన వెంటనే, వర్శిటీల్లో ఖాళీగా ఉన్న వెయ్యికి పైగా పోస్టులను భర్తీ చేస్తామని ఆమె ప్రకటించారు. అలాగే ప్రతి మూడునెలలకు ఓసారి వీసీలు, రిజిస్ట్రార్లతో సమీక్ష నిర్వహించనున్నట్టుతెలిపారు. వివిధ వర్శిటీల రిజిస్ట్రార్లతో మంగళవారం మంత్రి సబితారెడ్డి ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో సమీక్షనిర్వహించారు. సమీక్షసందర్భంగా యూనివర్సిటీల్లో సమస్యలు, పరిష్కారంకోసం తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డి, విద్య శాఖ కార్యదర్శి బి జనార్ధన్‌రెడ్డి, కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిట్టల్ ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి కార్యదర్శి డాక్టర్ ఎన్ శ్రీనివాసరావుతోపాటు యూనివర్సిటీల రిజిస్ట్రార్లు పాల్గొన్నారు. విద్యార్థులకు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉండే కోర్సుల రూపకల్పనను యూనివర్సిటీలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుత తరుణంలో యూనివర్సిటీలు పరిశ్రమలతో అనుసంధానం కావల్సిన అవసరం ఉందన్నారు.

**వర్శిటీలకొస్తా**

యూనివర్సిటీలను సందర్శిస్తే అక్కడ స్థానికంగా ఉన్న సమస్యలు తెలుసుకునే వీలుంటుందని వర్సిటీల సందర్శించే ప్రయత్నం చేస్తానని మంత్రి చెప్పారు. వర్సిటీల్లో పరిశోధనలను పెంచాల్సిన అవసరం ఉందని దానిని యూనివర్సిటీలు గుర్తించాలన్నారు. ఆ దిశగా వీసీలు, రిజిస్ట్రార్లు చర్యలు తీసుకోవాలన్నారు. విదేశాల్లో ఉన్న నాణ్యతకు సమానంగా మన విద్యా సంస్థలను, పరిశోధనా సదుపాయాలను సృష్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. విశ్వవిద్యాలయాల్లో పరిశోధనల సాంద్రత పెరిగేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలో సూచించాలని రిజిస్ట్రార్లను మంత్రి కోరారు. ప్రభుత్వం, అధికారులు, బోధనా సిబ్బంది అందరం కలిసి విద్యా రంగంలో తెలంగాణ రాష్ట్రాన్ని ముందుండేలా చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

## వీసీ పోస్టులకు 984 దరఖాస్తులు

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 9 విశ్వ విద్యాలయాల వీసీల పోస్టులకు దరఖాస్తులు భారీగా వచ్చాయి. 9 వీసీ పోస్టులకు 984 దరఖాస్తులు వచ్చాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వీసీ పోస్టుకు అత్యధికంగా 142 దరఖాస్తులు రాగా అత్యల్పంగా పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి 23 దరఖాస్తులే వచ్చాయి. అయితే 9 వర్సిటీల పోస్టులకూ దరఖాస్తు చేసిన వారు 54 మంది ఉన్నారు. జూలై 24న రాష్ట్రంలోని 9 వర్సిటీల వీసీల పదవీ కాలం ముగిసింది. వీసీల పదవీ కాలం జూలై 24న ముగుస్తున్నందున అంతకుముందే వీసీ పోస్టుల భర్తీకి తెలంగాణ ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్‌ను జారీ చేసింది. జేఎన్‌టీయూ, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంకు మినహా మిగిలిన ఏడు వర్సిటీలకు కూడా 100కు పైగా దరఖాస్తులు వచ్చాయి.

వీసీ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను విద్యాశాఖ అధికారులు స్రూటినీ చేస్తున్నారు. గతంలో వీసీ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఉన్నత విద్యా మండలి వారు స్రూటినీ చేసి ప్రభుత్వానికి పంపించేవారు. అయితే ఈసారి మాత్రం విద్య శాఖ కార్యదర్శి కార్యాలయ అధికారులే స్వయంగా వీసీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను స్రూటినీ చేస్తున్నారు. దరఖాస్తుల స్రూటినీ కార్యక్రమం ఇప్పటికే ప్రారంభించినట్టు తెలిసింది.

***8 తరువాత సెర్చ్‌కమిటీల భేటీ***

వీసీల నియామకం కోసం ప్రభుత్వం ఇప్పటికే సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసింది. సెర్చ్ కమిటీల సమావేశం కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే అక్టోబర్ 8న దసరా పండుగ ఉన్న నేపథ్యంలో సెర్చ్ కమిటీల సమావేశాలు అక్టోబర్ 8 తరువాత జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. సెర్చ్ కమిటీల సమావేశం నాటికి ఆయా వర్సిటీల వీసీ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులుగా ఉన్న వారి జాబితాను విద్య శాఖ అధికారులు సెర్చ్ కమిటీకి ఇవ్వాల్సి ఉంటుంది. సెర్చ్ కమిటీ వారి దరఖాస్తులను పరిశీలించి ముగ్గురి పేర్లతో ప్యానల్‌ను ప్రభుత్వానికి సమర్పించనుంది. ఆ ముగ్గురి పేర్ల ప్యానల్‌ను సర్కార్ గవర్నర్‌కు పంపించనుంది. గవర్నర్ ప్యానల్‌లో ఒక్కరిని వీసీగా నియమిస్తారు.

# అన్ని జిల్లాల్లో వృద్ధాశ్రమాలు

మహాత్మా గాంధీ 150వ జయంతి ముగింపు ఉత్సవాలు

• అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ సభలో మంత్రి కొప్పుల ఈశ్వర్



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో వృద్ధుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని షెడ్యూల్ కులాల అభివృద్ధి, వికలాంగుల, వృద్ధుల సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చెప్పారు. ఇప్పటికే పది జిల్లాలలో ప్రభుత్వ వృద్ధాశ్రమాలు ఉన్నాయని, కొత్తగా ఏర్పడిన అన్ని జిల్లాలలో వృద్ధాశ్రమాలను నిర్మిస్తామని ఆయన వెల్లడించారు. అలాగే తెలంగాణలో కేంద్రప్రభుత్వ నిర్వహణలో ఇరవై ఓల్డ్ ఏజ్ హోంలు నడుస్తున్నాయన్నారు. వృద్ధులకు బస్ ప్రయాణాలలో రాయితీ కల్పించే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. మంగళవారం రవీంద్ర భారతిలో రాష్ట్ర ప్రభుత్వ వికలాంగుల, వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా ది జర్నీ టూ ఏజ్ ఈక్వాలిటీ అనే ఇతివృత్తంతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధుల సంక్షేమం కోసం కృషి చేసిన ఆయా జిల్లాల కలెక్టర్లు, ఐపీఎస్ అధికారులు, ఆర్డీవోలు, వివిధ వృద్ధాశ్రమాల నిర్వహకులకు అవార్డులను మంత్రి కొప్పుల అందజేశారు. సిఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు, సీపీఐ జాతీయ నేత డాక్టర్ నారాయణ, మెదక్ జిల్లా కలెక్టర్ ధర్మారెడ్డి, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్, అదనపు ఐజీ షికా గోయల్, రంగారెడ్డి జిల్లా ఓల్డు ఏజ్ హోం, సిద్ధిపేట జిల్లా ఆనంద నిలయం తదితర సంస్థల వ్యక్తిగత విభాగంలో కొందరు సేవకులు అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో వికలాంగుల, వృద్ధుల సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎం. జగదీశ్వర్, డైరెక్టర్ శైలజా తదితరులు పాల్గొన్నారు.

# మేడారం జాతరకు యాక్షన్ ప్లాన్

• ఏర్పాట్లపై సీఎస్ జోషి సమీక్ష



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** వచ్చే ఏడాది ఫిబ్రవరి 5 నుంచి 8వ తేదీ వరకు మేడారంలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లకు ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి ఆదేశించారు. ఈ ఏడాది జాతరకు కోటికిపైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతి శాఖ తమకు కేటా యించిన నిధులను సద్వినియోగం చేసుకుని భక్తులకు అసౌకర్యం కలుగకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. అలాగే రానున్న పదేళ్ళను దృష్టిలోపెట్టుకుని జాతర మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించాలని ఆదేశాలు ఇచ్చారు. మాస్టర్‌ప్లాన్‌లో భక్తుల సౌకర్యాలే పరమావధిగా ఉండాలన్నారు. ఈ అంశంపై మంగళవారం బూర్గుల భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, సమ్మక్క జాతరలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే విధంగా చర్య లు తీసుకోవాలన్నారు. పర్యావరణహితంగా అడవు లకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. జాతర ఏర్పాట్ల కోసం భూ సేకరణకు సంబంధించిన అంశంపై అధ్యయనం చేయాలన్నారు. స్వచ్ఛందంగా భూములిచ్చేవారికి స్వయం ఉపాధి కల్పించడంతో పాటు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ చేసేలా వారిని ప్రోత్సహించాలన్నారు. గత ఏడాది జాతర నిర్వహణలో ఏర్పడిన లోటుపాట్లను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది పకడ్బందీ వ్యూహంతో ముందడుగు వేయాలన్నారు. పారిశుధ్యం, పార్కింగ్, బందోబస్తు, బస్సు సర్వీసులు, మంచినీటి సరఫరా, విద్యుత్, ట్రాఫిక్ నిర్వహణ, అగ్నిమాపక నియంత్రణ వ్యవస్థతదితర అన్ని ఏర్పాట్లకు సంసిద్ధం కావాల్సిందిగా సీఎస్ అన్ని శాఖలను ఆదేశించారు. డిసెంబర్ చివరి నాటికి ఈ కార్యక్రమాలతో సంబంధం ఉన్న అన్ని శాఖల ఉన్నతాధికారులు పనులను పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదికసమర్పించాలన్నారు. క్యూలైన్ల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యా మ్నాయ మార్గాలను అన్వేషించాలన్నారు. గత ఏడాది జాతరలో వాడిన పరికరాలను తిరిగి వినియోగించుకునేలా చూడాలన్నారు. భక్తులను అప్రమత్తం చేసేందుకు ఎక్కడికక్కడ ప్రభుత్వ నిబంధనలతో బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి యేటా ట్రాఫిక్ తీవ్రమవుతున్న నేపథ్యంలో ఈసారి కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలన్నారు. సమాచారశాఖ ద్వారా మీడియా సెంటర్‌ను ఏర్పాటుచేసి విస్తృత ప్రచారం నిర్వహించాల్సిందిగా మార్గదర్శకాలు ఇచ్చారు. గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి మహేష్‌దత్ ఎక్కా మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో కలెక్టర్ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. వివిధ శాఖల ప్రతిపాదనలపై సీఎం కేసీఆర్ ఆమోదం తెలిపిన తర్వాత ఉత్తర్వులు జారీచేస్తామన్నారు. ములుగు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ, జాతర కోసం శాశ్వత ప్రతిపాదికన ఏర్పాట్లు చేయడానికి భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. మహిళలు, వృద్ధుల కోసం వసతి కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. జాతరలో పరిశుభ్రత, పారిశుధ్యంపై జీహెచ్ఎంసీ సహకారం అవసరమని, అందుకు ప్రభుత్వం తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో పంచాయితీరాజ్ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి రాజీవ్ త్రివేది, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి మహేశ్ దత్ ఎక్కా, ఆర్థికశాఖ కార్యదర్శి శివశంకర్, గిరిజన సంక్షేమ కమిషనర్ క్రిస్టిన చోంగ్తూ, దేవాదాయ కమి షనర్ అనిల్ కుమార్, అగ్నిమాపకశాఖ డీజీ సంజ య్‌కుమార్ జైన్, అటవీ ముఖ్య సంరక్షణాధికారి శోభ, తదితర శాఖల ఉన్నతాధి కారులు పాల్గొన్నారు.

## హౌస్ ప్లాన్ ఓకే... అనుమతి పత్రాలు తీసుకెళ్లండి

• ఇళ్ల యజమానులకు పరకాల మున్సిపల్ కమిషనర్ ఫోన్



**పరకాల, ప్రభ న్యూస్ :** ఫ్రెండ్లీ ప్రభుత్వం అన్న పదానికి అర్థం చెబుతూ పరకాల మున్సిపల్ కమిషనర్ తీసుకున్న చర్యకు ప్రశంసలు అందుతున్నాయి. 'హలో.. మీ గృహ నిర్మాణానికి అనుమతి వచ్చింది. కార్యాలయం వచ్చి తీసుకెళ్ళండి' అంటూ పరకాల మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ నూతన గృహ నిర్మాణాదారులకు ఫోన్ చేసి చెప్పడం సంచలనమైంది. కార్యాలయానికి వచ్చిన యజమానులకు స్వయంగా అనుమతుల కాపీలను అందించారు. మంగళవారం పరకాల పురపా లక సంఘం పరిధిలో నూతన గృహ నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న వి.వేణుగోపాల్‌రావు, డి.సరస్వతి, రాపాక రమేష్, తుమ లావణ్య, పూసల రాంమోహన్, ముక్క చంద్రకళలకు స్వయంగా కమిషనర్ శ్రీనివాస్ ఫోన్ చేసి చెప్పారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలో నూతన గృహ నిర్మాణ అనుమతుల కోసం మధ్యదళారులను ఆశ్రయించవద్దని నిబంధనల ప్రకారం దర ఖాస్తుతోపాటు సరైన పత్రాలను సమర్పించి అనుమతులు పొందాలన్నారు.

## ఉద్యోగిని ఆత్మహత్య



**జగిత్యాల, ప్రభ న్యూస్ :** ఏళ్లుగా విధులు నిర్వ హిస్తున్న సంధ్య (26) అనే ఉద్యోగిని మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. జగిత్యాల జిల్లా, మేడిపల్లి మండలం వెంకట్‌రావుపేట గ్రామానికి చెందిన సంధ్య కొన్ని నెలల క్రితమే గంగాధర పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా చేరింది. కొద్ది రోజుల క్రితమే జగిత్యాల జిల్లాకు డిప్యూటేషన్‌పై వచ్చిన సంధ్య మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. బంధువులు హుటాహుటిన జగిత్యాల జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తరలించగా మార్గ మధ్యలో మృతి చెందింది. సంధ్యకు 5 నెలల క్రితమే వివాహమైంది. కేసు నమోదు చేసు కున్న పోలీసులు ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకుంటున్నారు.



# విభేదిస్తూనే... విడదీయలేని బంధం



• టాటా– బిర్లాలతో గాంధీజీ అడుగులు
• స్వాతంత్ర్య పోరాటానికి నిధులిచ్చిన దిగ్గజాలు







జాతిపిత మహాత్మాగాంధీ పేదలపక్షాన, కార్మికుల పక్షాన ఎన్నో సందర్భాలలో పోరాటం చేశారు. అన్ని సందర్భాలలోనూ విజయం సాధించారు. నూలు మిల్లు కార్మికుల కోసం సుదీర్ఘకాలం ఉపవాస దీక్షబూనారు. అయినప్పటికీ దేశంలో పేరుమోసిన పారిశ్రామికవేత్త లతో చక్కటి అనుబంధాన్ని కొనసాగించారు. దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహ ఉద్యమం చేసినప్పటినుంచి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా వాణిజ్య ప్రముఖులు, పారిశ్రామికవేత్తలతో ఆయన సాన్నిహిత్యం కొనసాగింది. ఆ విషయాన్ని ఎప్పుడూ ఆయన రహస్యంగా ఉంచలేదు కూడా. అయితే ఆర్థిక వ్యవహారాలు, వ్యాపారం, కార్మికులసంక్షేమం వంటి అంశాలలో గాంధీజీకి నిర్దిష్టమైన అభిప్రాయాలున్నాయి. మోసం చేయకుండా, తప్పుడు మార్గాలను అనుసరించకుండా కూడా లాభసాటి వాణిజ్యం చేయొచ్చన్నది ఆయన విశ్వాసం. ముఖ్యంగా వేలాదిమంది కార్మికులకు ఉపాధి చూపే పారిశ్రామికవేత్తలు 'సాధన శుద్ధి' (నీతివంతమైన) విధానాలను అనుసరించాలని ఆయన పదేపదే సూచించేవారు. వారు చేసే వాణిజ్యవ్యాపారాలు 'దరిద్ర నారాయణుల' (పేదల)ను దోపిడీ చేసేలా ఉండకూడదని గట్టిగా చెప్పేవారు. చాలా సందర్భాలలో దేశంలో గొప్పగొప్ప పారిశ్రామికవేత్తలతో ఆయన విభేదించారు. వారిపై పోరాటం చేశారు. అదే సందర్భంలో వారితో సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. భారతీయుల స్వాతంత్ర్యం కోసం చేస్తున్న పోరాటానికి పారిశ్రామిక వర్గాల సహాయం తీసుకునేందుకు సంశయించేవారు కాదు. పైగా వారు ఎంత సహాయపడుతున్నదీ బహిరంగంగానే చెప్పేవారు. అయితే అనేక సందర్భాలలో కొందరు పారిశ్రామిక వేత్తలతో ఆయన తీవ్రంగా విభేదించారు. వారిలో మనసుల్లో మార్పు (హృదయ్ పరివర్తన్) రావాలని ప్రార్థించేవారు. పరిశ్రమల యజమానులు... ధర్మకర్తృత్వం (ట్రస్టీషిప్) తో వ్యవహరించాలనే సిద్ధాంతాన్ని పాటించాలని హితబోధ చేశారు. భారీ యంత్రాలు, విస్తృతస్థాయిలో పారిశ్రామికీకరణను గాంధీజీ వ్యతిరేకించారు. అప్పట్లో ప్రముఖ పారిశ్రామికవేత్తలు గాంధీజీ ఉద్యమానికి ఆర్థికంగాను, నైతికం గాను మద్దతు ఇచ్చారు. ప్రధానంగా వాణిజ్య దిగ్గ జాలు అంబాలాల్ సారాభాయ్, జమనలాల్ బజాజ్, ఘన్‌శ్యామ్‌దాస్ బిర్లా మహాత్ముని ఉద్యమానికి మహారాజ పోషకులని చెప్పొచ్చు. ఉద్యమంకోసం గాంధీజీ, ఆయన అనుచరులు చేసిన వ్యయంలో సింహభాగం వీరిచ్చిన నిధుల్లోనివే. అలా సహాయ పడ్డవారిలో కొందరు గాంధీజీకి స్నేహితులు, సహాధ్యాయిలు, సలహాదార్లు. మహాత్ముడు కోరిన 'సాధన్‌శుద్ధి' కి వారు ప్రయత్నించలేదన్న ఆరోపణలున్నప్పటికీ గాంధీజీ వారితో సాన్నిహిత్యాన్ని కొనసాగించారు.

# వసూళ్లు తగ్గాయ్



• సెప్టెంబర్‌లో రూ.91,916 కోట్లు • ఆర్థిక వ్యవస్థకు అద్దంపడుతున్న వసూళ్లు • త్వరలోనే కోలుకుంటాయి • నిపుణులు అంచనా

**న్యూఢిల్లీ :** వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు సెప్టెంబర్‌లో భారీగా క్షీణించాయి. ఏకంగా 19 నెలల కనిష్ఠానికి రూ.91,916 కోట్లకు దిగివచ్చాయి. దీన్ని బట్టి చూస్తే దేశ ఆర్థిక వ్యవస్థ మందగమనంలో కొట్టుమిట్టాడుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. దీంతోపాటు వినియోగదారుల డిమాండ్ కూడా బలహీనంగా ఉన్నట్లు కనిపిస్తోంది. జీఎస్టీ వసూళ్లు తగ్గడం వరుసగా ఇది రెండో నెల... ఆర్థికమంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాలను బట్టి ఇది తెలుస్తోంది.

అంతకు ముందు ఆగస్టు నెలలో రూ.98,202 కోట్లు వసూళ్లు కాగా, క్రితం ఏడాది ఇదే నెలలో రెవెన్యూ వసూళ్లు రూ.94,442 కోట్లు వసూలు అయ్యాయి.

సెప్టెంబర్‌లో గరిష్ఠ జీఎస్టి రెవెన్యూ వసూళ్లు రూ.91,916 కోట్లుగా నమోదయ్యాయి. వాటిలో సీజీఎస్‌టి రూ.16,630 కోట్లు, ఎస్‌జీఎస్‌టి రూ.22,598, ఐజీఎస్టి రూ.45,069 కోట్లు(వాటిలో రూ.22,097 కోట్లు దిగుమతుల ద్వారా) సెస్ ద్వారా రూ.7,620 కోట్లు ( వాటిలో రూ.728 కోట్లు దిగుమతుల సెస్) విలాసవంతమైన వస్తువులు, ఆరోగ్యానికి హాని కలిగించే వస్తువుల నుంచి సేకరించడం జరిగిందని ఆర్థికమంత్రిత్వశాఖ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

మొత్తం జీఎస్‌టీఆర్ 3బీ రిటర్న్స్ (సొంతంగా మదింపు చేసిన రిటర్న్స్) ఆగస్టు నెలకు సంబంధించి (సెప్టెంబర్ 30) వరకు 75.94 లక్షల రిటర్న్స్ ఫైల్ అయ్యాయి. ఇక రెవెన్యూ విషయానికి వస్తే క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చుకుంటే రెవెన్యూ 2.67 శాతం తగ్గిందని తెలిపింది. ఏప్రిల్ - సెప్టెంబర్ కాలానికి చూస్తే దేశీయంగా రెవెన్యూ వసూళ్లు 7.82 శాతం పెరిగాయి. అయితే దిగుమతులపై జీఎస్టి మాత్రం నెగెటివ్ గ్రోత్ (ప్రతికూల వృద్ధి) కనిపించింది. మొత్తానికి జీఎస్టి వసూళ్లు మాత్రం 4.90 శాతం వృద్ధి కనిపించింది.క్రితం ఏడాది అంటే 2018 జీఎస్టి వసూళ్లతో పోల్చుకుంటే ఈ ఏడాది సెప్టెంబర్ 2019లో వసూళ్లు 2.67 శాతం తగ్గాయి. అదే ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ క్రితం ఏడాది 2018 లో ఇదే కాలానికి చూస్తే వసూళ్లు 7.82 శాతం పెరిగాయి. అలాగే దిగుమతుల వచ్చే ద్వారా వచ్చే జీఎస్టి వసూళ్లు మాత్రం నెగెటివ్ వృద్ధి కనిపించింది. మొత్తానికి వసూళ్లు చూస్తే 4.90 శాతం పెరిగాయని ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

జులై 1, 2017 నుంచి జీఎస్టి అమల్లోకి వచ్చింది. అంతకు ముందు 17 రకాల కేంద్ర రాష్ట్రాల పన్నులు.. వాటిలో ఎక్సైజ్ సుంకం, సేవల పన్ను, వ్యాట్‌లాంటివి అన్నీ జీఎస్టిలో కలిసిపోయాయి. తాజా జీఎస్టి వసూళ్లను బట్టి చూస్తే.. దేశ ఆర్థిక వ్యవస్థ ఎలా ఉందో ఇట్టే తెలిసిపోతుంది.



నిపుణుల అంచనా ప్రకారం అక్టోబర్ నుంచి వసూళ్లు పుంజుకుంటాయని.. పండుగ సజీన్ మొదలైనందున వ్యాపారాలు పుంజుకొని వసూళ్లు పెరుగుతాయని ఆశిస్తున్నారు.భారత ఆర్థిక వ్యవస్థ ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో ఆరు సంవత్సరాల కనిష్ఠానికి 5 శాతానికి క్షీణించడంతో ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కార్పొరేట్ పన్నులో భారీ కోత విధించింది. దీంతో ప్రభుత్వానికి ఏడాదికి రూ.1.45 లక్షల కోట్లు నష్టం వాటిల్లుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు జీఎస్టి మొత్తం వసూళ్లు రూ.6.06 లక్షల కోట్లు కాగా, క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.5.78 లక్షల కోట్లు వ

### ఆర్థిక సలహాదారుడు స్పందన

ప్రధాన ఆర్థిక సలహాదారుడు కెవి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. కార్పొరేట్ పన్నులో కోత విధించడంతో త్వరలోనే పెట్టుబడులు పెరుగుతాయని, దీంతో జీఎస్టి వసూళ్ల లక్ష్యాన్ని చేరుకుంటాయని ఆయన అన్నారు. రాబోయే నెలలో జీఎస్టి పన్ను వసూళ్లు పెరుగుతాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. కార్పొరేట్ పన్నులో కోత విధించినందు వల్ల సుమారు రూ.1.45 లక్షల కోట్ల రెవెన్యూ లోటును ఎలా పూడుస్తారని ప్రశ్నించగా.. దీనికి ఆయన సమాధానమిస్తూ.. లోటును పూడ్చుకోవడానికి వివిధ మార్గాలున్నాయని ఉదాహరణకు పెట్టుబడుల ఉపసంహరణ ఒకటని ఆయన తెలిపారు. కాగా తక్షణమే పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం రూ.1.05 లక్షల కోట్లకు కట్టుబడి ఉండాల్సిందేనని ఆయన అన్నారు.



### నిపుణులు అంచనా

ఈవై ఇండియాకు చెందిన టాక్స్ పార్టనర్ అభిషేక్ జైన్ జీఎస్టి వసూళ్ల గురించి ప్రస్తావిస్తూ.. ఇటీవల ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి తీసుకున్న చర్యలు, ప్రస్తుతం పండుగల సీజన్ కొనసాగుతున్నందు వల్ల రాబోయే నెలలో జీఎస్టీ వసూళ్లు పుంజుకుంటాయని చెబుతున్నారు. అలాగే ప్రభుత్వం పన్ను ఎగవేయకుండా గట్టి చర్యలు తీసుకోవడంతో పాటు రెవెన్యూ అధికారులు ఆడిట్‌పై దృష్టి పెడితే జీఎస్టి వసూళ్లు మెరుగుపడుతాయని ఆయన అన్నారు.ఎంఎస్ మనీ, డెలాయిట్ ఇండియా భాగస్వామి మాట్లాడుతూ.. జీఎస్టి వసూళ్లు తగ్గడానికి ప్రధాన కారణం. జీడీపీ గణాంకాలు తగ్గడమే కారణమని, జీఎస్టి అనేది లావాదేవాలపై విధించే పన్ను కాబట్టి ఆర్థిక వ్యవస్థ మందగిస్తే.. దాని ప్రభావం తక్షణమే వసూళ్లపై కనిపిస్తుందన్నారు. అయితే రాబోయేది పండుగ సీజన్ కాబట్టి త్వరలోనే వసూళ్లు మెరుగుపడతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం రూ.21,131 కోట్ల సీజీఎస్‌టి, రూ.15,121 కోట్ల ఐజీఎస్‌టి కేసులను ఎస్‌జీఎస్‌టి కింద పరిష్కరించింది. సీజీఎస్‌టి కేసుల పరిష్కారం తర్వాత కేంద్రప్రభుత్వం సెప్టెంబర్ నెలలో రూ.37,761 కోట్లు ఆర్జించగా.. రాష్ట్రాలు ఎస్‌జీ ఎస్‌టి ద్వారా రూ.37,719 కోట్లు ఆర్జించాయి. సెప్టెంబర్ నెల జీఎస్టి వసూళ్లు ఆందోళన కలిగించే అంశమేనని పరాగ్ మెహతా, ఎన్ఎ షా అసోసియేట్స్ ఎల్ ఎల్‌పీ అన్నారు. వసూళ్లను బట్టి చూస్తే ఆర్థిక వ్యవస్థ ఎలా ఉందో ఇట్టే తెలిసిపోతుందన్నారు. 37వ జీఎస్టి కౌన్సిల్ సమావేశంలో కొన్ని వస్తువులపై పన్ను రేట్లు తగ్గించడంతో పాటు ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు తీసుకుంది. దీని ఫలితాలువచ్చే రెండు నెలల్లో తెలిసిపోతుందన్నారు. రాబోయేది పండుగ సీజన్ కాబట్టి ఆర్థికవ్యవస్థ తిరిగి గాడినపడుతుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.





## బిగ్ సీ దసరా, దీపావళి ఆఫర్లు

• 30 రోజుల్లో 30 కార్లు

**హైదరాబాద్:** తెలుగురాష్ట్రాల్లో నెంబర్ 1 రిటైల్ సంస్థ బిగ్ సీ దసరావళి డబుల్ ధమాకా ఆఫర్‌ను ప్రకటించింది. ఈ ఆఫర్ సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 29 వరకు కొనసాగుతుంది. ఈ కాలంలో బిగ్ సీలో మొబైల్ కొనుగోలు చేసిన వారికి 30 రోజుల్లో లక్కీ డ్రాలో 30 కార్లు, 30 బైక్‌లు గెలుచుకొనే అవకాశం లభిస్తుంది. ప్రతి పండుగ, పర్వదినాలను పురస్కరించుకొని బిగ్ సీ ఆఫర్లను ప్రకటించడం ఆనవాయితీ. అదే విధంగా ఈ దసరా, దీపావళిని పురస్కరించుకొని దసరావళి డబుల్ ధమాకాను ఆఫర్ ప్రకటిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు బాలు చౌదరి తెలిపారు. ఈ లక్కీ డ్రాతో పాటు 10 శాతం వరకు హెచ్‌డీఎఫ్‌సీ క్యాష్‌బ్యాక్, సులభ వాయిదా పద్ధతుల ద్వారా మొబైల్ కొనుగోలు చేసేవారికి ఒక ఈఎంఐ ఉచితం, 30 శాతం పేటీయం క్యాష్ బ్యాక్, ప్రతి మొబైల్ కొనుగోలుపై ఖచ్చితమైన బహుమతి కూడా ఇస్తామని ఆయన తెలిపారు. అలాగే ప్రతి ఎంఐ మొబైల్ మోడల్ కొనుగోలుపై 10 శాతం క్యాష్ బ్యాక్ ఉంటుందన్నారు. మొబైల్ ఫోన్‌కు సంబంధించి ప్రతి రంగంలోనూ బిగ్‌సీ నం1 అని ఆయన తెలిపారు. తాము అందించిన ప్రతి ఆఫర్‌కు చక్కని ప్రజాదరణ లభించిందని, అదే విధంగా ఈ దసరా వళి ఆఫర్‌కు చక్కని విజయం సాధిస్తుందన్న ప్రగాఢ విశ్వా సాన్ని వ్యక్తం చేశారు.





ప్రజలు దసరావళి ఆఫర్‌ను వినియో గించుకొని బహుమతులను గెలుచుకోవాలని ఆకాంక్షించారు.

## ఆంధ్రాబ్యాంకు రుణ మేళా

• రెండు దఫాలుగా • ఈ నెల3 నుంచి7 వరకు • 21 నుంచి 25 వరకు

**హైదరాబాద్ :** ఆంధ్రాబ్యాంకు, ఎన్‌బీఎఫ్‌సీలతో కలిసి దేశవ్యాప్తంగా 11 జిల్లాలో రిటైల్, వ్యవసాయ, వాహన, గృహ, ఎంఎస్‌ఎంఈలతో పాటు వ్యక్తిగత రుణాలు ఇస్తుంది. పండుగ సీజన్‌లో ఈ అవకాశాన్ని చక్కగా వినియోగించుకోవాలని ఆంధ్రాబ్యాంకు ఒక ప్రకటనలో కోరింది. ఆంధ్రాబ్యాంకు ఇతర ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులతో కలిసి మరో రెండు దశల్లో రుణ మేళాలను నిర్వహిస్తుందని తెలిపింది. మొదటి దశలో 3 అక్టోబర్ నుంచి 7 అక్టోబర్ వరకు రెండ దశలో 150 జిల్లాల్లో ఈనెల 21 నుంచి 25 వరకు కొనసాగుతుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆంధ్రాబ్యాంకుకు చెందిన అన్నీ రుణ ప్రాడక్టులను అందుబాటులో ఉంచుతామని తెలిపింది. వ్యాపారులు, సాధారణ ప్రజలు, ఎవరికైతే డబ్బు అవసరం అవుతాయో వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, సమీపంలోని ఆంధ్రాబ్యాంకుకు వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చునని ఒక ప్రకటనలో పేర్కొంది.

## శ్యాంసంగ్ 'గెలాక్సీ ఫోల్డ్'

• ధర రూ.1.65 లక్షలు • ఈ నెలాఖరునాటికి మార్కెట్లో..

**న్యూఢిల్లీ :** ఎలక్ట్రానిక్ దిగ్గజం శ్యాంసంగ్ ఈ నెలఖరుకి అల్ట్రా ప్రీమియం స్మార్ట్‌ఫోన్ 'గెలాక్సీ ఫోల్డ్'ను దేశీయ మార్కెట్లో విడుదల చేస్తామని మంగళవారం నాడు ప్రకటించింది. దీని ధర రూ.1,64,999గా నిర్ణయించింది. ప్రపంచ వ్యాప్తంగా ఈ ఫోన్‌కు విశేషస్పందన లభించింది. కాగా ఈ ఫోన్ ఈ ఏడాది ప్రారంభంలోనే ఆవిష్కరించింది. దక్షిణ కొరియాతో పాటు అమెరికా మార్కెట్లో గత నెలలో విడుదల చేసింది. మీడియాలో వచ్చిన వార్తల ప్రకారం ఈ ఫోన్ డిస్ప్లే స్క్రీన్‌లో కొన్ని సాంకేతికపరమైన ఇబ్బందులు తెలెత్తినా.. వాటిని పరిష్కరించినట్లు కంపెనీ తెలిపింది. గెలాక్సీ ఫోల్డ్ ఇతర ఫోన్‌లకు సాటిరా దని.. వినూత్నమైన డిజైన్‌తో మార్కెట్లో విడుదల చేస్తున్నామని.. స్టయిల్, డిజైన్ లగ్జరీ కావాలనుకునే వారికి ఈ ఫోన్ బాగా నచ్చుతుందని శ్యాంసంగ్ ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మొబైల్ బిజినెస్ రంజివిజిత్ సింగ్ చెప్పారు. కస్టమర్ల కోసం ప్రత్యేకంగా 24 గంటల పాటు సర్వీసు అందుబాటులో ఉంచి వారి అడిగే ప్రశ్నలకు జవాబిస్తామని.. ఫోల్డ్‌కు ఒక సంవత్స రం పాటు డిస్‌ప్లే ప్రొటెక్షన్ ఇస్తామని తెలిపా రు.

దీని ధర రూ.1.65 లక్షలు కాగా, భారతీయ మార్కెట్లో అత్యంత ఖరీదైన ఫోన్‌గా చెప్పుకో వచ్చు. కాగా 512 జీబీ వెరియెంట్ ఆపిల్ లెటెస్ట్ ఐ ఫోన్ 11 ప్రొ మాక్స్ దీని ధర రూ.1,41,900, ఐ ఫోన్ 11 (512 జీడీ) ప్రస్తుతం రూ. 1,3,900కు లభిస్తోందని ఆపిల్ వెబ్‌సైట్ ద్వారా తెలుస్తోంది.

శ్యాంసంగ్ ప్రీమియం ఫోన్ల విషయానికి వస్తే గాలాక్సీ ఎస్10 ప్లస్ ధర రూ.73,900 నుంచి రూ.79,999 మధ్య విక్రయిస్తున్నట్లు కంపెనీ వెబ్‌సైట్ సమాచారం ద్వారా తెలుస్తోంది.

గెలాక్సీ ఫోల్డ్ ఫీచర్ల విషయానికి వస్తే 7.3 అంగుళాల ఇనిఫినిటీ ఫ్లెక్స్ డిస్‌ప్లేతో కస్టమర్లకు అతి పెద్ద స్క్రీన్‌లో చూస్తున్నట్లు అనుభూతి కలుగుతుంది. ఈ ఫోన్ అన్‌ఫోల్డ్ చేస్తున్నప్పుడు.. ఎలాంటి శబ్దం లేకుండా పుస్తకం తెరిచనట్లు ఉంటుందని తెలిపింది. ఫింగర్‌ప్రింట్ స్కానర్ ఒక వైపు ఇచ్చినట్లు పేర్కొంది. యూజర్ ఒకేసారి పలు యాప్‌లను రన్ చేసుకొనే వెసులుబాటు కల్పించింది. ఫోల్డ్ ఫీచర్ల విషయానికి వస్తే 12 జీబీ రామ్, 512 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ, 4,380 ఎం ఎహెచ్ డ్యూయల్ బ్యాటరీ, 10 ఎంపీ సెల్ఫీకెమెరా కవర్ డిస్‌ప్లేపై ఉంటుంది. 10 ఎంపీ, 8 ఎంపీ కెమెరాలు మెయిన్ ఇంటర్నల్ డిస్‌ప్లే వద్ద ఉంచింది. అలాగే 16 ఎంపీ, 12 ఎంపీ, 12 ఎంపీ ట్రిపుల్ రెయిర్ కెమెరా సెటప్‌ను కూడా అందుబాటులో ఉంచినట్లు కంపెనీ ఒక ప్రకటనలో వివరించింది. అక్టోబర్ 4 నుంచి ముందుస్తు బుకింగ్‌లు మొదలుపెడుతోంది. డెలివరీ ఈ నెల 20 నుంచి ప్రారంభిస్తుంది. ముందుస్తు బుకింగ్‌లు శ్యాం సంగ్ ఆన్‌లైన్ స్టోర్‌లతో పాటు దేశంలోని 35 నగ రాల్లో 315 ఆఫ్‌లైన్ స్టోర్‌లలో కూడా లభిస్తుంది.



## జియో ఫోన్ రూ.699

• రిలయన్స్ జియో పండుగ ఆఫర్

**న్యూఢిల్లీ:** రిలయన్స్ జియో 4జీ మొబైల్ హ్యాండ్‌సెట్ జియో ఫోన్ ధరను 50 శాతం తగ్గించి రూ.699కే విక్రయిస్తోంది. జియో ఫోన్ ఫ్లాట్‌పాంపై 2జీ వినియోగదారులు 7 కోట్లు మంది ఉన్నారని ఫోన్ ప్రారంభించినప్పుడు వెల్లడించింది. ఈ కస్టమర్ల సంఖ్యను 35 కోట్లకు పెంచుకుంటామని తెలిపింది. దసరా, దీపావళి పండుగను పురస్కరించుకొని ప్రస్తుతం ఉన్న రూ.1,500 ధరలో 50 శాతం తగ్గించి రూ.699కే విక్రయిస్తాయని, దీంతో వినియోగదారుడికి రూ.800 ఆదా అవుతుందని, గతంలో మాదిరిగా పాత ఫోన్ ఇచ్చి కొత్త ఫోన్ తీసుకోవాలన్న షరతులుండవని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రధానమంత్రి డిజిటల్ ఇండియా పిలుపును పురస్కరించుకొని ప్రతి భారతీయుడికి చౌకధరలో ఫోన్‌తో పాటు ఇంటర్నెట్ అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో జియో దీపావళి కానుగా ఈ ఆఫర్ ఇస్తోందని రిలయన్స్ జియో సీఎండీ ముఖేష్ అంబానీ అన్నారు.



# మూడో రోజూ నేలచూపులే

• 737 పాయింట్ల నుంచి 361 పాయింట్లకు • 22 శాతం కుంగిన ఎస్ బ్యాంకు

**ముంబై :** స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు నష్టాలతో ముగిశాయి. బ్యాంకింగ్ కష్టాలు ఒక వైపు, ఆటో అమ్మకాలు బలహీనంగా నమోదు కావడం, ఆర్థిక వ్యవస్థ బలహీనంగా నమోదు కావడంతో దాని ప్రభావం అన్నీ రంగాలకు చెందిన షేర్లపై పడి అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి.

ఇక ట్రేడింగ్ విషయానికి వస్తే సెన్సెక్స్ ప్రారంభంలో లాభాలతోనే మొదలైనా... మధ్యాహ్నానికి 737 పాయింట్లకు దిగివచ్చి.. మార్కెట్ ముగిసే నాటికి కాస్తా కోలుకొని చివరకు 38,305.41 పాయింట్లు లేదా 361.92 పాయింట్లు లేదా 0.94 శాతం నష్టంతో ముగిసింది. నిఫ్టీ కూడా తీవ్రమైన ఒడిదుడుకులకు గురై చివరకు 114.55 పాయింట్లు లేదా ఒక శాతం నష్టంతో 11,359.90 ముగిసింది. కాగా సెన్సెక్స్ వరుసగా మూడు ట్రేడింగ్ సెషన్‌లలో 684.33 పాయింట్ల వరకు నష్టపోగా.. నిఫ్టీ 211.30 పాయింట్లు నష్టపోయింది. మార్కెట్ విశ్లేషకుల అంచనాప్రకారం పంజాబ్ అండ్ మహారాష్ట్ర కో ఆపరేటివ్ బ్యాంకు (పీఎంసీ)లో ఏర్పడిన సంక్షోభం మరింత ముదిరిపోవడంతో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారని చెబుతున్నారు. పీఎంసీ బ్యాంకు... ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఐహెచ్‌ఎఫ్‌ఎల్)కు కుట్రపూరితంగా రుణాలు ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇక ఎస్‌బ్యాంకు విషయానికి వస్తే 22 శాతం వరకు క్షీణించింది. వరుసగా ఐదో రోజు నష్టపోయింది. ప్రమోటర్ రాణాకపూర్ ఆయన గ్రూపునకు చెందిన 2.16 శాతం వాటాలు రూ.510 కోట్లు విలువ చేసే షేర్లను విక్రయించ డం షేరు భారీగా కుంగింది. నష్టపోయిన ఇతర షేర్ల విషయానికి వస్తే ఇండస్‌ఇండ్ బ్యాంకు, ఎస్‌బీఐ, భారతి ఎయిర్‌టెల్, ఒఎన్‌జీసీ, టాటా స్టీల్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు 6.30 శాతం వరకు నష్టపోయాయి. దీనికి వ్యతిరకంగా హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతి సుజుకి, కొటక్ బ్యాంకు, హెచ్‌యూఎల్, ఏషియన్ పెయింట్స్ మాత్రం లాభాలతో ముగిశాయి. కీలకమైన ఎనిమిది మౌలికరంగాలు తిరోగమనబాట పట్టడంతో పాటు, ప్రభుత్వం కార్పొరేట్ టాక్స్‌లో కోత విధించిన తర్వాత కూడా ప్రభుత్వం ద్రవ్యలోటును జీడీపీలో 3.3 శాతానికి కట్టడి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడం ఆందోళన కలిగించే అంశం. మొత్తానికి చూస్తే ఈ పండుగ సీజన్ తర్వాత కూడా మార్కెట్లు కోలుకొనే పరిస్థితి కనిపించడం లేదు. ఎందుకంటే ఆటో అమ్మకాలు బలహీనంగా ఉండటమే కారణం. బ్యాంకు షేర్లు ఒడిదుడుకులకు లోను కావడం, డాలర్ మారకంతో రూపాయి బలహీనపడ్డం తదితర అం శాలు తోడు కావడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడ్డారని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతు న్నారు. కాగా సెప్టెంబర్ నెల తయారీరంగానికి చెందిన పర్చేజ్ మేనేజర్ ఇండెక్స్‌లో ఎలాంటి మార్పులు 51.4 పాయింట్లలో మార్పులేదని ఐహెచ్ఎస్ మార్కిట్ సర్వే పేర్కొంది. సోమవారంమార్కెట్ ముగి సిన తర్వాత కీలకమైన 8 మౌలికరంగాలకు చెందిన అధికారిక గణాంకాలు విడుదల అయ్యాయి. ఆగస్టు నెలలో 0.5 శాతానికి దిగివచ్చాయి.





బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం సడలుతోందన్న ప్రచారం మొదలైంది. పంజాబ్ అండ్ మహారాష్ట్ర కో ఆపరేటివ్ (పీఎంసీ) బ్యాంకు కేసుకు సంబంధించి సోమవారం ముంబై పోలీసులు హెచ్‌డీఐఎల్ ప్రమోటర్లపై కేసు నమోదు చేశారు. ప్రత్యేక దర్యాప్తు బృందం ఈ కేసును దర్యాప్తు చేస్తుంది. మంగళవారం ఆర్‌బీఐ ఒక ట్వీట్ చేస్తూ.. దేశంలోని కొన్ని ప్రాం తాల్లో కొన్ని బ్యాంకులు వాటిలో కో ఆపరే టివ్ బ్యాం కులు కూడా మోసాలకు పాల్పడుతున్నాయని.. డిపాజిటర్ల సొమ్ము స్వాహా చేస్తున్నట్లు ప్రజల్లో ఆందోళన వ్యక్తం అవుతు న్నాయని తమ దృష్టికి వచ్చిందని తెలి పింది.

ఈ పరిణామాలను గమనించిన ఆర్‌బీఐ సాధా రణ ప్రజ లకు హామీ ఇస్తూ.. భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థ భద్రం గా స్థిరంగా ఉందని.. ప్రజలు పుకార్లను నమ్మరాదని, ఆందోళన పడాల్సిన అవసరం లేదని హామీలు గుప్పిం చింది.

# ప్రగతి పట్టాలపై.. హైస్పీడ్

**• నేటితో ద.మ. రైల్వేకు 53 ఏళ్లు • 754 స్టేషన్లు, 6,234 కిలోమీటర్ల మేర సేవలు**

**• నెట్‌వర్క్ విస్తరణ, ట్రాఫిక్ అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానంలో ముందంజ**



1916 నాటి కాచిగూడ రైల్వే స్టేషన్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఇవాళ్టికి సరిగ్గా యాభై మూడేళ్ల క్రితం ప్రారంభమైన దక్షిణమధ్య రైల్వే విని యోగదారుల సేవకు అంకితభావంతో పనిచేస్తోంది. వినియోగదారుల హృదయాలను గెలుచుకుంటూ నెట్‌వర్క్ విస్తరణ, ట్రాఫిక్ అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, వినియోగాలతో దక్షిణ మధ్యరైల్వే జోన్ ఎన్నో విజయాలను సాధించిందని ఆ సంస్థ అధికా రులు తెలిపారు. 1966, అక్టోబర్ 2న సికింద్రాబాద్ కేంద్రంగా దక్షిణమధ్య రైల్వేను తొమ్మిదవ జోన్‌గా అప్పటి రైల్వేశాఖ మంత్రి ఎస్‌కే పాటిల్ ప్రారంభించారు. ఆ రోజు జాతిపిత మహాత్మాగాంధీ పుట్టినరోజు కావడంతో గాంధీజీ చెప్పినట్లు సంస్థకు వినియోగ దారులే దేవుళ్ళుగా భావిస్తూ దక్షిణ మధ్యరైల్వే తన సేవలను కొనసాగిస్తున్నది. ప్రస్తుతం దక్షిణ మధ్యరైల్వే 754 స్టేషన్లు, 6,234 కిలోమీటర్ల రైలు మార్గాలతో దేశంలోని ఉత్తర, తూర్పు, పశ్చిమ ప్రాంతాలను దక్షిణ భారతదేశంతో అనుసంధానిస్తున్నది.

### ఆర్థికంగా దూకుడు

ఈ ఐదు దశాబ్దాలకు పైగా ప్రయాణంలో దక్షిణ మధ్యరైల్వే ప్రయాణంలో, వినియోగదారుల సేవకై అంకితభావంతో కృషి చేస్తున్నదని రైల్వే అధికారులు వివరించారు. దక్షిణ మధ్యరైల్వే జోన్ ఏర్పడి నాటినుంచి రైల్ నెట్‌వర్క్‌లో 1,083 రూట్ కిలోమీటర్లను నూతన రైలు మార్గాలతో వివిధ ప్రాంతాలను అనుసంధానిస్తూ ఆర్థికప్రగతికి దోహదం చేస్తున్నది. దక్షిణ మధ్యరైల్వేలో 1967-68లో 11 మిలియన్ టన్నుల సరుకు రవాణా జరిగింది. ఈ ప్రగతి ప్రతియేటా పెరుగుతూ వస్తోంది. 2011-12 ఆర్థిక సంవత్సరంలో 100 మిలియన్ టన్నుల మైలురాయిని చేరుకోగా, 2018-19లో 122.5 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేయగల స్థాయికి ఎదిగింది. మరోపక్క ప్రయాణీకుల రవాణాలో కూడా పలు సేవల కల్పనలతో గుణాత్మకమైన మార్పు నమోదు చేసింది. దక్షిణ మధ్యరైల్వే చరిత్రలో ప్రారంభ సంవత్సరం 115 మిలియన్లమంది ప్రయాణించగా ఆ సంఖ్య 2018-19లో 383 మిలియన్లకు చేరింది. దక్షిణ మధ్య రైల్వే ఆదాయం కూడా 1967-68లో రూ. 68.06 కోట్లు కాగా, 2018-19లో జోన్ ఆదాయం రూ.15,640 కోట్లకు అభివృద్ధి చెందింది.

### టెక్నాలజీలో ప్రగతి

దక్షిణ మధ్యరైల్వే సర్వీసు లను మెరుగు పరుస్తూ తన పరిధిలోని ప్రాంతాల అద్భుత ఆర్థిక ప్రగతికి తోడ్పడుతున్నది. శిథిలమైన చెక్క కోచ్‌లు కలిగిన 1960 నాటి ప్రయాణీకుల రైళ్ళతో పోలిస్తే ఈనాడు ఎంతో అధునాతమైన సాంకేతికపరిజ్ఞానం కలిగిన ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు జతచేసిన రైళ్ళు సౌకర్యంలోనూ, భద్రతలోనూ అత్యున్నత ప్రమాణాలు కలిగి ఉన్నాయి. భారతీయ రైల్వేలో అందుబాటులో ఉన్న రైలు సర్వీసులన్నీ దక్షిణ మధ్యరైల్వే అందిస్తున్నది. వీటిలో రాజధాని, శతాబ్ది, జనశతాబ్ది, సంపర్క్ క్రాంతి, గరీబ్‌రథ్‌లతో పాటు ఇటీవల ప్రారంభించిన అంత్యోదయ, హంసఫర్, ఉదయ్ రైలు సర్వీసులు కూడా ఉన్నాయి. 1966-67లో 350 మంది ప్రయాణీకులను తీసుకువెళ్ళే రైళ్ళతో ప్రారంభమై ప్రస్తుతం అత్యధిక సంఖ్యలో ప్రయాణీకులను తీసుకువెళ్ళే 750 రైళ్ళు ప్రతిరోజూ దక్షిణ మధ్యరైల్వే జోన్ నిర్వహిస్తున్నది. హైదరాబాద్ కేంద్రంగా జోన్‌లోని సబర్బన్ రైల్ సిస్టం నిర్వహణ 1960 చివరి కాలంతో పోలిస్తే 50 కిలోమీటర్ల పరిధిలో 2003లో ప్రారంభించిన మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్టు సిస్టం (ఎంఎంటీఎస్) ద్వారా 121 రైలు సర్వీసులు నిర్వహిస్తూ ప్రతిరోజూ 1.60 లక్షల ప్రయాణీకులకు ప్రయోజనం కలిగిస్తోంది. ఎంఎంటీఎస్ ఫేస్-2 ప్రాజెక్టు పూర్తయ్యే దశలో ఉంది, ప్రతిపాదిత ఎంఎంటీఎస్ ఫేస్-3 కూడా అందుబాటులోకి వస్తే నగర ప్రజల ప్రయాణ సౌకర్యాలను మరింత మెరుగవుతాయి.



1890నాటి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

దక్షిణ మధ్య రైల్వే
SOUTH CENTRAL RAILWAY

### దక్షిణ మధ్యరైల్వే వారసత్వం...

1874, అక్టోబర్ 8న వాడి దగ్గరలోని చిత్తాపూర్ నుంచి సికింద్రాబాద్ మధ్య గ్రేట్ ఇండియన్ పెనిన్సులా రైల్వేస్ (జీఐపీ), నిజాం స్టేట్ సంయుక్త ఆధ్వర్యంలో 110 కిలోమీటర్ల రైలుమార్గాన్ని నిర్మించి ప్రారంభించడం జరిగింది. తదాదిగా రైల్వేల అభివృద్ధి క్రమక్రమంగా జరుగుతూ వచ్చింది. నిజాం స్టేట్ ప్రభుత్వం తమ రాజ్యంలో ఆర్థికాభివృద్ధికి, పాలనపై నియంత్రణకు రైల్వే నెట్‌వర్క్‌ను విస్తరించడం జరిగింది. మహారాష్ట్ర మొత్తాన్ని కలిపేందుకుగానూ సికింద్రాబాద్‌తో మన్మాడుని అనుసంధానించడం జరిగింది. సికింద్రాబాద్ హైదరాబాద్ మధ్యరైలు అనుసంధానం వేగవంతంగా జరిగి భద్రాచలం వద్ద బొగ్గు ఉత్పత్తిచేసే సింగరేణి ప్రాంతాలకు విస్తరించడం జరిగింది. ఈ అనుసంధానం మద్రాస్-కోల్‌కతాలను కలిపే ముఖ్యమైన మార్గమైంది. అదే సమయంలో మధ్య భారతదేశంలో అనుసంధానం కోసం కాజీపేట, వరంగల్ నుంచి భద్రాచలం వరకు రైలు మార్గాలు నిర్మించడం జరిగింది. దీనితో దక్కను పీఠభూమితో పాటు ఉత్తర భారతదేశంతో రైలు అనుసంధానం అవతరణకు మార్గం ఏర్పడింది.

మహాత్మా గాంధీ 150వ జయంతి ముగింపు ఉత్సవాలు

## విద్యావాలంటీర్లు, గెస్ట్ లెక్చరర్ల వేతనాలు విడుదల

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ప్రతిపాదనల మేరకు విద్యా వాలంటీర్ల సంబంధించి సెప్టెంబర్ నెల వరకు వేతనాలను మంజూరు చేస్తూ మంగళ వారం విద్య శాఖ కార్య దర్శి డాక్టర్ బి జనార్ధన్‌రెడ్డి ఉత్త ర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యా వాలం టీర్లందరికీ వెంటనే దసరా పండుగ లోపుగానే సెప్టెంబర్ వరకు వేతనాలను చెల్లించాలని పాఠశాల విద్య కమిషనర్ టి విజయ్ కుమార్ జిల్లా విద్యా శాఖాధికా రులను ఆదేశించారు. ఎటువంటి ఆలస్యం చేయకుండా దసరా పండుగలోపే వారికి వేతనాలు అందేలా చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. ప్రభుత్వ జూని యర్ కాలేజీల్లో అతిథి అధ్యాపకులుగా పని చేస్తున్న వారికి జనవరి, ఫిబ్రవరి మాసాల వేతనాల తోపాటు ఆగస్టు, సెప్టెం బర్ వేత నాలను కూడా మంజూరు చేసినట్టు ఇంటర్ విద్య కమిషనర్ సయ్యద్ ఉమర్ జలీల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఎస్సీ కమిషన్‌కు కానిస్టేబుల్ అభ్యర్థుల ఫిర్యాదు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** కానిస్టేబుల్ నియామకాల్లో తమకు అన్యాయం జరి గిందని తగిన న్యాయం చేయాలని కోరుతూ కానిస్టేబుల్ అభ్యర్థులు తెలంగాణ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్ అభ్యర్థులు మంగళవారం కమిషన్ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. మొన్న జరిగిన కానిస్టేబుల్ నియామకాల్లో తమకు అన్యాయం జరిగిందని మెరిట్ ఉన్న అభ్యర్థులకంటే తక్కువ మార్కులు వచ్చిన వారికి ఉద్యోగాలు వచ్చాయని బాధిత అభ్యర్థులు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తానని కమిషన్ చైర్మన్ హామీ ఇచ్చారని అభ్యర్థులు తెలిపారు. జిల్లాల్లో సివిల్ రైట్స్ డేను నిర్వహించాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారులను ఎస్సీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆదేశించారు. మంగళ వారం జిల్లా అధికారులతో చైర్మన్ సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలపై సమీక్షించారు.

## జగన్ అభ్యర్థనపై సీబీఐ అభ్యంతరం



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** వ్యక్తిగత హాజరు మినహా యింపు ఇవ్వాలన్న ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అభ్యర్థనపై సీబీఐ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అక్రమాస్తుల కేసులో జగన్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేసిన సీబీఐ ఏపీ సీఎం జగన్ వాస్తవాలను దాచిపెట్టి కోర్టును ఆశ్రయిం చారని అందులో ఆరోపిం చింది. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇస్తే తనకున్న రాజకీయ, ధన, కండ బలంతో సాక్ష్యులను ప్రభావితంచేసే ప్రమాదం ఉందని సీబీఐ తరపు న్యాయవాదులు కౌంటర్ దాఖలు సందర్భంగా వాదించారు. జగన్మోహన్‌రెడ్డి తరపు న్యాయ వాదులు దాఖలు చేసిన పిటిషన్‌లో ఏపీ పునర్ విభజన, గత ప్రభుత్వ పనితీరు తదితర విషయాలు ఈ కేసుతో ఏమాత్రం సంబంధం లేనివని అనవ సరంగా ఆ అంశాలను జగన్ ప్రస్తావిస్తున్నారని సీబీఐ వాదించింది. రాష్ట్ర ఆర్థిక, రెవె న్యూ అంశాలను ప్రస్తావించడం ద్వారా వాస్తవాలను పక్కదారి పట్టించే ప్రయ త్నాలలో భాగమేనని సీబీఐ స్పష్టంచేసింది. ఏపీ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే తీవ్రమైన అభియోగాలు జగన్‌పై ఉన్నాయని గతంలో సుప్రీం పేర్కొన్న అంశాన్ని సీబీఐ కోర్టు దృష్టికి తీసుకువచ్చింది. ఏపీ రాష్ట్ర రెవెన్యూ లోటుకు సీఎం జగన్ వ్యక్తిగత హాజరు మినహాయింపునిచ్చే అంశానికి ఎటువంటి సంబంధం లేదని ఇది కారణంగా చూపించడం హేతుబద్ధంకాదన్నారు.

## 'సైరా'కు హైకోర్టు సై

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** సైరా నర్సింహారెడ్డి సినిమా విడుదలకు హైకోర్టు పచ్చజెండా ఊపింది. ఈ చిత్రం విడుదలను నిలువరించలేమని, ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. సివిల్ వివాదం కారణంతో సినిమా విడుదలను నిలిపివేయాలంటూ తమిళనాడులోని తెలుగు యువశక్తి అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టివేసింది. సినిమాను కేవలం వినోదం కోసం మాత్రమే చూడాలని హైకోర్టు సూచించింది. ఎంతోమంది మహానుభావుల చరిత్రను ఉన్నది ఉన్నట్లుగా ఎవరు చూపించారని హైకోర్టు ప్రశ్నించింది. గతంలో గాంధీజీ, మొగల్ చక్రవర్తులపై తీసిన సినిమాలను ప్రస్తావించింది. సినిమా నచ్చడం, నచ్చకపోవడం అనే అంశాలను ప్రేక్షకులకు వదిలిపెట్టాలని హైకోర్టు హితవు చెప్పింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ ఏ అభిషేక్ రెడ్డితో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

### వడ్డే ఓబయ్య వివాదంపై వ్యాజ్యం..

ఉయ్యాలవాడ నర్సింహారెడ్డికి ప్రధాన అనుచరుడిగా వడ్డే ఓబయ్య ఉండేవారని, కానీ ఆయన స్థానంలో రాజా పాండేను ప్రధాన అనుచరుడిగా చూపారని పేర్కొంటూ వడ్డెర సంక్షేమ సంఘం హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది బాలాజీ వడ్డెర వాదనలు వినిపిస్తూ ..చరిత్రను వక్రీకరించడం సినిమాటోగ్రఫీ చట్టం ప్రకారం నేరపూరితమైన చర్య అని తెలిపారు. దీనిపై చిత్ర నిర్మాత తరపున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్ రెడ్డి స్పందిస్తూ...వడ్డే ఓబయ్య పాత్ర ను తొలగించలేదని, చిత్రంలో ఉందని విన్నవించారు. ఈ మేరకు ప్రమాణ పత్రం దాఖలు చేయాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. తదుపరి విచారణ ఈ నెల 16కి వాయిదా వేశారు.

## మోడీవి ప్రజావ్యతిరేక విధానాలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని వామపక్ష పార్టీలు నిర్ణయం తీసుకున్నాయి. ఈనెల 10 నుంచి 18వ తేదీవరకు దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్టు వామపక్ష పార్టీల నేతలు ప్రకటించారు. మంగళవారం సీపీఎం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు గంగారావు, సీపీఎం నేతలు డీజీ నరసింహారావు, నాగయ్య, సీపీఐ నాయకురాలు పశ్య పద్మ, జానకి రాములు, ప్రసాద్, సూర్యం, అన్వేష్, రవి తదితరులు పాల్గొన్నారు. ఈనెల 10న మరోసారి సమావేశమై పోరాటానికి సంబంధించి కార్యాచరణను రూపొందించుకోవాలని నిర్ణయించారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాలు అమలు చేస్తుం డడం, దీంతో పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు సంక్షోభంలో నెట్టబడ్డా యని వారు విమర్శించారు. కార్పొరేట్ సంస్థల మేలు కోసమే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారా అని ఆయన మండిపడ్డారు. ఆర్‌బీఐ నుంచి రూ.1.70 లక్షల కోట్లు రిజర్వు ఫండ్ తీసుకుని సంపన్నులకు ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు.

## రేపు ఏవోబీ బంద్‌కు మావోయిస్టుల పిలుపు

**విశాఖపట్నం, ప్రభన్యూస్:** ఏవోబీ ప్రాంతం లో ఆపరేషన్ సమాధాన్ పేరుతో గత నెల రోజులుగా దాడులు, అక్రమ అరెస్టులు, ఎన్‌కౌంటర్లతో మారణకాండను కొనసాగిస్తున్న దానికి నిరసనగా అక్టోబరు 3న ఏవోబీ బంద్‌కు పిలుపు నిస్తున్నట్టు సీపీఐ మావోయిస్టు ఏవోబీ (ఎస్‌జెడ్‌సి) కార్యదర్శి గణేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం గణేష్ పేరిట విడుదల చేసిన లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. కేంద్రం లో బీజేపీ ప్రభుత్వంలో ప్రధాని మోడీ, ఏపీ కొత్తగా అధికారంలోకి వచ్చిన సీఎం జగన్, ఒడిశా రాష్ట్రంలో నవీన్ సర్కార్‌లు భూస్వామ్య అనుకూల విధానాలను అవలంబిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ఆంధ్రా, ఒడిశా సరి హద్దు ప్రాంతాలలో అత్యంత దుర్మార్గమైన పద్ధతిలో నిర్వహించిన ఎన్‌కౌంటర్‌ను దీనికి ఉదాహరణగా పేర్కొన వచ్చన్నారు. ఈ కాల్పుల్లో డివిజనల్ కమిటీ సభ్యు డు రాకేష్ ఒక కమాండోని మట్టుబెట్టి తదుపరి వీరమరణం పొందాడని తెలిపారు. మౌలిక సమస్యల పరిష్కారం కోసం కటాఫ్ ఏరియా ప్రజలు ప్రభు త్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నా రన్నారు.

## రాష్ట్రంలో జాతీయ రహదారుల పనులు పూర్తిచేయండి



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ రహదారుల నిర్మాణ పను లను వేగవంతంగా పూర్తి చేయాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు, టీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత నామా నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఢిల్లీ వెళ్లిన ఆయన వాణిజ్య వ్యవహారాల పార్లమెం టరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొ న్నారు. దేశ వాణిజ్య వ్యవహారాలు, అంతర్జా తీయ వాణిజ్య సంబంధాలు, పారిశ్రామిక రంగం ప్రగతిపై సమావేశంలో చర్చ జరిగింది. వ్యవసాయ రంగంతో పాటు పరిశ్ర మలు, సేవా రంగం ప్రగతిపై ఎంపీల మధ్య చర్చ జరిగింది. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు సంబం ధించి నివేదికలను సమావేశంలో అధికారులు విడుదల చేశారు. వాణిజ్య వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల సమావేశంలో నామా నాగేశ్వర రావుతో పాటు పలువురు ఎంపీలు పాల్గొన్నారు. అనంతరం ఆయన కేంద్ర రోడ్డు, రవాణా, ఉపరితల శాఖా మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయ్యారు.రహదార్ల అభివృద్ధిపై జనవరి 1వ తేదీ, 2019న సీఎం కేసీఆర్ కేంద్రానికి లేఖ రాశారని గుర్తు చేశారు. ఈ నాలుగు రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణలో 50 శాతం వ్యయం భరిస్తుందని, అటవీ భూముల మళ్లింపు వంటి అంశాలను చేపడుతుందని నామా నాగేశ్వరరావు చెప్పారు. ఆగస్ట్ 29వ తేదీ, 2018, ఈ ఏడాది ఆగస్టు ఫస్టున తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మరో రెండు లేఖలు కేంద్రానికి రాశారని ఆయన అన్నారు. ప్రాంతీయ వలయ రహదారుల కోసం భూ సేకరణలో రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం వ్యయాన్ని భరిస్తుందని నామా నాగేశ్వరరావు కేంద్ర మంత్రికి తెలిపారు.



## శాస్త్రవేత్త అనుమానాస్పద మృతి

**హైదరాబాద్, ప్రభ న్యూస్ :** హైదరాబాద్ లో నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీలో పని చేస్తున్న ఓ శాస్త్రవేత్త అనుమానస్పద స్థితిలో చనిపోయారు. తలపై గాయాలుండడంతో హత్య కావొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎస్ఆర్ నగర్ సీఐ మురళీ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం అమీర్‌పేట్ డికె రొడ్డులోని అన్నపూర్ణ అపార్ట్‌మెంట్ లో సురేష్ అనే వ్యక్తి అనుమానస్పదస్థితిలో మృతి చెందినట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లామని, మృత దేహన్ని పోస్ట్ మార్టంకు పంపించామని తెలిపారు. తమిళనాడుకు చెందిన సురేష్ కుమార్ ఎన్ ఆర్ ఎస్ఏలో శాస్త్రవేత్తగా పని చేస్తూ 20 ఏళ్లుగా అమీర్‌పేట్ నివాసముంటున్నారు. ఆయనకు భార్య ఇందిర తో పాటు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతంలో ఇండియన్ బ్యాంక్ మేనేజర్ గా పని చేసిన భార్య ఇందిర కు చైన్నెకు బదిలీ కావడంతో 2005 లో అక్కడికి వెళ్లి పోయారు. అప్పటి నుంచి ఇంట్లో సురేష్ కుమార్ ఒక్కరే ఉంటున్నారు. ఈక్రమంలో సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన సురేష్ కుమార్ తన గదిలో నుంచి బయుటకు రాలేదు. మంగళవారం తొటి ఉద్యోగులు అతనికి ఫోన్ చేయడంతో ఫోన్ లీఫ్ట్ చేయకపోవడంతో అతని భార్యకు సమాచరం ఇచ్చారు. చెన్నె నుంచి నగరానికి వచ్చిన అతని భార్య ఇందిరా, పోలీసులు కలిసి తాళాన్ని పగుల గొట్టి లోపలికి వెళ్లగా అతను మృతి చెందినట్లు తెలిసింది. సంఘటన స్థలాన్ని డీసీపీ సుమతి, ఏసీపీ తిరుపతన్న పరిశీలించారు. తలపై బలమైన ఆయుధంతో మోదడంతో చనిపోయినట్లుగా ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న ఎస్ ఆర్ నగర్ పోలీసులు హత్యకేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నీటితొట్టిలో పడేసి పసికందును చంపిన తండ్రి

**• రెండో కాన్పులోనూ ఆడపిల్ల పుట్టిందని కోపం**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆకాశంలో సగం, అవనిలో సగం అని ఆడపిల్లల గురించి గొప్పగా చెబుతున్న నేటి సమాజంలోనూ ఆడపిల్లలు అడుగడుగున వివక్షకు గురవుతూనే ఉన్నారు. తల్లి గర్భంలోనే లేదా భూమ్మీద పడిన తర్వాతనో ప్రాణాలు కోల్పోతునే ఉన్నారు. రక్తం పంచుకు పుట్టిన శిశువును అతి కిరాతకంగా తండ్రి హతమార్చిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చోటు చేసుకుంది. రెండో సారి కూడా కూతురే పుట్టిందని ఓ తండ్రి అతి దారుణంగా నెల రోజుల పసి కందును నీటి తొట్టిలో వేసి చంపేశాడు. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని చర్ల మండలం రేగుంటకు చెందిన సూర్యతేజ, అఖిల దంపతులకు నెల రోజుల క్రితం ఆడబిడ్డ పుట్టింది. మొదటి సంతానంలో కూడా అమ్మాయే. రెండో సంతానంలోనూ ఆడబిడ్డే జన్మించడంతో అఖిలతో సూర్యతేజ తరచూ గొడవ పడడం ప్రారంభించాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి కూడా ఇద్దరు గొడవపడ్డారు. మంగళవారం తెల్లవారుజామున అఖిల నిద్రపోయిన తర్వాత పసికందును తీసు కున్న సూర్యతేజ ఇంటిముందున్న నీటి తొట్టెలో పడేశాడు. మూడు గంటల సమ యంలో తన పక్కన బిడ్డ లేకపోవడంతో అఖిల తీవ్ర ఆందోళనకు లోనైంది. ఇంటి చుట్టుపక్కల వెతుకుతున్న క్రమంలో నీటితొట్టెలో బిడ్డ శవమై తేలింది. బిడ్డను చూసిన తల్లి గుండెలవిసేలా రోదించింది. స్థానికులు అక్కడకు చేరుకుని సూర్యతేజను చెట్టుకు కట్టేసి చితకబాదారు. అనంతరం సూర్యతేజను పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇటీవల వర్ధన్నపేట సమీపంలో ఆడపిల్ల పుట్టిందని తాత వడ్ల గింజ వేసి ప్రాణం తీసిన ఘటన మరిచిపోకముందే సూర్యతేజ అనే కసాయి తండ్రి మరో పసిపాప ఉసురు తీశాడు.

## సీఎం కార్యదర్శి పేరిట నకిలీ లేఖ కలకలం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** సీఎం కార్యదర్శి పేరిట నకిలీ లేఖ కలకలం రేపింది. కొందరు దుండగులు సీఎం కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసి నకిలీ లేఖ సృష్టించారు. ఆ లేఖలో శేరిలింగంపల్లిలోని హుసూనాబాద్ హౌసింగ్ సొసైటీ స్థలానని క్రమ బద్ధీకరించారంటూ రెవెన్యూ అధికారులకు ఫోర్జరీ సంతకంతో కూడిన ఆ నకిలీ లేఖను పంపారు. కాగా సదరు లేఖ విషయాన్ని కార్యదర్శి దృష్టికి రెవెన్యూ అధికారులు తీసుకెళ్లారు. అయితే తాను ఎలాంటి లేఖ రాయలేదంటూ రెవెన్యూ అధికారులకు సీఎం కార్యదర్శి నర్సింగరావు తేల్చి చెప్పారు. దీంతో సైబర్ క్రైం పోలీసులకు సదరు ఫోర్జరీ నకిలీ లేఖపై ఫిర్యాదు చేశారు.

## ఐటీ, డిజిటల్ టెక్నాలజీతో చిన్నతరహా పరిశ్రమలు బలోపేతం

**• అంతర్జాతీయ పోటీకి దీటుగా సీఐఐ దన్ను**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ప్రపంచస్థాయి పోటీని తట్టుకునేలా దేశీయ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఐటీ, డిజిటల్ పరిజ్ఞానాన్ని అవలంబించాల్సిన అవసరముందని సీఐఐ (కాన్ఫ డరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) అభిప్రాయపడింది. ఎంఎస్ఎంఇ (మీడియం, స్మాల్, మైక్రో ఎంటర్ ప్రెన్యూర్స్)కు ఐటీ, డిజిటల్ అవసరం పై సీఐఐ ఓ సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా డిజిలై జేషన్‌లో తొలి విడతగా సీఐఐలో అంతర్భాగంగా ఉన్న ఎంఎస్ఎంఇలకు వారి అవసరాలకు అను గుణంగా ఐటి, డిజిటల్ సదుపాయాలను అందిం చేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. సదస్సులో పలువురు వక్తలు మాట్లాడుతూ ఎంఎస్ఎంఇ సెక్టార్‌లో 70శాతం కంపెనీలు ప్రాథమిక స్థాయి పరిజ్ఞానంతోనే సరి పెట్టుకుంటు న్నాయన్నారు. 20శాతం రెండో దశలో ఉండగా, 10శాతం మాత్రమే ఐటీ, డిజి టల్ సేవలను అందుకోగలిగాయన్నారు. రాజేంద్ర వెలగపూడి మాట్లాడుతూ మైసూరు లో చేపట్టిన సైయెంట్ ఇఎల్ఎం అమలు తీరుపై కేసు స్టడీని ప్రదర్శించారు. మహేష్ దేశాయ్ మాట్లా డుతూ దేశ సంపద సృష్టిలో అతిపెద్ద వాటా ఎంఎస్ఎంఇ లదేనని, దేశ జీడీపీలో 9శాతం ఉందని తెలిపారు. టెక్నికల్‌సెషన్లలో టీసీఎస్ లైఫ్ సైన్సెస్ అడ్వైజరీ సర్వీసుల కన్సల్టింగ్ పార్టనర్, మైక్రో సాఫ్ట్ ప్రిన్సిపల్ ప్రోగ్రామ్ మేనేజర్ తరుణ్ మాలిక్, ఫిన్ టెక్ డెస్కెరా హెడ్ శ్వేతా దాస్ గుప్తా, గూగుల్ ట్రస్టు అండ్ సేఫ్టీ సీనియర్ మేనేజర్ అనిల్ రెడ్డి చిదురాల, డిజివేషన్ డిజిటల్ సొల్యూ షన్స్ అసోసియేట్ డైరెక్టర్ మాల్విక జగ్గి తమ సాంకేతిక నైపుణ్యాలను వివరించారు. ఇందులో బాగంగా జరిగిన పానల్ డిస్కషన్ లో సిడ్బీ ఏజీఎం కామే శ్వర్ రావుతల్లూరి, నేషనల్ స్మాల్ స్కేల్ ఇంటస్ట్రీస్ కార్పొరేషన్ డిజిఎం బి,విష్ణు మూర్తి, రథ సిఇఓ అశుతోష్ బుద్ది రాజు, సైబర్ మోషన్ టెక్నాలజీస్ టెక్నికల్ డైరెక్టర్ ప్రవీణ్ జంబోల్కర్, ఓట్లస్ వేవ్ సిఇఓ ఫౌండర్, సిఇఓ, చార్లెస్ శశిపాల్ పాల్గొన్నారు.



## వ్యవసాయ భూమిలో పొంగిన గంగ

**ఏర్గట్ల, ప్రభన్యూస్ :** నిజామాబాద్ జిల్లా, ఏర్గట్ల మండలం తొర్తి గ్రామంలో బోరుబావి నుంచి నీరు ఎగజిమ్ముతోంది. భారీ వర్షాలు కురియడంతో కుండచక్రి అనే రైతు వ్యవసాయ భూమిలో వేసిన బోరుబావుల నుంచి మోటారు ఆన్ చేయకున్నా నీరు బయటికి చిమ్ముతోంది. విద్యుత్ సరఫరా లేకున్నా నీరు రావడంతో గ్రామప్రజలు ఆశ్చర్యపోతున్నారు.

## టీఆర్‌టీ సెలెక్టెడ్ అభ్యర్థులకు పోస్టింగ్ ఇవ్వాలి

**• ప్రగతిభవన్ ముట్టడికి యత్నం.. అరెస్ట్**



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఉపాధ్యాయ నియామక పరీక్ష(టీఆర్‌టీ)లో సెలెక్ట్ అయిన అభ్యర్థులకు వెంటనే పోస్టింగ్‌లు ఇవ్వాలని తెలంగాణ సెలెక్టడ్ టీచర్స్ యూ నియన్ డిమాండ్ చేసింది. సెలెక్టెడ్ అభ్యర్థులు మంగళవారం ప్రగతి భవన్ ముట్ట డికి ప్రయత్నించారు. సాయంత్రం మంత్రివర్గ సమావేశం ఉండటంతో ప్రగతి భవన్ పరిసరాల్లో కనిపించిన టీఆర్‌టీ సెలెక్టెడ్ అభ్యర్థులను అరెస్టు చేసి గోషా మహల్ స్టేడియంకు తరలించారు. అరెస్టు చేసిన సెలెక్టెడ్ అభ్యర్థులను కలవడానికి జాతీ య బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య, కాంగ్రెస్ నాయకులు, టీఎస్ యూటీఎఫ్, ఎస్‌టీయూ, పీఆర్‌టీయు, టీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నేతలు ప్రయత్నించారు. అయితే వారిని కలవడానికి అనుమతించకపోవడంతో పోలీసు లతో వాగ్వాదం చోటుచేసుకుంది. తెలంగాణ సెలెక్టెడ్ టీఆర్‌టీ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్, నాయకులు గుజ్జ కృష్ణ, నర్సింహాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. హైకోర్టు తీర్పు ప్రకారం 6, 580 మంది టీఆర్‌టీ సెలెక్టెడ్ అభ్యర్థులకు వెంటనే పోస్టింగ్‌లు ఇవ్వాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు.

## బీసీ విద్యార్థుల మేలుకొలుపు యాత్ర

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో ఉన్న బీసీ విద్యార్థులను చైతన్యం చేయడం కోసం ఈ నెల రెండో వారం నుంచి బీసీ విద్యార్థుల మేలు కొలుపు యాత్రను చేపడుతున్నట్టు బీసీ సంఘాల సమావేశం తీర్మానించింది. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన బీసీ సంఘాల సమావేశం మంగళవారం బీసీ భవన్‌లో జరిగింది. సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారపు గణేష్ చారి, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనకాల శ్యాం కురుమ, బడేసాబ్, నంద, బత్తిని రాజు తదితరులు పాల్గొన్నారు. బీసీలకు విజ్ఞానం వచ్చేలా చేయడం కోసం మేలుకొలుపు యాత్రను చేపడుతున్నట్టు తెలిపారు. రెండు నెలలపాటు యాత్ర కొనసాగుతుందని తెలిపారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పొడుగు వెంకటరమణ నేతను అలాగే యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గంజి వంశీని నియమిస్తున్నట్టు తెలిపారు.

## సర్పంచ్‌ల ఆందోళనకు బీజేపీ మద్దతు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో సర్పంచ్‌లు చేపట్టిన ఆందోళనకు తమ పార్టీ మద్దతు ఉంటుందని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ సర్పంచ్‌ల సం ఘం ప్రతినిధులకు హామీ ఇచ్చారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సౌదాని భూమన్న యాదవ్‌ను విడుదల చేయాలని కోరుతూ మంగళ వారం బీజేపీ కార్యాలయం లో ఆయన్ను సంఘం ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించారు. లక్ష్మణ్‌ను కలిసిన వారిలో సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్, కార్యదర్శి ధనలక్ష్మీ తదితరులున్నారు.

### కాంగ్రెస్‌లో గందరగోళం : కృష్ణసాగర్ రావు

కాంగ్రెస్ పార్టీ గందరగోళంలో ఉందని, మహాత్మగాంధీని జాతీయ స్థాయి నాయకుడిగా తగ్గించే విధంగా కాంగ్రెస్ నేతలు వ్యవహరిస్తున్నారని బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి కె. కృష్ణసాగర్ రావు విమర్శించారు. మహాత్మాగాంధీ వారసత్వాన్ని తమ సొంతమని చెప్పుకోవడం మానుకోవాలన్నారు. లక్షలాది మందిని ఏకం చేసి భారత దేశ స్వేచ్ఛ కోసం పోరాడిన జాతీయ నాయకుడు గాంధీ అని ఆయన కొనియాడారు. బీజేపీ వేసిన ప్రశ్నలకు సమాధానికి బదులు మరిన్ని ప్రశ్నలు వేసి క్షమాపన కోరడం ఏమిటని టీపీసీసీ నేతల్ని ఆయన నిలదీశారు.

epaper.prabhanews.com






## ఖైదీ నం: 1739

అది 1913 సంవత్సరం. దక్షిణాఫ్రికా ప్రభుత్వం గాంధీని జైలులో బంధించింది. ఆ జైలు పేరు బ్లోయెమ్‌ఫాంటైన్. ఇక్కడ గాంధీ ఖైదీ కార్డు వివరా లు ఇలా వున్నాయి.

**ఖైదీ నం :** 1739
**పేరు :** మోహన్‌చంద్ కరంచంద్ గాంధీ
**మతం :** హిందు
**వయసు** : 43
**వృత్తి :** న్యాయవాది
**శిక్షతేది :** 11-11-1913
**విడుదల తేది :** 10-11-1914
**జరిమానా :** 20 లేదా 30 పౌండ్లు

అయితే, సత్ప్రవర్తన కింద గాంధీకి 50మార్కులు వచ్చాయి. దాంతో ఒక్క పౌండ్ జరిమానా చెల్లించాల్సిన అవసరం రాలేదు. పూర్తికాలం జైలు శిక్షగడిపారు. ఖైదీ కార్డు మీద వేలిముద్రలు ఉండేవి. జైలులో ఆహార పద్దతు లు తన మత విశ్వాసాలకు అనుగుణంగానే ఉండేవి. 12 అరటి పండ్లు, 12 ఖర్జూర పండ్లు, 3 టమాటాలు, 1 నిమ్మకాయ, 2 ఔన్సుల ఆలివ్ ఆయిల్, 3 వేరు సెనగ పప్పులు డైట్‌లో భాగంగా ఉండేవి.

## అంకుల్ గాంధీ

గాంధీని మనమంతా తాతగానే భావిస్తాం. గాంధీతాత అని సంబోధిస్తాం. మనకు తెలియని మరొక కోణం కూడా ఉంది. బాపూని అంకుల్ గాంధీ అని కూడా పిలిచేవారంటే మనకి ఆశ్చర్యంగా అనిపించొచ్చు. కానీ ఇది వాస్తవం. దీని వెనుక కథ తెలియాలంటే బాపూజీ లండన్‌లో గడిపిన రోజుల్లోకి వెళ్లాల్సిందే. అది సెప్టెంబర్ 1931. గాంధీజీ రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యేందుకు ఇంగ్లండ్ వెళ్లారు. చాలా మంది స్నేహితులు తమ విలాసవంతమైన గృహాలలో ఆతిథ్యానికి ఆహ్వానించారు. అతను మాత్రం పేద ప్రజలు నివశించే కింగ్స్‌లీ ప్రాంతంలో ఉండేందుకే మొగ్గు చూపారు. భారతదేశం నుంచి వచ్చిన సదరు వీఐపీని చూసేందుకు చాలా మంది వచ్చి వెళ్తున్నారు. దీన్ని గమనించిన ఓ పిల్లవాడు వాళ్ల అమ్మ వద్దకు వెళ్లి ఎవరా? వ్యక్తి? రోజంతా చాలా మంది వచ్చి వెళ్తున్నారు? అని అమాయకంగా ప్రశ్నించాడు. 'అతను భారత జాతీయ ఉద్యమ నాయకుడు, అతని పేరు మహాత్మా గాంధీ'' అని చెప్పడంతో, గాంధీ అని సంబోధించడం ప్రారంభించాడు. అలా పేరుతో పిలవొద్దు. తప్పు. ఆయన గొప్ప వ్యక్తి అని అతని తల్లి బుద్దులు చెప్పింది. 'ఐ యామ్ సారీ మమ్మీ. ఇకపై నేను గాంధీ అని పిలవను.. అంకుల్ గాంధీ అని పిలుస్తాను' అన్నాడు. ఓసారి గాంధీ పుట్టిన రోజున పిల్లలు 'ప్రియమైన అంకుల్ గాంధీ' అని సంబోధిస్తూ గిఫ్ట్ ప్యాకెట్ పంపారు. ఈ బహుమతులను బాపు ఎంతో మెచ్చారు. లండన్ నుంచి తిరిగి స్వదేశం వచ్చేటప్పుడు పిల్లల కానుకను మాత్రమే తన వెంట తెచ్చుకున్నారు.

# అలుపెరుగని బాటసారి!



### గాంధీకి ప్రపంచం నివాళి... నేడు 150వ జయంత్యుత్సవాలు ముగింపు



**మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ ఈ పేరు విశ్వవ్యాపితం. మహాత్ముడు మరణించి 70 ఏళ్లు దాటినా, ఆయన ఆదర్శాలు, బోధనలు, రచనలు ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి ప్రేరణగా నిలుస్తున్నాయి. గాంధీ బోధనలు 21వ శతాబ్దంలో నేటికీ అనుసరణీయంగా, అవసరణీయంగాను ఉన్నాయంటే ఆయనెంత ప్రభావితుడో ఇట్టే తెలిసిపోతుంది. మహాత్మా గాంధీ వ్యక్తిత్వం గురించి చెప్పాలంటే చాలా కోణాల్లో విశ్లేషించాల్సి ఉంటుంది. ప్రపంచంలోని గొప్ప నాయకుడు, దూరదృష్టి గలవాడు, నిరాయుధ సైనికుడు, నిర్భయమైన యోధుడు, అహింస, సత్యాగ్రహాన్ని విశ్వసించిన మహోన్నతుడు. భారతజాతి స్వేచ్ఛ కోసం జీవితాన్ని పణంగా పెట్టిన త్యాగశీలి. లండన్‌లో బారిస్టర్ విద్యను అభ్యసించినా, దక్షిణాఫ్రికాలో బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాటం సాగించారు. జాతి వివక్ష, అంటరానితనంపై అహింసాయుధాన్ని సంధించారు. ద.ఆఫ్రికా నుంచి స్వదేశం తిరిగొచ్చాక, స్వాతంత్ర్యోద్యమ పోరాటాన్ని అతివాదం నుంచి శాంతి పథంవైపు మళ్లించారు. సత్యాగ్రహంతో భారతజాతికి బానిస సంకెళ్లనుంచి విముక్తి కల్పించారు. పర్యావరణ హితంలోనూ బాపూ తనదైన ముద్రవేసుకున్నారు. అలుపెరగని బాటసారిగా సమాజ చైతన్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన బోసినవ్వుల బాపూజీ స్మృతిపథంలో మధురజ్ఞాపకాలను స్మరించుకుందాం.**

## బాపూ సంగతులు

గాంధీజీ విభిన్నమైన నాయకుడు. మిగతా నేతలకు ఆయనకు ఎంతో తేడా ఉంది. గాంధీజీ చెప్పిన ప్రతి సూత్రం స్వీయానుభవంతో చెప్పినదే. ఆచరించి చూపినదే. అందుకే ఆయన చెప్పినవన్నీ ఇప్పటికీ అనుసరణీయమే. మతం, విద్య, మహిళ, యువత, ఆధ్యాత్మికత, వ్యాపారం, ఆహారం, ఆహార్యం ఇలా అన్నింటిపైనా ఆయన నిర్దిష్టమైన, స్పష్టమైన అభిప్రాయాలు చెప్పారు. ఆయన సత్యశోధనలో అవన్నీ కనిపిస్తాయి. అవేంటో క్లుప్తంగా చూద్దాం.

### ఆత్మకథ ఎందుకు?

'ఆత్మకథ రాయడం పాశ్చాత్య విధానం. మీరెందుకు రాస్తున్నారు. ఇవాళ్టి మీ సిద్ధాంతాలు రేపు ఎవరు అంగీకరిస్తారు అని నా అనుచరుడు ఓసారి ప్రశ్నించాడు. నేను ఆత్మకథ రాయాలని అనుకోలేదు. నా జీవితంలో ఎన్నో సత్య ప్రయోగాలు చేశాను. ఆ అనుభవాలను అక్షరబద్ధం చేస్తే ప్రజలకు ఉపరిస్తుందని భావించా. దీనిని ఆత్మచరిత్రగా భావిస్తున్నా'

### మహాత్మా నచ్చలేదు

'నా జీవితంలో చేసిన రాజకీయ ప్రయోగాలన్నీ ప్రజలకు తెలుసు. వాటివల్లే అందరూ నన్ను మహాత్మా అన్న బిరుదుతో పిలుస్తున్నారు. నా దృష్టిలో ఆ ప్రయోగాలకు, ఈ బిరుదుకు ఉన్న విలువ బహు స్వల్పం. ఆ బిరుదుపట్ల నాకు అనేక పర్యాయాలు విచారం కూడా కలిగింది. ఆ బిరుదును తలచుకుని ఉబ్బితబ్బిబ్బయిన క్షణం నా జీవితంలో ఒక్కటి కూడా లేదన్నట్లు గుర్తు.'

### హాస్టల్ చదువులొద్దు

'పిల్లలను చిన్నతనంలో తల్లిదండ్రులకు దగ్గరగా ఉంచి చదివించడమే మేలైన మార్గం. దూరంగా, వసతిగృహాల్లో ఉంచి చదివించడం వల్ల అనర్థాలు తప్పవు. అయితే కొంత ఇంగిత జ్ఞానం, లోకజ్ఞానం తెలిసిన తరువాత వారిని అలా దూరపు చదువులకు పంపొచ్చు. నా జీవితంలో నేను ఇదే ఆచరించా. ఓ సందర్భంలో మా వాళ్లను వసతిగృహాల్లో చదువుకు పంపినా... నిర్ణయం మార్చుకుని దగ్గరకు తెచ్చుకున్నా. అయితే నా సమక్షంలో వారు గొప్ప విద్యలేవీ అభ్యసించలేకపోయినా, లోకజ్ఞానం అబ్బిందని భావిస్తున్నా. వారిలో ఏదైనా లోపాలు కనిపిస్తే, దానికి నేనే బాధ్యుడిని'

### ఎక్కువ భాషలు నేర్పాలి

'పిల్లలకు మాతృభాషతోపాటు ఎక్కువ భాషలు నేర్పాలి. ఇక్కడ భాషల సంఖ్య చూసి భయపడనక్కరలేదు. హిందీ, సంస్కృతం, ఫారసీ, అరబ్బీ, ఇంగ్లీషు ఉన్నత విద్యాప్రణాళికలో పాఠ్యాంశాలుగా మార్చాలి. దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడు నా పిల్లలకు గుజరాతీ నేర్పాను, ఆ భాషలోనే మాట్లాడేవాడిని. భారతీయ భాషల్లో పట్టురావాలంటే సంస్కృతం నేర్పాలి. ఉర్దూలో ప్రావీణ్యం కావాలంటే అరబ్బీ నేర్చుకోవాలి.

## గాంధీజీ ఆశ్రమాలు



- దక్షిణాఫ్రికాలో గాంధీజీ ఆశ్రమం ఉంది. 1910లో దీన్ని గాంధీజీ సన్నిహితుడు హర్మన్ కల్లెన్‌బాచ్ ఏర్పాటు చేశాడు. టాల్‌స్టాయ్ ఫామ్ పేరుతో దీన్ని కొనసాగించారు. అయితే అనివార్య కారణాలతో దాన్ని 1913లోనే రద్దు చేశారు. గాంధీజీ దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడు చదువుకు సంబంధించిన ప్రయోగాలు ఇక్కడే చేసేవారు.
- బంగ్లాదేశ్‌లో కూడా ఆశ్రమం ఉంది. 1946 నుంచి కొనసాగుతూనే ఉంది. గాంధీజీ లక్ష్యాలైన గ్రామీణ అభివృద్ధి, శాంతి, సామాజిక బాధ్యత వంటి వాటిని ఇక్కడ అమలు చేస్తుంటారు. గాంధీజీ ఆశ్రమ్ ట్రస్టు పేరుతో ఇది నడుస్తోంది. 1946లో నోఖాలీలో మతపరమైన అల్లర్లు చెలరేగాయి. ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. గాంధీ సూచించిన శాంతి మిషన్‌లో భాగంగా గాంధీ ఆశ్రమ్ ట్రస్టును ఏర్పాటు చేశారు. నోఖాలీలో గాంధీజీ 4 నెలల పాటు ఉన్నారు.
- మహారాష్ట్రలోని వార్ధాలో సేవాగ్రామ్ ఆశ్రమం ఉంది. 1936 నుంచి 1948 వరకు ఇక్కడే గాంధీజీ ఉన్నారు. స్వాతంత్ర్య సమరాంగణ కార్యాచరణ ఇక్కడినుంచే చేపట్టారు. 1930లో సబర్మతి నుంచి దండి వరకు ఉప్పు సత్యాగ్రహంలో భాగంగా పాదయాత్ర ప్రారంభించారు. స్వాతంత్ర్యం వచ్చే వరకు సబర్మతికి రావొద్దని నిర్ణయించుకున్నారు. రెండేళ్లపైగా జైల్లో ఉన్నాడు. దేశంలోని మధ్యప్రాంతాన్ని ప్రధాన కార్యాలయంగా చేయాలని భావించి జమ్నాలాల్జీ బజాజ్ ఆహ్వానంతో 1934లో వార్ధాకు వచ్చారు.
- గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సబర్మతి ఆశ్రమం ఉంది. దీన్ని గతంలో సత్యగ్రహ ఆశ్రమం అని పిలుస్తారు. న్యాయవాది జీవన్‌లాల్ దేశాయ్ కోచారాబ్ బంగ్లా వద్ద ఇది ఉంది. ఆ తరువాత దాన్ని సబర్మతి నదికి సమీపంలో మార్చడం జరిగింది. 1915 నుంచి 1933 వరకు గాంధీజీ ఇక్కడే ఉన్నారు. చారిత్రాత్మక ప్రదేశంగా ఇప్పుడు విరాజిల్లుతోంది. 1915, మే 25న సత్యగ్రహ ఆశ్రమాన్ని ప్రారంభించారు. దక్షిణాఫ్రికా నుంచి 25 మంది సహచర ఖైదీలతో భారత్‌కు తిరిగి వచ్చాక దీన్ని స్థాపించారు. 1917, జూలైలో సబర్మతి నదీ తీరానికి మార్చారు. హృదయ్ కుంజ్ అనే చిన్న గదిలో గాంధీజీ నివాసం ఉండేవారు.

## బాపు దినచర్య

| | |
|---|---|
| ఉదయం 4.00 : | నిద్ర లేవడం. |
| 4.20 : | ప్రార్థనలు చేయడం, రాయడం లేదా పని చేయడం లేదా విశ్రాంతి తీసుకోవడం. |
| 7.00 : | అల్పాహారం, ఉదయం నడక (సుమారు 5 కి.మీ). ఆశ్రమం వంట గదిలో సాయం. శుభ్రపర్చడం. మరుగుదొడ్డి క్లీన్ చేయడం. పాత్రలు శుభ్రపర్చడం. కూరగాయలు కోయడం, గోధుమలు గ్రైండింగ్ చేయడం మొదలగునవి. |
| 8.30 : | సందర్శకులతో మాటామంతీ. రాయడం, చదవడం. |
| 9.30 : | సూర్యుడి వెలుగులో ఆయిల్ మసాజ్ చేసుకొని టబ్ బాత్ చేయడం (టబ్ బాత్ సమయంలో గాజు లేదా సబ్బు లేకుండా షేవింగ్ చేయడం) |
| 11.00 : | లంచ్ చేయడం. |
| మధ్యాహ్నం 1.00 : | కరస్పాండెన్స్, సందర్శకులతో ముచ్చట. |
| 4.30 : | స్పిన్నింగ్. |
| సాయంత్రం 5.00 : | సాయంత్రపు భోజనం |
| 6.00 : | సాయంత్రపు ప్రార్థన (లేదా ప్రసంగం) |
| 6.30 : | సాయంత్రపు నడక (కొద్ది సేపు మాత్రమే) |
| 9.00 : | పడక గదిలోకి వెళ్లిపోవడం (సోమవారాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసుకోవడం) |

### ఫుట్‌బాల్ ప్రేమికుడు

మీరు నమ్ముతారో లేదో కానీ, గాంధీజీకి ఫుట్‌బాల్ ఆటంటే ఎంతో ఇష్టం. అలాగని ఆయన ఎప్పుడూ ప్రొఫెషనల్‌గా ఫుట్‌బాల్ ఆడలేదు. దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడు రెండు క్లబ్ టీమ్‌లను ఏర్పాటు చేశాడు. ఒకటి జొహెన్స్ బర్గ్‌లో, మరొకట ప్రిటోరియాలో ఏర్పాటయ్యాయి. రాజకీయ తత్వవేత్తలైన హెన్రీ థోరియూ, లియోటాల్‌స్టాయ్ స్ఫూర్తితో వారి పేర్లు పెట్టారు.

### సత్యాగ్రహం..

ఒకసారి తన గురువు గోపాలకృష్ణ గోఖలే అస్వస్థతకు గురయ్యారు. అప్పుడు ఆయనకు గాంధీ కచ్చితమైన ఆహారపు డైట్‌ను సూచించారు. గోఖలే దీన్ని వ్యతిరేకించేవారు. అయినా గాంధీ మాత్రం వదిలిపెట్టేవారు కాదు. పండ్లు, ఉడకబెట్టిన కూరగాయలు మాత్రమే తినిపించేవారు. కొన్నిసార్లు ఇతర మిత్రులతో కలిసి భోజనం చేయాల్సి వచ్చినప్పుడూ గోఖలే డైట్ గురించి ముందే హెచ్చరించేవారు. గాంధీ అనుమతి లేకుండా రాత్రివేళల్లో బయటకు వెళ్లేందుకు సైతం సాహసించేవారు కాదు. ఓసారి ఈ స్మృతులను గుర్తుచేస్తూ, సత్యాగ్రహానికి వెళ్లడం ద్వారా సత్యాగ్రహిని ఓడించానని గోఖలే బిగ్గరగా నవ్వారట.

### చెరగని ముద్ర

గాంధీజీతో ఎవరైనా ఒకసారి మాట్లాడినా, కలిసినా జీవితాంతం గుర్తుంచుకుంటారట. అప్పట్లో వల్లభాయ్ పటేల్ గొప్ప లాయర్. ఒకసారి అహ్మదాబాద్ క్లబ్‌లో బ్రిడ్జ్‌గేమ్ ఆడుతున్నారు. అక్కడకు కొల్లాయి కట్టుకున్న ఓ వ్యక్తి వచ్చాడు. రైతులా కనిపించే ఆ వ్యక్తి, పటేల్‌ను, అతని మిత్రులను తన ప్రసంగం వినేందుకు రావాలని పిలిచారు. ఇందుకు ఆసక్తి చూపని పటేల్, తన టేబుల్‌వద్దే కూర్చుండి పోయాడు. కానీ, కొల్లాయి, నల్లటి శరీరం కలిగిన ఈ మనిషి ఏం చెబుతాడో అన్న ఆసక్తి ఏర్పడింది. వెంటనే లేచి ప్రసంగం వినేందుకు వెళ్లాడు. ఆ క్షణాన గాంధీ చెప్పిన సత్యాగ్రహం విధానానికి ఆకర్షితుడయ్యాడు. న్యాయవాద వృత్తికి స్వస్తిచెప్పాడు. చాలా ఏళ్ల తర్వాత యాదృచ్ఛికంగా గాంధీ, పటేల్ ఇద్దరూ యరవాడ జైలుకు వెళ్లాల్సి వచ్చింది. అక్కడ గాంధీకి పటేల్ బ్రిడ్జి ఆట నేర్పాడట.

### కవి సమక్షంలో...

రవీంద్రనాథ్ ఠాగూర్ గాంధీజీకి మహాత్మా అనే బిరుదు ఇచ్చారు. ఈ బిరుదు ఇవ్వడానికి గల కారణాన్ని వివరించారు. గాంధీ వేలాది మంది నిరాశ్రయుల గుడిసెల వద్దకు వెళ్లాడు. వారితో వారి స్వంత భాషలో మాట్లాడాడు. పుస్తకాల్లో నీతి సూక్తులు కాకుండా వాస్తవాన్ని వారికి తెలియజెప్పారు. ఈ కారణంగానే భారత ప్రజలు ఆయనకు మహాత్మా అని పేరుపెట్టారు. భారతీయు లందరూ తన సోదరులేనని భావించేవారు. గాంధీ పిలుపుతో భారతదేశం నూతన అధ్యాయాన్ని లిఖించింది.

### సమయస్ఫూర్తి..

1921లో గాంధీజీ ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశానికి హాజరయ్యారు. సమావేశం తర్వాత ప్రజలు భారీ సంఖ్యలో గుమికూడారు. ఎత్తైన మట్టి దిబ్బపై వేదిక ఏర్పాటు చేయబడివుంది. దానిపై గాంధీజీ ఉన్నారు. ఆయన ప్రసంగం ప్రారంభించారు. అకస్మాత్తుగా జనంలోకి ఒక ఆవు వచ్చింది. తొక్కిసలాట జరిగింది. ప్రజలు మట్టిదిబ్బపైకి ఎక్కడానికి ప్రయత్నిస్తుండగా, వేదికకూలినంత పనైంది. గాంధీజీ పందిరి కింద చిక్కుకున్నారు. గాంధీజీ ఒక కుర్చీపైకి దూకి క్షేమంగా బయటపడ్డారు. తాను బస చేసిన ప్రదేశానికి చేరుకున్నాడు. కొద్ది గంటల తర్వాత అతని సహచరులు గాంధీని చూసి ఆశ్చర్యపోయారు. వారి సందేహాలకు గాంధీజీ ప్రశాంతవదనంలోని మౌనమే సమాధానమైంది.

### నేతాజీ కోసం డైట్

ఉపవాస ప్రయోగాలకు గాంధీ ప్రసిద్ది చెందారు. ఆహారం సంస్కరణ, డైట్ అండ్ డైట్ రిఫార్మ్, ది మోరల్ బేసిస్ ఆఫ్ వెజిటేరియనిజం, కీటు హెల్త్ వంటి పుస్తకాలు కూడా రాశారు. తన అనుచరులకే కాకుండా, ఇతరులకు కూడా ఏమి తినాలో, ఏమి తినకూడదో సలహా ఇచ్చేవారు. 1936లో తన రాజకీయ ప్రత్యర్థులలో ఒకరైన నేతాజీ సుభాష్ చంద్రబోస్ కోసం ఆహార నియమావళి చార్ట్ సిద్ధంచేశారు. ఆకు కూరలు తప్పక తీసుకోవాలి, సలాడ్ గా తీసుకుంటే మంచిది. బంగాళాదుంపలు, పిండి దుంపలు తక్కువగా తీసుకోవాలి. పచ్చి వెల్లుల్లి, ఉల్లిపాయలను తినాలి. రక్తపోటు కోసం నేను పచ్చి వెల్లుల్లిని క్రమం తప్పకుండా తీసుకుంటాను. మంచి జీర్ణానికి ఎండుద్రాక్ష మేలు. టీ, కాఫీ ఆరోగ్యానికి అవసరమని నేను భావించను అని గాంధీ అందులో పేర్కొన్నారట.

### ప్రతి నిముషం లెక్కే..

గాంధీజీ డార్జిలింగ్‌లోని బొమ్మ రైలులో ప్రయాణిస్తున్నప్పుడు ఓ సంఘటన జరిగింది. రైలు కొండపైకి వెళుతుండగా, అకస్మాత్తుగా ఇంజిన్ బోగీల నుండి విడిపోయింది. రైలు లోపల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. గాంధీజీ మాత్రం ప్రశాంతంగా తన కార్యదర్శికి లేఖ పాఠం చెబుతున్నారు. అపుడు కార్యదర్శి ఇలా అన్నారు. మనం బతుక్కి, చావుకి మధ్య వేలాడుతున్నాం. మరుసటి క్షణం మనం బ్రతికి ఉంటామా లేదా అనేది కూడా తెలియదు అన్నాడు. ఇందుకు బాపు బదులిస్తూ, మనం చనిపోతే చనిపోతాం. ఒక వేళ తప్పించుకునే ప్రయత్నం చేస్తే సమయం వృధా అవుతుంది. కాబట్టి, దయచేసి డిక్టేషన్ తీసుకోండి అన్నాడట. వణుకుతున్న చేతులతోనే గాంధీజీ కార్యదర్శి డిక్టేషన్ తీసుకున్నారు. అదృష్టవశాత్తు ఆ ప్రమాదంలో వారికేం కాలేదు.

"మన అభివృద్ధికి ఆటంకం కలిగించే 7 సాంఘిక పాపాలు ఏమిటంటే... విలువలు లేని రాజకీయాలు, కష్టం లేని సంపాదన, సంతోషం లేని వివేకం, జ్ఞానం లేని వ్యక్తిత్వం, నీతి లేని వ్యాపారం, మానవత్వం లేని విజ్ఞానము, త్యాగము లేని ఆరాధన. పొగిడితే మందహాసం చేసి, తిడితే మౌనం వహించేవాడు ఉత్తముడు"

"మానవత్వం పై నమ్మకాన్ని ఎప్పుడూ కోల్పోకూడదు. మానవత్వం అన్నది మహా సముద్రం. కొన్ని చుక్కలు మలినంగా ఉన్నంత మాత్రాన సముద్రం మొత్తం మలినపడిపోదు. నిజాయితీగా అసమ్మతి ఒప్పుకోవడం తమ పురోగతికి ఒక మంచి సంకేతం. సాధ్యమనుకుంటే ఎంతటి పనైనా సులువుగా పూర్తవుతుంది"

- మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ

## శ్రమయేవ జయతే

ఓసారి లాలాజీ (లాలా లజపత్ రాయ్), మహాత్మా గాంధీ ఇద్దరు గొప్ప జాతీయవాది అయిన శివప్రసాద్ గుప్తా ఇంట్లో కొన్నిరోజులు అతిథులుగా ఆతిథ్యంలో అది మొదటి రోజు. లాలా లాజ్‌పత్ రాయ్ స్నానం చేసిన తర్వాత కొత్త బట్టలు వేసుకుని, తన పాత బట్టలను బాత్రూమ్‌లో వదిలి పెట్టాడు. మరుసటి రోజు ఉదయం మంచం మీద తన బట్టలు శుభ్రంగా ఉతికి, చక్కగా మడతపెట్టి ఉండటాన్ని గమనించాడు. ఆయనకు సంతోషం వేసింది. అతని వద్ద ఇంకా చాలా మురికి బట్టలు ఉన్నాయి. గుప్తాను మర్యాదగా ఓ చిన్నమాట అడిగాడు. నా వద్ద ఉన్న మురికి బట్టలన్నింటిని ఉతికించగలరా? అని. ఇదేం భాగ్యం.. తప్పకుండా మీకు సహాయం చేసిపెడతాను అని గుప్తా మాటిచ్చారు. చెప్పినట్లే లాలాజీ బట్టలన్నీ శుభ్రంచేసి రెడీగా ఉంచారు. ఇక అక్కడి నుంచి బయలుదేరే సమయంలో లాలాజీ గుప్తాను పిలిచారు. మీ పని మనిషిని పిలిపించండి.. నా బట్టలు ఉతికినందుకు వారికి టిప్ ఇవ్వాలని అన్నారు. సరేనంటూ లోపలికివెళ్లిన గుప్తా తన పనివాళ్లను పిలిచి ఆరా తీశారు. లాలాజీ బట్టలు తాము ఉతకలేదని, ఆయనతోపాటు వచ్చిన మరో అతిథి ఇదంతా చేశారని వారు వివరణ ఇచ్చారు. నివ్వెరపోయిన గుప్తా, మరో అతిథి కోసం వెతుకుతుండగా, పెరట్లో బట్టలు ఆరవేస్తున్న గాంధీని చూసి నిశ్చేష్టుడయ్యారు. బాపూజీ శ్రమ, గౌరవాన్ని నమ్ముతారనడానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుంది

## గాంధీజీకి కుర్తా

ఒక సమావేశంలో ఒక చిన్న పిల్లవాడు గాంధీజీని సమీపించాడు. గాంధీజీ వేషధారణ చూసి నొచ్చుకున్నాడు. ఇంత గొప్ప వ్యక్తికి చొక్కా లేకపోవడం ఏమిటి అనుకున్నాడు. అనుకున్నదే తడవుగా, మీరు కుర్తా ఎందుకు ధరించరు? అని గాంధీజీని ప్రశ్నించాడు. కుర్తాకు నా వద్ద డబ్బులు ఎక్కడివి? నేను చాలా పేదవాడిని నాకు కుర్తా కుట్టించుకునే శక్తిలేదని బదులిచ్చాడు. దానికి బాలుడి హృదయం కరిగింది. మా అమ్మ బట్టలు కుడుతుంది. ఆమెకు చెప్పి మీ కోసం కుర్తా కుట్టమంటాను అని అన్నాడు. అలా అయితే, మీ తల్లి ఎన్ని కుర్తాలు కుట్టగలదు? అని గాంధీజీ అడిగారు. మీకెన్ని కావాలంటే అన్ని కుట్టిస్తుందని బాలుడు ధీమాగా పలికాడు. ఒకటి రెండు మూడు . . . అంటూ గాంధీజీ ఒక్క క్షణం గొణుగుతూ , నేను ఒంటరిని కాదు.. నాకు చాలా పెద్ద కుటుంబం ఉంది. వారందరికీ కుర్తాలు కావాలి. నాకు నలభై కోట్ల మంది సోదరులు ఉన్నారు అని గాంధీజీ వివరించారు. వారందరు కుర్తా ధరిస్తేనే నేనూ కుర్తా వేసుకుంటాను. మరి మీ అమ్మగారు అన్ని కుర్తాలు కుట్టివ్వగలదా? అని గాంధీ ప్రశ్నించాడు.

## ఆఖరి రోజు.. ఏం జరిగిందంటే?

1948, జనవరి 30, శుక్రవారం. రోజూలాగానే ఆరోజు మొదలయ్యింది. గాంధీ తెల్లవారుఝామున మూడున్నరకే లేచారు. ప్రార్థన చేసుకుని, ఓ రెండు గంటలు కాంగ్రెస్ కొత్త బాధ్యతలు, విధానాల మీద దృష్టిపెట్టి, మిగతావారు లేచేలోపు, ఆరు గంటలకి మళ్ళీ నిద్రకు ఉపక్రమించారు. ఎనిమిది గంటలకు లేచారు. ఎప్పటిలాగే ఆయనకి నూనెతో మాలిష్ జరిగింది. స్నానం చేశాక మేక పాలు, ఉడికిన కూరగాయలు, ముల్లంగి, నారింజ రసం సేవించారు. అదే సమయానికి, ఢిల్లీ నగరంలో మరో మూల, ఓల్డ్ దిల్లీ రైల్వే స్టేషన్ వెయిటింగ్ రూమ్‌లో నాథూరాం గాడ్సే, నారాయణ్ ఆప్టే, విష్ణు కర్కరే ఇంకా నిద్రపోతూనే ఉన్నారు.

ఇక్కడ, గాంధీ ఉపాహారం తరువాత, తనని కలవడానికి సపరివారంగా వచ్చిన పాత స్నేహితుడు రుస్తమ్ సోరాబజీతో కాసేపు సంభాషించారు. తరువాత ఢిల్లీలోని ముస్లిం లీడర్లను కలిసి మీ సమ్మతి లేకుండా వార్ధా వెళ్ళలేను అని చెప్పారు. తరువాత, గాంధీ సన్నిహితులు అయిన సుధీర్ ఘోష్, ప్యారేలాల్ కలిసి లండన్ టైమ్స్‌లో వచ్చిన వార్త 'నెహ్రూ, పటేల్ మధ్యన అభిప్రాయబేధాలపై స్పందించమని కోరారు. ఆరోజు సాయంకాలం వారిద్దరి ముందూ ఈ విషయాన్ని ప్రస్తావిస్తానని గాంధీ అన్నారు. అక్కడ, బిర్లా హౌస్‌కి బయలుదేరేముందు గాడ్సేకి వేరుసెనగలు తినాలనే కోరిక కలిగింది. అతని మిత్రుడు ఆప్టే వాటిని ఎలాగోలా సంపాదించి మిత్రునికి ఇచ్చాడు. అవి తిన్నాక తృప్తిగా బయలుదేరారు.

సాయంత్రం నాలుగు గంటలకి వల్లభాయ్ పటేల్ తన కూతురు మనుబెన్‌తో సహా గాంధీని కలిశారు. 5 గంటలు దాటే వరకూ ముచ్చటించారు. అదే సాయంత్రం నాలుగుంపావుకి గాడ్సే, అతని మిత్రులు టాంగా ఎక్కి కనాట్ ప్లేస్‌కి వెళ్ళారు. అక్కడినుంచి ఇంకో టాంగా తీసుకుని బిర్లా హౌస్‌కి బయలుదేరారు. హౌస్‌కి ముందు రెండు వందల గజాల దూరంలోనే టాంగా ఆపించి కిందకు దిగారు. ఇక్కడ గాంధీ.. పటేల్‌తో మాట్లాడుతూనే, ఆభా తీసుకొచ్చిన సాయంత్రం భోజనం చేయసాగారు. ప్రార్థనా సభకి ఆలస్యంగా వెళ్ళడం గాంధీకి ఇష్టం ఉండదు. ఈ విషయం గురించి ఆభా ఆందోళన చెందసాగింది. కానీ పటేల్‌కు ఈ విషయం గుర్తు చేసే ధైర్యం ఆమెకి లేదు. చివరికి హాల్‌లో ఉన్న జేబు గడియారం తీసి టైము చూపించేప్రయత్నం చేశారు. అది గమనించిన మనుబెన్ గాంధీకి చెప్పగా ఆయన ప్రార్థనా సభకి 5.10 ని. బయలుదేరారు.

అలా వెళుతుండగానే.. తన సహాయకులైన ఆభా, మనులతో కలిసి నడుస్తూ, వారితో సరదాగా ముచ్చటిస్తూ ప్రార్థనా సభకు చేరుకున్నారు. అక్కడ ప్రజలకు అభివాదం చేశారు. ఎడమవైపు నుండి నాథూరామ్ గాడ్సే, గాంధీగారి వైపుకి వంగడం చూసి, ఆయన పాదాలకు నమస్కరించబోతున్నాడని మను భావించింది. అసలే ఆలస్యమై పోయిందనుకుంటే ఇలా మధ్యలో వచ్చి ఇంకా జాగు చేస్తున్నాడని ఆభా కాస్త చిరాకు పడ్డారు. గాడ్సే విసురుగా మనుని తోసుకుంటూ ముందుకి వచ్చాడు. మను చేతిలో ఉన్న మాల, పుస్తకం రెండూ కిందపడిపోయాయి. అవి తీసుకోవడానికి ఆమె కిందకు వంగారు. అదే సమయంలో గాడ్సే తుపాకీ తీసి ఒకదాని వెనుక ఒకటి.. మూడు గుళ్ళు.. గాంధీ ఛాతీమీద, పొట్టలోకి దిగేట్టు పేల్చాడు. ఆయన నోటి నుండి ''రామ్....రా...మ్'' అనే శబ్దాలు వెలువడ్డాయి. మరుక్షణం ఆయన శరీరం నేలకొరిగింది.



గాంధీజీకి మాటిద్దాం!



మహాత్మా గాంధీ 150వ జయంతి ముగింపు ఉత్సవాలు

# ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం!!

- పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో ముందడుగు
- ఒకసారి వాడిపారేసే ప్లాస్టిక్‌కు నేటితో స్వస్తి
- ప్రపంచానికి ఆదర్శంగా భారత్
- మోడీ పిలుపుతో బాపూ ఆశయ సాధన దిశగా వడివడిగా అడుగులు

**న్యూఢిల్లీ:** ఒకప్పుడు ప్లాస్టిక్ వస్తువులంటే మోజు. ఆకర్షణీయంగా, పారదర్శకంగా ఉండటంతోపాటు, ఖరీదు తక్కువ కావడంతో వీటికి అనతికాలంలోనే విశేష ఆదరణ లభించింది. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత లోహాలకు కొరత ఏర్పడింది. రాగి, వెండి, ఇత్తడి లోహాలు ఖరీదైనవిగా మారాయి. దీంతో పత్యామ్నాయ వస్తువుగా ప్లాస్టిక్ అవతరించింది. బ్రిటన్, అమెరికా వంటి పాశ్చాత్య దేశాల్లో మొదట ప్లాస్టిక్ వాడకం మొదలైంది. క్రమంగా ఇది ఇతరదేశాలకూ విస్తరించింది. రాన్రాను ఇదొక ఫ్యాషన్ వస్తువైంది. చేసంచి నుంచి భోజనం చేయడానికి వాడే కంచం దాకా అంతా ప్లాస్టిక్ మయమైంది. ప్యాకేజింగ్‌కు వాడే రేపర్ల నుంచి షీట్లు, వాటర్ బాటిళ్లు, స్ట్రాలు, చెంచాలు, ప్లేట్లు, కప్పులు, గ్లాసులు.. ఇలా ఆధునిక జీవనంతో ప్లాస్టిక్ బంధం పెనవేసుకుంది. అయితే, ఈ ప్లాస్టిక్ ప్రాణాంతకం అవుతోందని, మొత్తం పర్యావరణాన్ని విషతుల్యం చేస్తోందన్న శాస్త్రవేత్తల హెచ్చరికలతో అంతర్జాతీయ సమాజం ఉలిక్కిపడింది. చివరకు మనం పీల్చే గాలిలోనూ మైక్రోప్లాస్టిక్ రేణువులు ఉన్నాయని ఇటీవలి పరిశోధనల్లో తేలింది. నింగీ..నేలా..నీరు అనే తేడా లేకుండా అన్నిచోట్లా టన్నులకొద్దీ పోగుబడి మనిషి మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్నది. ఈ ప్రమాదాన్ని అధిగమించేందుకు ప్లాస్టిక్ నిషేధం దిశగా ఇప్పుడిప్పుడే ప్రపంచం అడుగులేస్తోంది. ఈ నేపథ్యంలో భారతదేశం కూడా ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు సిద్ధమైంది. తొలుత అత్యంత ప్రమాదకరమైన ఒకసారి వాడి పారేసే వస్తువుల బహిష్కరణకు నరేంద్ర మోడీ ప్రభుత్వం పిలుపునిచ్చింది. ఈ బృహత్తర లక్ష్యసాధనకు జాతిపిత గాంధీజీ 150వ జయంతిని ముహూర్తంగా ఎంచుకుంది. ఈ దిశగా కలసిరావాలని యావత్ ప్రపంచానికి ఐరాస వేదికగా మోడీ విజ్ఞప్తి చేశారు.

## పకడ్బందీ కార్యాచరణేదీ?

యూఎన్ఈపీ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 60 దేశాల్లో ప్లాస్టిక్ ఉత్పత్తి, వినియోగంపై నిషేధం లేదా భారీ పన్నులు ఉన్నాయి. కానీ, వాటిపై నిఘా సమగ్రంగా లేదు. అందువల్ల ఈ ప్రయత్నం పూర్తిస్థాయిలో విజయవంతం కాలేదని అనుభవాలు చెబుతున్నాయి. ఈ కార్యాచరణ ఫలితంగా కేవలం 30శాతం మేరకు మాత్రమే ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించగలిగారు. ప్లాస్టిక్‌ను బహిష్కరించడంతోపాటు ప్లాస్టిక్ రీసైక్లింగ్‌కు పకడ్బందీ విధానాలుంటే పరిస్థితి కొంత మెరుగ్గా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. సాధారణంగా ప్లాస్టిక్‌ను పదేపదే రీసైక్లింగ్ చేయడం సాధ్యం కాదు. అరడజను సార్లకంటే ఎక్కువ రీసైక్లింగ్ చేస్తే, అది స్వచ్ఛతను, మన్నికను కోల్పోతుంది.

- భారతదేశంలో సగటున ఏటా వినియోగిస్తున్న ప్లాస్టిక్ 1650 కోట్ల కిలోలు. ఇది సుమారు 16 లక్షల ట్రక్కులకు సమానం.
- భారతదేశంలో నిత్యం ఉత్పత్తి అవుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు 26,000 టన్నులు. అందులో 10 వేల టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలు వాతావరణం లోనే ఉండిపోతున్నది.
- ప్లాస్టిక్ కాలుష్యం అత్యధికంగా ఉన్న దేశాల జాబితాలో భారత్ 15వ స్థానంలో ఉంది. ఇప్పుడు మనం వాడుతున్న ప్లాస్టిక్‌లో 50శాతం 2000 సంవత్సరం తర్వాత ఉత్పత్తి అయినదే.
- ప్రతి ఐదు నిముషాలకు ప్రపంచ వ్యాప్తంగా 50 లక్షల ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ అమ్ముడవుతున్నాయి. ఏటా ప్రపంచవ్యాప్తంగా సముద్రాల్లో కలుస్తున్న ప్లాస్టిక్ 80 లక్షల టన్నులు

## ఫీనిక్స్‌లో బాపూ స్వచ్ఛతా హీ సేవ

ఇండియాలో పారిశుధ్యం సమస్యను మహాత్మాగాంధీ స్వాతంత్ర్య పోరాటానికి ముందే గ్రహించారు. గ్రామీణ భారతంలో పరిశుభ్రతకు మూలమైన మరుగుదొడ్లు సరిపడాలేవని గుర్తించారు.'' మురికి అలవాట్ల నుండి మనల్ని మనం వదిలించుకుని, మెరుగైన మరుగుదొడ్లు కలిగి ఉండకపోతే, స్వాతంత్రం విలువ మనకు తెలిసిరాదని చెప్పేవారు.

స్వాతంత్ర్య పోరాటం కంటే కూడా పారిశుద్ధ్యం, అంటరానితనం నిర్మూలన అత్యవసరమని పలు సందర్భాల్లో పేర్కొన్నారు. దక్షిణాఫ్రికాలో పారిశుధ్యం, పరిశుభ్రతతోపాటు సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణ కోసం నిరంతర పోరాటానికి నాయకత్వం వహించారు. పరిశుభ్రత పక్కనే దైవభక్తి ఉంటుందని తన 'గైడ్ టు లండన్' లో పేర్కొన్నారు. తన మొదటి 'ఆశ్రమం' ఫీనిక్స్ సెటిల్‌మెంట్‌లో దీనిని ఆచరించి చూపారు. నేలంతా శుభ్రంగా ఉండాలని చెప్పేవారు. చుట్టుపక్కల ప్రాంతాలన్నీ శుభ్రంగా ఉండాలని కోరుకున్నాడు. ఆశ్రమం, టాల్‌స్టాయ్ ఫామ్, అన్ని పారిశుధ్య పనులను ఖైదీలే నిర్వహించేవారు. చెత్తను కందకాలలో పాతిపెట్టేవారు. వ్యర్థ జలాలను చెట్లకు నీరు పెట్టడానికి ఉపయోగించారు. మిగిలిపోయిన ఆహారాన్ని, కూరగాయల వ్యర్థాలను ఎరువుగా వాడేవారు.



## ప్లాస్టిక్ వ్యర్థాలతో భారీ చరఖా

ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేసిన గాంధీ చరఖా (రాట్నం)ను నోయిడాలో మంగళవారం ఆవిష్కరించారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ప్లాస్టిక్ తయారీ విగ్రహం. శాటిలైట్ సిటీ సెక్టార్ 94లో ఈ రాట్నాన్ని ఆవిష్కరించారు. 1,650 కిలోల బరువు, 14 అడుగుల ఎత్తు, 20 అడుగుల విస్తీర్ణం, ఎనిమిది అడుగుల వెడల్పును కలిగివుంది. ఇందుకోసం 1,250 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను వాడారు. ప్లాస్టిక్ డిస్పోజల్‌పై ప్రజల్లో చైతన్యం తెచ్చే ప్రయత్నంలో భాగంగా దీన్ని ఏర్పాటు చేసినట్లు నోయిడా అథారిటీ సీఈఓ రీతూ శర్మ తెలిపారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అంటే?

ఒకసారి వాడిపారేసే ప్లాస్టిక్ వస్తువులు అనగానే చాలా ఉత్పత్తులు గుర్తుకొస్తాయి. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ అనే పదానికి శాస్త్రీయ నిర్వచనం అంటూ లేదు. ప్రస్తుతానికి తక్కువ మైక్రాన్ల వస్తువులను ఈ పరిధిలోకి తీసుకొచ్చారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కిందకు వచ్చే వస్తువులను నిర్వచించేందుకు కేంద్ర పర్యావరణ శాఖ ఆధ్వర్యంలోని కమిటీ కార్యాచరణ ప్రారంభించింది. అక్టోబరు చివరినాటికి కమిటీ దీనిపై స్పష్టత ఇస్తుంది. సాధారణ పరిభాషలో చెప్పాలంటే, కొద్ది గంటల జీవితకాలం కలిగిన, లేదా ఒక్కసారి మాత్రమే ఉపయోగించ దగిన వస్తువు అన్నమాట. ఇలా వాడేసి అలా పారేసే ఈ ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో ఇట్టే కరిగిపోవు. వందల ఏళ్లు ఉండి పోతాయి. దీనివల్ల ప్లాస్టిక్ వ్యర్థాల రూపంలో పర్యావరణంలో కలుస్తుంటాయి. ఇక నీటి ద్వారా నదులు, సముద్రాల్లో పేరుకుపోయి, జలచరాల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. గాలిలో కలిసే ప్లాస్టిక్ రేణువులు ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు కారణం అవుతున్నాయి.





## ఎంసీహెచ్‌ఆర్డీలో.. మహాత్ముడి జయంతి వేడుకలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో మహాత్ముడి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు, సంస్థ డైరెక్టర్ బీపీ ఆచార్యలు పాల్గొన్నారు. 22 రాష్ట్రాలకు చెందిన పలువురు ట్రైనీ సివిల్ సర్వెంట్లు, ఆల్ ఇండియా సర్వీసుల అధికారులు, కేంద్ర సివిల్ సర్వీసులకు చెందిన ట్రైనీ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ శిల్పి, చిత్రకారుడు సీహెచ్ మనోహర్ రూపొందించిన మహాత్ముడి ప్రతిమను మంత్రి హరీష్‌రావుకు బహూకరించారు.

## పర్యావరణ హిత... మన జాతిపిత

గాంధీజీ అహింసా వాది మాత్రమే కాదు. ఆయనొక గొప్ప ప్రకృతి ఆరాధ్యుడు కూడా. తన చుట్టూ ఉండే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని అనుకుంటారు. అదేవిధంగా పర్యావరణహిత విధానం ఆయన జీవనశైలిలో స్పష్టంగా కనిపిస్తుంది. జీవావరణ శాస్త్రపు ఆలోచనలు మహాత్ముడి నడవడికలో, అలవాట్లలో అంతర్భాగమై ఉండేవి. ఈ విషయాన్ని ప్రపంచ ప్రసిద్ధ తత్వవేత్తలు, పర్యావరణ నిపుణులు దగ్గరగా గమనించి, మరీ బాహ్య ప్రపంచానికి బాపూ గొప్పదనాన్ని చాటారు. గాంధీజీ రచనలలో ఎక్కడా పర్యావరణం (ఎకాలజీ) అనే పదం కనిపించకపోవచ్చు. ఏ వేదికలపైనా పర్యావరణ పరిరక్షణ గురించి ఆయన మాట్లాడి ఉండకపోవచ్చు. కానీ, పర్యావరణ పరిరక్షణలో మేటి ఉద్యమాలైన చిప్కో, నర్మదా బచావ్ వంటి ఆందోళనల్లో బాపూ ఆలోచనలు కనిపిస్తాయి. జర్మన్‌గ్రీన్స్ తన మేనిఫెస్టోలో చూపించినట్లుగా, పర్యావరణంపై గాంధీజీ ఆలోచనల ప్రభావం విస్తృతం. జీవావరణ శాస్త్రంలో ఆరితేరిన నార్వేజియన్ తత్వవేత్త ఆర్నే నాస్ ఓ మాట చెప్పారు. అన్ని జీవితాలకు ముఖ్యమైన ఏకత్వాన్ని గాంధీజీలో తాను దర్శించానని వినమ్రంగా చెప్పుకున్నారు.

వి.ఎస్. నైపాల్ మరో అడుగు ముందుకేసి, గాంధీజీని నార్సిసిజం అని సంబోధించాడు. అదేవిధంగా, భారతదేశంలో వన్యప్రాణులు వేగంగా అదృశ్యం కావడం గురించి ఆంగ్ల చరిత్రకారుడు ఎడ్వర్డ్ థాంప్సన్ మహాత్ముడి సమక్షంలో ఒకసారి ఆందోళనను వ్యక్తం చేశారు. దీనికి బాపూజీ వ్యంగ్యంగా జవాబిచ్చారు. అడవులలో వన్యప్రాణులు తగ్గుతున్నాయి, కానీ పట్టణాల్లో పెరుగుతున్నాయ్ అని వ్యాఖ్యానించారు. ఆధునిక పారిశ్రామిక నాగరికత వెనుక ఉన్న దుష్పరిణామాల గురించి గాంధీజీ అప్పట్లోనే ప్రపంచాన్ని జాగృత చేశారు. యూరోపియన్ వలసరాజ్యంలో స్థానికులు భూమిని సద్వినియోగం చేసుకోవడం లేదని, తగినంత ఉత్పాదకతను సాధించడం లేదని విమర్శించారు. అదే సమయంలో మానవులు తాము తాకినవన్నీ వ్యర్థాలుగా మార్చే అవకాశం ఉందని కూడా గాంధీజీ అప్రమత్తం చేశారు. తన సహచరుడు కాకా కలేల్కర్ కేవలం నాలుగు వేప ఆకుల కోసం మొత్తం కొమ్మలను విరిచివేయడాన్ని చూసి కోపగించుకున్నారు. నీ చర్య హింసాత్మకం. చెట్టుకు క్షమాపణ చెప్పిన తరువాత నీకు అవసరమైన ఆకులు తీసుకో. కొమ్మలను విరిచేయడం పెద్ద తప్పు అని మందలించారు.

### ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం

అందరికీ తెలిసినట్లుగా గాంధీజీ ఒక శాఖాహారి. మాంసంపరిశ్రమ భూమి, నీటి వనరులపై తీవ్ర ఒత్తిడి తెస్తుందన్న ఆధునిక పరిశోధనలను గాంధీ స్వాగతించారు. భారతదేశం వంటి దేశాలలో ప్రజలు మధ్యతరగతిలోకి ప్రవేశిస్తున్న సమయంలో మాంసం వినియోగం అధికంగా ఉంటుందని తెలిపాడు. పర్యావరణ హితంగా ఉండడం అంటే ఇతరుల పట్ల విశాల హృదయంతో ఉండటమని, ప్రపంచంలో ఉండేందుకు ఇదే మార్గమని సూచించారు. శాకాహార భోజనం మాత్రమే తయారుచేసే అతని ఆశ్రమానికి యూరోపియన్ సందర్శకులు వచ్చారు. వారి కోరికమేరకు వారికి మాంసం వడ్డించారు. మాంసం అలవాటున్న వ్యక్తికి ప్రత్యామ్నాయ ఆహారం ఇవ్వడాన్ని హింసగానే గాంధీ భావించేవారు.గాలి, నేల, నీటిని పరిరక్షించడానికి శక్తివంతంగా పనిచేసిన, రీసైకిల్ కాగితం లేదా జంతువుల సంరక్షణకు ప్రాధాన్యమిచ్చేవారిని గౌరవనీయులైన మానవులుగా గాంధీ అభివర్ణించారు.



## భాజపాకు 164.. శివసేనకు 124

**ముంబై:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ఈనెల 21న ఎన్నికలు జరగనుండగా.. మరోసారి అధికారం కోసం బీజేపీ తన వ్యూహాలకు పదును పెంచింది. అధికారమే లక్ష్యంగా శివసేన, ఇతర చిన్న పార్టీలతో జతకట్టిన బీజేపీ.. ఈ సారి శివసేనకు ఏకంగా 124 అసెంబ్లీ స్థానాలను కేటాయించింది. మొత్తం 288 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ, చిన్నచిన్న భాగస్వామ్య పార్టీలు 164 స్థానాల్లో పోటీ చేస్తుండగా శివసేన 124 స్థానాల్లో బరిలోకి దిగుతోంది. బీజేపీ ఇప్పటికే 125 మంది అభ్యర్థులతో తొలిజాబితా విడుదల చేయగా.. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వాయువ్య నాగపూర్ అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికల బరిలోకి దిగుతుండగా..బీజేపీ మహారాష్ట్ర చీఫ్ చంద్రకాంత్ పాటిల్ పూణెలోని కొథ్రుడ్ అసెంబ్లీ స్థానం పోటీ చేస్తు న్నారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా ఇటీవల శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేతో జరిపిన చర్చలు సఫలమవడంతో రెండు పార్టీలు కలిసి ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు ఫడ్నవీస్ ప్రకటించి.. రెండు పార్టీల మధ్య సీట్ల కేటాయింపును వివరించారు. బీజేపీతో జతకట్టిన చిన్నపార్టీల్లో రిపబ్లికన్ పార్టీ (ఏ), ది రాష్ట్రీయ సమాజ్ పక్ష్, ది శివ సంఘం సంఘటన, ది రాయత్ క్రాంతి సేన ఉన్నాయి. 2014 ఎన్నికల్లో ఈ పార్టీలన్నీ వేర్వేరుగా ఎన్నికల బరిలోకి దిగగా.. బీజేపీ 122 స్థానాలు, శివసేన 63 స్థానాల్లో విజయం సాధించాయి. బీజేపీ, శివసేన సమాన స్థానాల్లో ఎన్నికల్లో పోటీ చేస్తాయని పార్లమెంట్ ఎన్నికలసమయంలో ప్రచారం జరిగినా ఇటీవల రెండు పార్టీల నాయకుల మధ్య చర్చలతో బీజేపీ- శివసేన కంటే కొన్ని ఎక్కువ స్థానాల్లోనే పోటీ చేయనుందని వెల్లడైంది.బీజేపీ ప్రకటించిన తొలి జాబితాలో ముగ్గురు మంత్రుల పేర్లు గల్లంతయ్యాయి. తొలి జాబితాలో 12 మంది మహిళా నేతలు, ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు చోటు దక్కగా..12 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు లభించలేదు. కోథ్రూడ్ ఎమ్మెల్యే ప్రస్తుత మంత్రి మేధా కులకర్ణి ఎన్నికల్లో పోటీకి నిరాకరించారు. తన స్థానాన్ని బీజేపీ మహారాష్ట్ర చీఫ్ చంద్రకాంత్ పాటిల్ కోసం త్యాగం చేశారు. ప్రస్తుత పాఠశాల విద్యా శాఖ మంత్రి వినోద్ తావ్డే స్థానంలో ఎవరు పోటీ చేస్తున్నారో తొలి జాబితాలో వెల్లడించలేదు.

## చైనాను ఏ శక్తీ అడ్డుకోలేదు



**బీజింగ్:** ప్రపంచంలో ఏ శక్తీ చైనా అభివృద్ధిని అడ్డుకోలేదని ఆ దేశ అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. కమ్యూనిస్టు పార్టీ అధికారాన్ని చేపట్టిన 70 సంవత్సరాలైన సందర్భంగా నిర్వహించిన భారీ కవాతులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారీస్థాయిలో నిర్వహించిన కవాతులో జిన్‌పింగ్ మాట్లాడుతూ చైనాను ఏ శక్తీ కదిలించలేదని, చైనా ప్రజలను, తమ దేశాన్ని ముందుకుసాగకుండా ఆపలేరన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద సైన్యంగా పేరుగాంచిన రెండు మిలియన్ల చైనా ఆర్మీ తమ దీర్ఘశ్రేణి ఇంటర్ కాంటినెంటల్ బాలిస్టిక్ క్షిపణులు (ఐసీబీఎం)లతోపాటు పలు అత్యంత అధునాతన ఆయుధాలను ప్రదర్శించింది.

చైనా అధ్యక్ష పదవితోపాటు ఆర్మీకి నాయకత్వం వహిస్తున్న జిన్‌పింగ్ (66) కమ్యూనిస్ట్‌పార్టీ ఆఫ్ చైనా (సీపీపీ) వ్యవస్థాపకుడు మావో జెడాంగ్‌ను అత్యంత శక్తిమంతమైన నాయకుడిగా పేర్కొన్నారు. పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా (పీఆర్‌సీ) సీపీసీ నాయకత్వం చైనాను పూర్తిగా మార్చివేసిందన్నారు. సీపీసీని సమర్థించాలని జిన్‌పింగ్ ఈ సందర్భంగా చైనా ప్రజలకు పిలుపునిచ్చారు. 70 సంవత్సరాల క్రితం ఇదే రోజున కామ్రేడ్ మావో జెడాంగ్ పీఆర్‌సీని స్థాపించి ప్రపంచానికి చైనా ప్రజల గొప్పదనం గురించి తెలిపారన్నారు. చైనా పెరుగుదలపై ప్రపంచ ఆందోళనలను తొలగిస్తూ శాంతియుత అభివృద్ధి మార్గంలో చైనా కొనసాగుతుందని జిన్‌పింగ్ హామీ ఇచ్చారు.

# పౌరసత్వ చట్టం తీసుకొస్తాం

- వచ్చే పార్లమెంటు సమావేశాల్లో పౌరసత్వ సవరణ బిల్లు
- దేశ భద్రత, చొరబాట్ల ఏరివేతకేనని అమిత్ షా ప్రకటన



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** దేశమంతా ఎన్ఆర్సీ (జాతీయ పౌర జాబితా) నిర్వహించేందుకు బీజేపీ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే అసోంలో ఎన్ఆర్సీ చేపట్టిన ప్రభుత్వం దీన్ని దేశమంతటా నిర్వహించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈ మేరకు సంకేతాలు ఇచ్చారు. దేశంలోని చొరబాటుదారులను ఏరివేసేందుకు ఎన్ఆర్సీ చేపడతానని ప్రకటించారు. ఈ మేరకు సిటిజన్షిప్ సవరణ బిల్లు వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. చొరబాటుదారుల నుంచి దేశాన్ని రక్షించి,స్వదేశీలకు రక్షణ కల్పించేందుకు ఈ సిటిజన్షిప్ బిల్లు తీసుకువస్తున్నట్లు బీజేపీ నేతలు చెబుతున్నారు. చొరబాటుదారులు ఆపేందుకు ఈ బిల్లు తప్పనిసరి అని అంటున్నారు. ఈ బిల్లు ఏ మతానికి, సంస్కృతికి, భాషకు, వారసత్వానికి వ్యతిరేకం కాదని స్పష్టం చేస్తున్నారు. ఎన్ఆర్సీపైన లేనిపోని అపోహలు సృష్టించడం మంచిది కాదని అంటున్నారు. ఎంఆర్సీ -ఈ ద్వారా పౌరులందరికీ సిటిజన్షిప్ కార్డు అందజేస్తారని చెబుతున్నారు. దానివల్ల చొరబాటుదారులు ఎవరు దేశంలో ఉండకుండా నిరోధించే వీలు పడుతుందన్నారు.

దేశంలో ఎవరు వ్యతిరేకించినప్పటికీ నేషనల్ సిటిజన్షిప్ రిజిస్ట్రేషన్ నిర్వహించి తీరుతామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటిస్తున్నారు. దేశంలో అక్రమంగా నివసిస్తున్న వారిని గుర్తించేందుకు సిటిజన్షిప్ రిజిస్ట్రీ తీసుకొస్తామన్నారు. 2019 లోక్సభ ఎన్నికల్లో ప్రజలంతా తమ విధానానికి ఓటు వేశారని చెప్పారు. పశ్చిమ బెంగాల్లో మమతాబెనర్జీ దీన్ని వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రజలంతా ఎన్ఆర్సీకి మద్దతు ఇస్తున్నారని షా ప్రకటించారు.

ప్రధానంగా బంగ్లాదేశ్ సరిహద్దు నుంచి అనేకమంది భారత్లోకి చొరబాటు ఉన్న నేపథ్యంలో బీజేపీ ఈ అంశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇప్పటికే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అసోం రాష్ట్రంలో జాతీయ పౌర జాబితాను రూపొందించారు. ఇందులో కొద్ది మందికి చోటు దక్కకపోవడంపై పెద్ద ఎత్తున రాజకీయ దుమారం రేగింది. ఉద్దేశపూర్వకంగానే కొద్దిమంది ఒక మతాన్ని టార్గెట్గా చేసుకొని జాబితాను రూపొందిస్తున్నారని కాంగ్రెస్ సహా పలు విపక్షాలు బీజేపీపై దుమ్మెత్తిపోశారు. రాజకీయంగా బీజేపీ చొరబాట్లను నివారించేందుకు తాము ఈ విధానాన్ని తీసుకుంటున్నామని స్పష్టంగా ప్రకటించింది. అసోంలో నిర్వహించిన ఎన్ఆర్సీ తరహాలో ని దేశమంతా జాతీయ పౌర జాబితాను రూపొందించాలని నిర్ణయించింది.

# కాశ్మీర్ విభజన ఆపలేం

**న్యూఢిల్లీ:** జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి తొలగిస్తూ ఆర్టికల్ 370 రద్దు విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగబద్ధం కాదంటూ దాఖలైన పిటిషన్లపై విచారణలో సుప్రీంకోర్టు కీలకనిర్ణయం తీసుకుంది. నవంబర్ 14 నుంచి వాదనలు కొనసాగుతాయని ప్రకటించింది. ఈలోగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి నాలుగు వారాల గడువిచ్చింది. ప్రభుత్వ వివరణకు పిటిషనర్లూ వారంలోగా సమాధానమివ్వాలి. ఆ తర్వాత నవంబర్ 14 నుంచి వాదనలు వినాలని జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం మంగళవారం నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటికే దాఖలైన పిటిషన్లపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. పిటిషన్లపై విచారణ చేపట్టబోమని స్పష్టం చేసింది. కౌంటర్ దాఖలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం, జమ్ముకాశ్మీర్ పాలనాయంత్రాంగాలకు అనుమతిచ్చాం. కౌంటర్ దాఖలు చేయనిదే ఈ విషయంలో మేము ఎలాంటి నిర్ణయం తీసుకోలేమని ఐదుగురు సభ్యుల ధర్మాసనం స్పష్టం చేసింది. ఇదిలావుండగా ఆర్టికల్ 370 రద్దుపై దాఖలైన అన్నీ పిటిషన్లనూ విచారించేందుకు జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల ధర్మాసనాన్ని సీజే రంజన్ గొగోయ్ ఆదివారం ఏర్పాటు చేశారు. పిటిషన్లన్నీ బెంచ్‌కు బదిలీ చేశారు. ఈ పిటిషన్లపై మంగళవారం విచారణ ప్రారంభమైన నేపథ్యంలో బెంచ్ ఈ నిర్ణయం తీసుకుంది. పిటిషనర్లలో కాశ్మీర్ టైమ్స్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అనురాధా భాసిన్, సీపీఐ జనరల్ సెక్రటరీ సీతారాం ఏచూరీ, గులాంనబీ ఆజాద్, మాజీ ఐఏఎస్ షాఫైజల్, ఉద్యమకారిణి షీహ్లారషీద్, అడ్వొకేట్ షాకీర్ షాబీర్, ఎంఎల్ శర్మా, వినీత్ ధండాతోపాటు ఇతరులు ఉన్నారు. 370 రద్దు నిర్ణయంలో ప్రభుత్వం నిర్ణయాన్ని సవాలు చేయడంతోపాటు జమ్ముకాశ్మీర్‌లో ఆంక్షలు, అక్కడ పర్యటించడంపై నిషేధాలను సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలు చేశారు.

### ఆంక్షలు సడలించాం: జమ్మూ ప్రభుత్వం

జమ్ముకాశ్మీర్‌లో ఆంక్షలు సడలించామని, ల్యాండ్‌లైన్ ఫోన్ల సేవలు వందశాతం పనిచేస్తున్నాయని సుప్రీంకోర్ట్‌కు జమ్ముకాశ్మీర్ పాలనా యంత్రాంగ తెలిపింది. ఆంక్షలను తొలగించాం. అన్నీ పోలీస్ స్టేషన్ల పరిధిలో సీఆర్‌పీసీ 144 సెక్షన్‌ను ఉపసంహరించాం. అన్నీ ల్యాండ్‌లైన్ల పునరుద్ధరణ జరిగిందని ఆఫిడవిట్ ద్వారా వివరించింది. సెప్టెంబర్ 27 నుంచి జమ్ము, కాశ్మీర్, లఢాక్‌లలో 100 శాతం ల్యాండ్‌లైన్ల సేవలు పునరుద్ధరణ జరిగింది. జమ్మూ, లఢాక్‌లలో మొబైల్ సర్వీస్ సేవలు వందశాతం అందుబాటులోకి వచ్చాయి. కాశ్మీర్‌లో 10 శాతం మాత్రమే పునరుద్ధరణ జరిగింది. జమ్ము, లఢాక్‌లో 100 శాతం పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యాయి. కాశ్మీర్‌లో 90 శాతం స్కూళ్లు తెరచుకున్నాయి. మూడు ప్రాంతాల్లోనూ రాష్ట్రానికి సంబంధించిన ప్రధాన పత్రికలకు తోడు జాతీయ పత్రికల ప్రచురణ కూడా జరుగుతోంది. జమ్ముకాశ్మీర్‌లో డిష్ టీవీ, దూరదర్శన్, స్థానిక చానెళ్లు, రేడియో కాశ్మీర్, ఎంఎఫ్ రేడియోల ప్రసారాలు కూడా సాధారణంగానే కొనసాగుతున్నాయి. సామాన్య ప్రజల కోసం ఇంటర్నెట్ సేవా కేంద్రాలను కూడా ప్రభుత్వం తెరిపించింది. మీడియా సహాయ కేంద్రాలను కూడా ఏర్పాటు చేశాం. అనేక మంది మీడియా ప్రతినిధులు కూడా కాశ్మీర్ లోయలో పర్యటించారని ఆఫిడవిట్‌లో కాశ్మీర్ పాలనా యంత్రాంగం వివరించింది. కాశ్మీర్‌లో పరిస్థితులు తెలియజేయాలంటూ సుప్రీం సీజే రంజన్ గొగోయే ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ మేరకు ఆఫిడవిట్ దాఖలు చేసింది.

### పిల్లలను అక్రమంగా నిర్బంధించలేదు

చిన్నపిల్లలు ఎవరినీ అక్రమంగా నిర్బంధించలేదని సుప్రీంకోర్టుకు నలుగురు సభ్యుల ప్రత్యేక కమిటీ నివేదికను అందించింది. ఈ మేరకు రిపోర్ట్‌లో జమ్మూకాశ్మీర్ పాలనాయంత్రాంగం వివరణను పొందుపరచింది. 9, 11, 12 లోపు మొత్తం 144 మంది పిల్లలను కూడా నిర్బంధించారనే ఆరోపణల్లో వాస్తవంలేదు. రాళ్లు రువ్వడం, అల్లర్లలో భాగమవ్వడం, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం కలిగించిన చర్యల్లో పాల్గొన్న మైనర్లను స్టేట్ హోంకు తరలించాం. అక్కడ వారిని భద్రతంగా చూసుకున్నాం. కొన్ని మీడియా సంస్థల్లో వస్తున్న కథనాల్లో వాస్తవం లేదు. సంచలనాల కోసం ఇలాంటి అంశాలను ప్రసారం చేస్తున్నారని జమ్ముకాశ్మీర్ పోలీసులు తెలిపారని నివేదికలో వివరించింది. పోలీసులకు అపకీర్తి అంటగట్టేందుకు ఈ చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొంది.



## అట్రాసిటీ పేరుతో తప్పుడు కేసులు నిజంకాదు..

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** ఎస్సీ, ఎస్టీ అకృత్యాల నిరోధక చట్టాన్ని దుర్వినియోగం చేసేందుకు ఎస్సీ, ఎస్టీలు తప్పుడు కేసులు పెడుతున్నారన్న ఆరోపణలు నిరాధారమైనవని వ్యాఖ్యానించింది. 2016 లో దేశవ్యాప్తంగా 47వేల అట్రాసిటీ కేసులు నమోదు కావడంతోనే దళితుల పట్ల వివక్ష ఏ స్థాయిలో ఉందో అర్థమౌతోందని.. అలాంటప్పుడు చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఎలా అంటారని జస్టిస్ అరుణ్ మిశ్రా, ఎంఆర్ షా, బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ప్రశ్నించింది. అట్రాసిటీ పేరుతో ఎస్సీ, ఎస్టీలు తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారన్న ఆరోపణలపై ధర్మాసనం స్పందిస్తూ.. సమానత్వం కోసం ఎస్సీ, ఎస్టీలు చేస్తున్న పోరాటం ఇంకా ముగియలేదని స్పష్టం చేసింది. 2018 మార్చిలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా నిరోధించడానికి సుప్రీంకోర్టు పలు మార్గదర్శకాలను రూపొందించింది. ఈ చట్టం ప్రకారం ఫిర్యాదు అందినవెంటనే అరెస్టు చేయకుండా.. ముందుగా విచారణ తర్వాత ఆ తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించింది. కొన్ని కొన్ని సందర్భాల్లో ముందస్తు బెయిల్ కూడా ఇవ్వొచ్చని పేర్కొంది. దీంతో దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగాయి. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం నిర్వీర్యానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని పలు సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని పిటిషన్ దాఖలు చేసింది.

### చట్టాన్ని పరిరక్షించండి..

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ 11 రివ్యూ పిటిషన్లు దాఖలైనట్లు సుప్రీంకోర్టు న్యాయవాది శ్రవణ్ కుమార్ తెలిపారు. సుప్రీంకోర్టు పిటిషన్‌ను పునఃసమీక్షించేందుకు అంగీకరించడాన్ని స్వాగతిస్తున్నామని అఖిల భారత దళిత హక్కుల ఫోరం అధ్యక్షుడు ఆనంద్ రావు చెప్పారు. గతంలో ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని నీరుగార్చాలని కేంద్ర ప్రభుత్వం యత్నించిందని ఆయన ఆరోపించారు. దళితులు చేస్తున్న ఆందోళనతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ఎస్సీ, ఎస్టీ బిల్లును పార్లమెంట్‌లో పాస్ చేసిందని గుర్తు చేశారు.

ఆంధ్రప్రభ



# డిసెంబర్ 19న ఐపీఎల్ వేలం

**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది ఐపీఎల్‌కోసం ఆటగాళ్ల వేలం డిసెంబర్ 19న కోల్‌కతాలో నిర్వహించనున్నారు. ఇప్పటివరకు ఐపీఎల్ వేలం బెంగళూరులో నిర్వహించేవారు. ఆటగాళ్ల ట్రేడింగ్ నవంబర్ 14తో ముగియనుంది. కాగా ఈ మేరకు ఫ్రాంచైజీలు సోమవారంలోగా సమాచారం అందజేయాల్సి ఉంది. 2019 వేలంకోసం రూ.82 కోట్లు, 2020 వేలంకోసం రూ.85 కోట్లు ఫ్రాంచైజీలకు కేటాయించనున్నారు. అలాగే గత ఏడాది వేలంలో మిగిలిన మొత్తాలనుంచి ప్రతి ఫ్రాంచైజీ రూ.3 కోట్లవరకు ఖర్చు చేసుకునే వెసులుబాటు కల్పిస్తారు. ఢిల్లీ కేపిటల్స్‌కు అత్యధికంగా రూ.8.2 కోట్లు మిగులు ఉంది. రాజస్థాన్ రూ.7.15 కోట్లు, కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.6.05 కోట్లు మిగులుతో తరువాతి స్థానాల్లో ఉన్నాయి. ఆటగాళ్ల మార్పిడికి వచ్చే ఏడాదే చివరి అవకాశం. 2021లో మెగా వేలంలో అన్ని ఫ్రాంచైజీలు కొత్తగా మొత్తం ఆటగాళ్లను కొనుగోలు చేస్తాయి.

## బ్రాత్‌వైట్‌కు క్లీన్ చిట్




**దుబాయ్:** వెస్టిండీస్ ఆటగాడు క్రెగ్ బ్రాత్‌వైట్ అంతర్జాతీయ మ్యాచ్‌లలో బౌలింగ్ చేసేందుకు ఐసీసీ అనుమతించింది. ఆఫ్ స్పిన్ వేసే బ్రాత్‌వైట్ గత నెలలో ఇండియాతో రెండో టెస్టు సందర్భంగా సందేహాస్పద బౌలింగ్ చేస్తున్నాడన్న ఆరోపణతో ఐసీసీ నిషేధం విధించింది. అనంతరం ఇంగ్లండ్‌లోని లాబరోలో సెప్టెంబర్ 14 బ్రాత్‌వైట్ బౌలింగ్‌ను ఐసీసీ పరిశీలించింది. అతని బౌలింగ్ చేసేటపుడు మోచేతి వంపు 15 డిగ్రీలలోపే ఉందని నిర్ధారణ కావడంతో ఐసీసీ అతనిపై నిషేధం తొలగిస్తూ బౌలింగ్ చేసేందుకు అనుమతిస్తూ నిర్ణయం తీసుకుంది.

## భారత్‌కు నాలుగో విజయం




**అంట్వెర్ప్(బెల్జియం) :** బెల్జియం పర్యటనలో భాగంగా భారత పురుషుల హాకీ జట్టు వరుసగా నాలుగో విజయాన్ని దక్కించుకుంది. మంగళవారం ప్రపంచ, యూరోపియన్ చాంపియన్ బెల్జియంతో జరిగిన పోరులో భారత్ 2-1తో గెలుపొందింది. భారత్ తరపున అమిత్ రోహిదాస్ 10వ నిమిషంలో, సిమ్రన్‌జీత్ సింగ్ 52వ నిమిషంలో గోల్స్ సాధించారు. బెల్జియంకు ఏకైక గోల్ వారి కెప్టెన్ ఫెలిక్స డెనాయర్ 33వ నిమిషంలో సాధించాడు. ప్రపంచ అయిదో ర్యాంకర్ భారత్ గత మ్యాచ్‌లో 5-1తో స్పెయిన్‌ను ఓడించిన ఉత్సాహంతో బెల్జియంపైనే అదే ప్రదర్శన చేసింది. పదో నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను రోహిదాస్ సద్వినియోగం చేస్తూ భారత్‌కు ఆధిక్యం అందించాడు. ఆపై విరామంవరకు బెల్జియం గోల్‌కోసం చేసిన ప్రయత్నాలన్నీ వమ్మయ్యాయి. మూడో క్వార్టర్‌లో మూడో నిమిషంలో లభించిన రెండో పెనాల్టీకార్నర్‌ను బెల్జియం కెప్టెన్ గోల్‌గా మలిచి స్కోరున సమం చేశాడు. ఆధిక్యంకోసం చివరి క్వార్టర్‌లో లభించిన రెండు పెనాల్టీకార్నర్ అవకాశాలను బెల్జియం గోల్స్‌గా మలచలేకపోయింది. అవకాశాలకోసం ఎదురుచూస్తున్న భారత్‌కు 52వ నిమిషంలో సిమ్రన్‌జిత్ ఫీల్డ్‌గోల్‌తో ఆధిక్యం అందించాడు. చివరి క్షణాల్లో స్కోరు సమం చేసేందుకు బెల్జియం చేసిన ప్రయత్నాలను భారత్ సమర్ధంగా తిప్పికొట్టి విజయం అందుకుంది. గురువారం తదుపరి మ్యాచ్‌లో భారత్ మరోమారు బెల్జియంతో తలపడుతుంది.

# జోరు సాగేనా..!




**నేటి నుంచి సౌతాఫ్రికాతో భారత్ తొలి టెస్టు**
**ఫేవరెట్‌గా టీమిండియా.. సఫారీలకు పరీక్ష**

**విశాఖపట్నం వేదికగా ఉ.9:30 నుంచి.. స్టార్ నెట్‌వర్క్‌లో ప్రసారం**

**విశాఖపట్నం:** భారత్-సౌతాఫ్రికా జట్ల మధ్య నేటి నుంచి మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. వరుస విజయాలతో జోరుమీదున్న భారత జట్టు విశాఖపట్నం వేదికగా బుధవారం నుంచి మొదలవుతున్న తొలి టెస్టులో సఫారీలపై కూడా తమ జోరును కొనసాగించాలని చూస్తోంది. ఇటీవల వెస్టిండీస్‌పై వారి సొంతగడ్డపై 2-0తో టెస్టు సిరీస్ గెలిచిన టీమిండియా అదే జోరు సౌతాఫ్రికాతో సిరీస్‌లోనూ ప్రదర్శించాలని ఆతృతగా ఉంది. ప్రస్తుతం టెస్టు చాంపియన్‌షిప్‌లోనూ భారత జట్టు 120 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. నాలుగేళ్ల తర్వాత భారత్ పర్యటనకు వచ్చిన సఫారీ జట్టు మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 1-1తో డ్రా చేసుకున్న విషయం తెలిసిందే. ఇరు జట్లు చెరో మ్యాచ్‌లో గెలవగా.. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ఇక టెస్టు ఫార్మాట్‌లో నెంబర్ వన్ ర్యాంక్‌లో కొనసాగుతున్న కోహ్లీ సేన ఈ సిరీస్‌లోనూ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. ప్రస్తుతం భారత జట్టు సఫారీ జట్టు కంటే అన్ని విభాగాల్లో మెరుగ్గా ఉంది.

నాలుగేళ్ల క్రితం భారత్ పర్యటనకు వచ్చిన సఫారీ జట్టు 0-3తో టెస్టు సిరీస్‌ను కోల్పోయింది. ఇప్పుడు ఎలాగైనా అందుకు ప్రతీకారం తీర్చుకోవాలని భావిస్తోంది. కానీ హాషిం ఆమ్లా, డివిలియర్స్ వంటి స్టార్ ఆటగాళ్లు లేని లోటు సఫారీ జట్టును వెంటాడుతోంది. ఇక భారత జట్టు బ్యాటింగ్, బౌలింగ్ రెండు విభాగాల్లో పటిష్టంగా ఉంది. బౌలింగ్‌లో ప్రధాన పేసర్ బుమ్రా లేకున్నా మహ్మద్ షమీ, ఇషాంత్ శర్మలు మంచి ఫామ్‌లో ఉండటం టీమిండియాకు కలిసొచ్చే అంశం.

### కొత్త చరిత్ర సృష్టించేనా..

వరుస విజయాలతో జోరుమీదున్న టీమిండియా మరో కొత్త రికార్డుపై కన్నేసింది. టెస్టుల్లో సొంతగడ్డపై ఎదురులేని జట్టుగా ఉన్న భారత జట్టు వరుసగా 10 సిరీసుల్లో విజయాలు సాధించింది. అజేయ రికార్డుతో ఉన్న భారత్ సఫారీ జట్టుతో బుధవారం నుంచి ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల సిరీస్‌లోనూ గెలిస్తే కొత్త చరిత్ర సృష్టిస్తోంది, స్వదేశంలో వరుసగా 11 టెస్టు సిరీస్‌లు గెలిచిన తొలి జట్టుగా రికార్డుల్లో నిలిస్తోంది.

### రోహిత్‌కు కీలకం..

పరిమిత ఓవర్ల క్రికెట్‌లో విజయవంతమైన ఓపెనర్‌గా పేరు సంపాదించిన రోహిత్ శర్మ ఇక టెస్టుల్లోనూ తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. బుధవారం నుంచి సఫారీలతో జరిగే టెస్టు మ్యాచ్‌తో తొలిసారి సుదీర్ఘ ఫార్మాట్‌లో రోహిత్ ఓపెనర్‌గా బరిలోకి దిగబోతున్నాడు. టెస్టులలో 4,5 స్థానాల్లో బ్యాటింగ్‌కు వచ్చే రోహిత్ ఈసారి ఓపెనర్‌గా కొత్త ఇన్నింగ్స్ ఆరంభించనున్నాడు. ఈ ఫార్మాట్‌లో రోహిత్ అంచనాలను అందుకోగలుగుతాడో లేదో చూడాలి. ఇటీవల సఫారీలతో జరిగిన మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌లో రోహిత్ (0) ఖాతా తెరవకుండానే ఆవుట య్యాడు. కానీ టెస్టుల్లో రోహిత్ సత్తా చాటుకుంటాడని టీమిండియా సారథి కోహ్లీ ఆశాభావం వ్యక్తం చేశాడు. అలాగే ఈ మ్యాచ్‌లో యువ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ రిషభ్ పంత్‌కి బదులు వృద్ధిమాన్ సాహాను తుది జట్టులో తీసుకున్నామని కోహ్లీ పేర్కొన్నాడు. ఇక కెప్టెన్ కోహ్లీ, రోహిత్ శర్మ, చతేశ్వర్ పుజారా, వైస్ కెప్టెన్ అజింక్య రహానే, మయాంక్ అగర్వాల్, హనుమ విహారి, సాహాలతో టీమిండియా బ్యాటింగ్ విభాగం అభేద్యంగా ఉంది. బౌలింగ్‌లోనూ రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, మహ్మద్ షమీ, ఇషాంత్ శర్మలతో భారత జట్టు బలీయంగా ఉంది.

### మరిన్ని రికార్డులకు చేరువలో కోహ్లీ..

టీమిండియా స్టార్ బ్యాట్స్‌మన్, పరుగుల యంత్రం విరాట్ కోహ్లీ మరిన్ని రికార్డులకు చేరువయ్యాడు. ఇప్పటికే ఎన్నో రికార్డులను తిరగరాసిన కోహ్లీ సఫారీలతో జరగనున్న మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో మరి కొన్ని రికార్డులపై కన్నేశాడు. సౌతాఫ్రికా జట్టుపై భారత్ తరపున ఇప్పటివరకు సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్, రాహుల్ ద్రవిడ్ మాత్రమే 1000 పరుగులు సాధించారు. ఇప్పుడు తాజాగా కోహ్లీ మరో 242 పరుగులు సాధిస్తే అతను కూడా సఫారీలపై వేయి పరుగులు చేసిన బ్యాట్స్‌మన్‌గా వీరి సరసన చేరుతాడు. కోహ్లీ 281 పరుగులు సాధిస్తే అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక వేగంగా 21 వేలు సాధించిన బ్యాట్స్‌మన్‌గా కొత్త రికార్డు సృష్టించనున్నాడు. ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్న దిగ్గజ బ్యాట్స్‌మన్ సచిన్ టెండూల్కర్ 473 ఇన్నింగ్స్‌లలో 21వేల పరుగుల మార్కును అందుకున్నాడు. ప్రస్తుతం కోహ్లీ 432 ఇన్నింగ్స్‌లలో 20,719 పరుగులు చేశాడు. కోహ్లీ ఈ సిరీస్‌లో రాణిస్తే సచిన్ రికార్డు బద్దలవడం ఖాయం.



### సఫారీలకు పరీక్షే..

ప్రపంచకప్‌లో ఘోరంగా విఫలమైన సౌతాఫ్రికా ఆ తర్వాత తొలిసారి భారత్ పర్యటనకు వచ్చింది. ఇక్కడ జరిగిన టీ20 సిరీస్‌లో పర్వాలేదనిపించిన సఫారీ జట్టుకు అసలైన పరీక్ష టెస్టు సిరీస్‌లో ఎదురుకానుంది. ప్రపంచ నెంబర్‌వన్ భారత్‌తో మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడనున్న సఫారీ జట్టులో స్టార్ ఆటగాళ్లు హాషిం ఆమ్లా, ఏబీ డివియర్స్, డేల్ స్టెయిన్‌లు ఇటీవల రిటైర్మెంట్ తీసుకున్నారు.

వారులేకుండా పటిష్టమైన భారత్‌ను ఎదుర్కోవడమంటే సఫారీలకు పెద్ద పరీక్ష లాంటిదే. కెప్టెన్ డుప్లెసిస్, టెంబ బవుమా, డికాక్, మార్క్‌రమ్, రబాడా, ఎంగిడిల ప్రదర్శనలపైనే సౌతాఫ్రికా జట్టు ఆధారపడి ఉంది. వీరు సత్తా చాటితే టీమిండియాకు గట్టి పోటీ ఇవ్వగలదు.

**జట్ల వివరాలు: (అంచనా)**

**భారత్:** విరాట్ కోహ్లీ (కెప్టెన్), అజింక్య రహానే (వైస్ కెప్టెన్), రోహిత్ శర్మ, మయాంక్ అగర్వాల్, చతేశ్వర్ పుజారా, హనుమ విహారి, వృద్ధిమాన్ సహా (వికెట్ కీపర్), రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, మహ్మద్ షమీ, ఇషాంత్ శర్మ.

**సౌతాఫ్రికా:** ఫాఫ్ డుప్లెసిస్ (కెప్టెన్), టెంబ బవుమా, డి బ్రూన్, క్వింటన్ డికాక్, డీన్ ఎల్గర్, జుబేర్ హంజా, కేశవ్ మహరాజ్, మార్క్‌రమ్, ముత్తుసామి, లుంగి ఎంగిడి, అన్రిచ్ నోర్జ్, ఫిలాండర్, డేన్ పీట్, కసిగో రబాడా, రుడి సెకండ్.

**అభిమానం పచ్చబడింది**




తమ అభిమాన క్రికెటర్లను చేరుకునేందుకు వింత పద్ధతులను అవలంభించడం అభిమానులకు పరిపాటే. విశాఖ వేదికగా దక్షిణాఫ్రికాతో బుధవారంనుంచి తొలి టెస్టు జరగనున్న నేపథ్యంలో కోహ్లీ వీరాభిమాని ఒకరు శరీరం నిండా కోహ్లీ విశేషాలతో పచ్చ బొట్టు పొడిపించుకుని కోహ్లీ దృష్టిని ఆకర్షించాడు. దీనితో కోహ్లీ అతనిని కౌగిలించుకుని సెల్ఫీలు దిగి సంతోషపరిచాడు.

## రాణించిన రాయుడు

**కర్ణాటకపై హైదరాబాద్ గెలుపు**
**విజయ్ హజారే ట్రోఫీ**

**ఆలూర్:** విజయ్ హజారే వన్డే ట్రోఫీల భాగంగా మంగళవారం కర్ణాటకతో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 21 పరుగులతో విజయం సాధించింది. బౌలింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. కెప్టెన్ అంబటి రాయుడు (87; 111 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించాడు. మరోవైపు సీవీ మిలింద్ (36), ఆశిష్ రెడ్డి (21) మినహా ఇతర బ్యాట్స్‌మెన్ విఫలమయ్యారు. అనంతరం స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన కర్ణాటక బ్యాట్స్‌మెన్‌ను హైదరాబాద్ బౌలర్లు హడలెత్తించారు. నిప్పులు చెరిగే బంతులతో విజృంభించడంతో కర్ణాటక 45.2 ఓవర్లలో 177 పరుగులకే ఆలౌటైపోయింది. దీంతో హైదరాబాద్‌కు ఈ సిరీస్‌లో రెండో విజయం దక్కింది. సందీప్ 4, సిరాజ్ 2 వికెట్లు తీసి విజయంలో కీలక పాత్ర పోషించారు. కర్ణాటక బ్యాట్స్‌మెన్‌లో పాడికల్ (60), కెప్టెన్ మనీష్ పాండే (48) రాణించినా స్టార్ ఆటగాళ్లు కేఎల్ రాహుల్ (4), కరుణ్ నాయర్ (0) విఫలమయ్యారు.




## ఎంసీసీ అధ్యక్షుడిగా సంగక్కర



**లండన్ :** ప్రఖ్యాత మెల్‌బోర్న్ క్రికెట్ క్లబ్(ఎంసీసీ) అధ్యక్షుడిగా శ్రీలంక మాజీ కెప్టెన్ కుమార సంగక్కర సోమవారం బాధ్యతలు స్వీకరించాడు. ఈ ఘనత దక్కించుకున్న తొలి బ్రిటిషేతరుడు సంగక్కర. ఈ పదవిలో అతడు ఏడాదిపాటు కొనసాగుతాడు. గత మేలో పదవీ విరమణ చేయనున్న అధ్యక్షుడు ఆంథోని రెఫోర్డ్ సర్వసభ్య సమావేశంలో సంగక్కర పేరును సూచించాడు. ఎంసీసీతో సంగక్కరకు దశాబ్దంన్నర కాలంగా అనుబంధం ఉంది. సంగక్కర పదవీ కాలంలో ఇంగ్లండ్ వెస్టిండీస్, పాకిస్తాన్‌లతో టెస్టు మ్యాచ్‌లు, ఆస్ట్రేలియాతో వన్డేలు ఆడనున్నది. అంతేగాక హండ్రెడ్ బాల్ టోర్నీకూడా ఆరంభించనున్నారు.

# మేఘాలలో మరియ

**మరియ లసిస్కెనికి మహిళల హైజంప్ స్వర్ణం.. ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్**



**దోహా:** రష్యా క్రీడాకారిణి మరియ లసిస్కెని మేఘాలను తాకుతున్నట్టు గాలిలోకి లంఘించి ప్రపంచ చాంపియన్‌షిప్ మహిళల హైజంప్ స్వర్ణాన్ని ఒడిసిపట్టింది. నాలుగో రోజు పోటీలలో మరియ 2.04మీ. ఎత్తును అధిగమించి ప్రపంచ చాంపియన్‌గా నిలిచింది. నాలుగేళ్ల క్రితం బీజింగ్‌లో 2.01మీ.తో, రెండేళ్ల క్రితం లండన్‌లో 2.03మీ.తో ప్రపంచా చాంపియన్‌షిప్ స్వర్ణాలు అందుకున్న మరియ ఈసారి మరింత ఎత్తుకు ఎదిగి వరుసగా మూడోసారి మరోసారి చాంపియన్‌ను తానేనని నిరూపించుకుంది. రెండేళ్ల క్రితం ఉక్రెయిన్‌కు చెందిన యులియా లావ్‌చెంకోనుంచి గట్టిపోటీ ఎదుర్కొన్న మరియ ఈసారి ఉక్రెయిన్‌కే చెందిన టీనేజ్ క్రీడాకారిణి యురొస్లావా మహుచిక్‌నుంచి పోటీ ఎదుర్కొంది. యురొస్లావాకూడా 2.04మీ.నే అధిగమించినా మరియ తక్కువ ప్రయత్నాల్లో ఆ ఎత్తును అధిగమించడంతో స్వర్ణం ఆమె సొంతమై, యురొస్లావా రజతంతో సంతృప్తి చెందింది. అమెరికాకు చెందిన వస్టి కన్నింగమ్ 2మీ. అధిగమించి కాంస్యం దక్కించుకుంది.

మహిళల 800మీ. పరుగులో ఉగాండాకు చెందిన అనామక క్రీడాకారిణి హలీమా నకాయి స్వర్ణం గెలుచుకుంది. నకాయి 1ని.58.04సె.లో గమ్యాన్ని చేరి అగ్రస్థానం దక్కించుకుంది. అమెరికా క్రీడాకారిణి రావిన్ రోజర్స్ 1ని.58.18సె.తో రజతం, ఫేవరెట్ అజీ విల్సన్(అమెరికా) 1ని.58.54సె.తో కాంస్యం గెలుచుకున్నారు. మహిళల 3000మీ. స్టీపుల్‌చేజ్‌ను కెన్యాకు చెందిన బీట్రిస్ చెప్కోచ్ 8ని.57.84సె.తో సరికొత్త చాంపియన్‌షిప్ రికార్డుతో స్వర్ణం గెలుచుకుంది. తన సమీప ప్రత్యర్థికంటె చెప్కోచ్ నాలుగ సెకండ్లు ముందుగా గమ్యాన్ని చేరడం గమనార్హం. అమెరికాకు చెందిన ఎమ్మా కోబర్న్ 9ని. 2.35సె.తో రజతం, జర్మనీకి చెందిన గెస ఫెలిసిటాస్ క్రూజ్ 9ని.3.30సె.తో కాంస్య పతకం దక్కించుకున్నారు.

పురుషుల డిస్కస్ త్రోలో స్వీడన్‌కు చెందిన డేనియల్ స్టాల్ 67.59మీ.తో స్వర్ణం చేజిక్కించుకున్నాడు. ఈ ఏడాది డైమండ్ ట్రోఫీలో 71.86మీ. దూరం విసిరి ప్రపంచ రికార్డు నెలకొల్పిన స్టాల్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఆ స్థాయి ప్రదర్శన చేయలేకపోయినా స్వర్ణం సొంతం చేసుకున్నాడు. జమైకాకు చెందిన ఫెడ్రిక్ డాక్రిస్ 66.94మీ.తో రజతం, ఆస్ట్రియాకు చెందిన లూకాస్ వీస్‌హాడింజర్ 66.82మీ.తో కాంస్య పతకం గెలుచుకున్నారు. పురుషుల 400మీ. హర్డిల్స్‌లో నార్వేకు చెందిన కార్‌స్టెన్ వార్‌హోమ్ 47.42సె.తో స్వర్ణం సాధించాడు. అమెరికాకు చెందిన రాయ్ బెంజమిన్ 47.66సె.తో రజతం, ఖతార్‌కు చెందిన అబ్దెర్ రహమాన్ సాంబ 48.03సె.తో కాంస్యం గెలుచుకున్నారు. పురుషుల 5000మీ. పరుగులో తొలి రెండు స్థానాలను ఇథియోపియా అథ్లెట్లే దక్కించుకున్నారు. ముక్తార్ ఎద్రిస్ 12ని. 58.85సె.తో స్వర్ణం, సెలెమాన్ బారెగ 12ని. 59.70సె.తో రజతం గెలుచుకున్నారు. కెనడాకు చెందిన మొహమ్మద్ అహ్మద్ 13ని. 1.11సె.తో కాంస్యం దక్కించుకున్నాడు.

### అవినాష్ జాతీయ రికార్డు

ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన అవినాష్ శాబల్ 3000మీ. స్టీపుల్‌చేజ్లో జాతీయ రికార్డును మెరుగుపరిచాడు. అవినాష్ 8ని. 25.23సె.తో తన పేరిటే ఉన్న రికార్డు(8ని. 28.94సె.)ను అధిగమించినా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఫైనల్స్‌కు చేరడంలో విఫలమయ్యాడు. తొలి హీట్‌లో పోటీపడిన అవినాష్ మూడో స్థానంలో, మొత్తంగా 20వ స్థానంలో నిలిచి పోటీలనుంచి నిష్క్రమించాడు.

# భారత్‌దే టి20 సిరీస్




షఫాలీ వర్మ (46)

**చెలరేగిన షఫాలీ వర్మ**
**నాలుగో మ్యాచ్‌లోనూ సౌతాఫ్రికా చిత్తు**
**మహిళల టి20**

**సూరత్:** సౌతాఫ్రికా మహిళల క్రికెట్ జట్టుతో జరుగుతున్న 5 మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను భారత మహిళలు మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో కైవసం చేసుకున్నారు. రెండు మ్యాచ్‌లు వర్షంతో రద్దయిన విషయం తెలిసిందే. మంగళవారం జరిగిన నాలుగో టీ20లో ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన భారత్ 51 పరుగులతో ఘన విజయం సాధించింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 17 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 17 ఓవర్లలో 4 వికెట్లకు 140పరుగులు చేసింది. యువ క్రికెటర్ షఫాలీ వర్మ (46), జెమీమా (33) రాణించారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన సఫారీ మహిళలు పూనమ్ యాదవ్ (3/13), రాధ యాదవ్ (2/16) ధాటికి నిర్ణీత 17 ఓవర్లలో 7 వికెట్లకు 89 పరుగులే చేయగలిగారు. శుక్రవారం ఇరు జట్ల మధ్య చివరి టి20 జరగనుంది.

అంతకుముందు బ్యాటింగ్ చేసిన భారత మహిళా జట్టుకు శుభారంభం లభించింది. ఓపెనర్ స్మృతి మంధాన (19 బంతుల్లో 13)తో కలిసి మరో ఓపెనర్ షఫాలీ వర్మ దీటైన ఆరంభాన్ని అందించింది. మంధాన తన శైలికి భిన్నంగా కుదురుగా ఆడుతుంటె 15 ఏళ్ల యువ క్రికెటర్ షఫాలీ మాత్రం విధ్వంసకర బ్యాటింగ్‌తో విజృంభించింది. వరుస బౌండరీలతో సఫారీ బౌలర్లపై విరుచుకుపడింది. తరువాత క్రీజులోకి వచ్చిన జెమీమా రోడ్రిగ్స్ కూడా ధాటిగా ఆడుతూ స్కోరుబోర్డు పరిగెత్తించింది. కానీ ఈ సమయం లోనే చెలరేగి ఆడుతున్న షఫాలీ 33 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 46 పరుగులు చేసి ఆవుటైంది. దీంతో భారత్ 65 పరుగుల వద్ద రెండో వికెట్ కోల్పోయింది. అనంతరం కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ 9 బంతుల్లోనే 2 ఫోర్లు, 1 సిక్సర్ సహాయంతో 16 పరుగులు చేసి వెనుదిరిగింది. ఈ దశలో జెమీమాకు దీప్తి శర్మ జతకలిసి దూకుడుగా ఆడడంతో భారత్ 12.4 ఓవర్లలో 100 పరుగుల మార్కును పూర్తి చేసుకుంది. తర్వాత కీలక ఇన్నింగ్స్ ఆడుతున్న జెమీమా (33; 22 బంతుల్లో 5 ఫోర్లు) ఖాకా బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయింది. చివర్లో దీప్తి శర్మ (20 నాటౌట్; 16 బంతుల్లో 2 ఫోర్లు), పూజా వాస్త్రకర్ (5 నాటౌట్) రాణించడంతో భారత్ నిర్ణీత 17 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. సఫారీ బౌలర్లలో డిక్లార్క్ రెండు వికెట్లు తీసింది.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

epaper.prabhanews.com

డెబ్భై వసంతాలు దాటిన స్వతంత్ర భారతం....మహాత్ముని 150 జయంతి వేళ....జాతిపిత కన్న కలలు ఏ మేరకు సాకారమయ్యాయి? అనే ప్రశ్న తెరమీదికి రావడం కద్దు! ఎందుకంటే...ఆశయాల సాధనే ఆయనకు మనం సమర్పించే నిజమైన నివాళి కాబట్టి! .. అర్ధరాత్రి మహిళ స్వేచ్ఛగా తిరుగగల్గినప్పుడే నిజమైన స్వరాజ్యం..అని కదా గాంధీజీ చెప్పింది...మరి ఇప్పుడు మహిళల పరిస్థితి ఎలా ఉంది? గ్రామ స్వరాజ్యం-స్వయం సమృద్ధి అనే మహాత్ముని కల ఎంతవరకు నిజమైంది? మహిళల సాధికారత మాటేంటి? ఆయన చూపిన సత్యం-అహింసా మార్గం, ఆయనకు అత్యంత ప్రియమైన, స్వాతంత్ర్య సమరంలో ఆయుధంగా వాడిన ఖాదీ పరిస్థితి ఏమిటి?... మహాత్ముని జయంతి సందర్భంగా పాలకులు, ప్రతి భారతీయుడు తనను తాను ప్రశ్నించుకోవాల్సి అవసరం ఉంది. అందుకే దేశంలోని ఆయా రంగాల స్థితిగతులపై ప్రత్యేక కథనం..!

# బాపూ...నీ బాటన నడిచే బలమివ్వు!



మహాత్మాగాంధీజీకి సత్యం, అహింస తర్వాత అత్యంత ప్రియమైనది ఖాదీ. తానే స్వయంగా చరఖాపై దారం వడికిన సంగతి అందరికి తెలిసిందే. స్వాతంత్ర్య సంగ్రామంలో ఖాదీ బట్టలు ధరించడాన్ని ఓ ఉద్యమంలా మార్చారు. విదేశీ వస్తు బహిష్కరణ ద్వారా ఖాదీ ఉద్యమాన్ని ఉధృతం చేశారు. అలాంటి ఖాదీ పరిశ్రమ ప్రస్తుతం దేశంలో మంచి ఉన్నతిలో ఉందనే చెప్పాలి. గాంధీజీ కన్న



ఖాదీ కల సాకారం అవుతోందనే చెప్పాలి. ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడి తానే స్వయంగా ఖాదీ బట్టలు ధరించడం ద్వారా దానికి అంబాసిడర్‌గా మారాడని చెప్పక తప్పదు.ఎందుకంటే గత ఐదారు సంవత్సరాల్లో ఈ పరిశ్రమ అభివృద్ధి పథంలో దూసుకు పోతోంది అనడానికి, ఆ రంగంలో ఖాదీ, గ్రామ పరిశ్రమల కమిషన్(కేవీఐసీ) ద్వారా అమలు అవుతున్న పథకాలు, 2.17 మిలియన్ల ఉద్యోగాల కల్పనను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. గత ఐదేళ్లలో ఖాదీ ఉత్పత్తుల అమ్మకం 1.56బిలియన్ యుఎస్ డాలర్లకు చేరుకోవడం మరో నిదర్శనం. గత ఆర్థిక సంవత్సరంలో జమ్ము- కశ్మీర్‌లో దాదాపు 70 వేల మందికి ఉపాధి లభించింది. ఈ పరిశ్రమ అభివృద్ధి కారణంగా గతంలో రోజు వారి 100 రూపాయలు సంపాదించే వారు ప్రస్తుతం 400రూపాయలు సంపాదిస్తున్నారు. ఖాదీ అనేది రంగులకు సంబంధించిన స్వాతంత్ర్యం అని గాంధి అన్నట్లు ..ప్రస్తుతం దేశంలో ఖాదీ పరిశ్రమ ద్వారా వేలాది మందికి ఉపాధి లభిస్తోంది. వారి జీవితాల్లో సంతోషాలు రంగులు వెల్లి విరుస్తున్నాయి.

### మన్ కీ బాత్ ద్వారా...

మోదీ ప్రధాని అయిన దగ్గర నుంచి ఖాదీని ప్రోత్సహిస్తున్నారనడం అతిశయోక్తి కాదు. అంతేకాదు ఆయన మన్ కీ బాత్....పేరుతో రేడియోలో చేసే ప్రసంగంలో ఖాదీ గురించి పలుమార్లు పేర్కొనడం ఇక్కడ గమనార్హం. మోదీ 2018లో స్వాతంత్ర్యం దినోత్సవ ప్రసంగంలో సైతం ఖాదీ పరిశ్రమ అభివృద్ధి గురించి వివరించారు. 2017 సెప్టెంబర్‌లో మన్ కీ బాత్‌లో మాట్లాడుతూ.... నేను కేవలం ఖాదీ బట్టలు మాత్రమే ధరించమని చెప్పడం లేదు.. మనం ఎన్నో రకాల బట్టలు ధరిస్తున్నాము అందులో ఖాదీకి ఎందుకు స్థానం కల్పించరని అడుగుతున్నాను..అని ప్రశ్నించిన తీరు యూత్‌ను సైతం ఎంతగానో ఆకట్టుకుంది. ప్రస్తుతం ఖాదీ ధరించడం కొందరికి ఫ్యాషన్‌గా మారిందనడం సత్యదూరం కాదు. ప్రధాని చొరవ, కేవీఐసీ కృషి ఫలితంగా దేశంలో 2004- 2014 మధ్య కాలంలో ఖాదీ పరిశ్రమ ఉత్పత్తుల అమ్మకాలు 914.07 కోట్ల రూపాయలు కాగా...2015-2018 మధ్య 1828.30 కోట్ల రూపాయలకు చేరాయి. అంటే ఖాదీ పరిశ్రమ రెట్టింపు అభివృద్ధిని సాధించిందన్నమాట.

### గాంధీయుగము

గాంధీయుగమున బుట్టితి, గాంధీ నడుము
నుద్యమంబుల నలిగితి నోపినంత
గాంధీ నర్చింతిని, గాంధీ కవిత వ్రాయు
గంటిన జన్మమునకు నీ పంటచాలు

ఆకాలమ్మున గౌతమ
డీ కాలమునందు గాంధీ యిద్దరు హింసా
వ్యాకుల జగతికాశాంతి
శ్రీకరుల దయావిధేయ జీవన నిరతుల్

రాముని సత్త్వము కృష్ణుని
ప్రేమయు గౌరవమూ కరుణ పెనకోనయోగి
గ్రామాని బాపు బ్రతుకై
మాయక కవితాలతలూ సమాశ్రయమయ్యేక

- తుమ్మల సీతారామమూర్తి

☆☆☆

### మహాత్ముడు

కట్టుకున్నది యంగ వస్త్రము
పట్టుకున్నది రాట్న చక్రము
పట్టుమని పది మొతుకులైనా
పట్టుకుండ కృశోదరముగల
గాంధీ కంటే సామన్యవాదులు గలరె!

ఎవరు తప్పొనరించి యుండిన
నేమియును పల్లెత్తు పలుకడు
ఎవరిలోపములున్న తానే
యాతనల పాలై కృశించునే

- చుక్కబోట్ల సత్యనారాయణ మూర్తి

☆☆☆

### అంజలి

ఎవ్వాలి కృషిచేత నీ భారతాంబకు
పరదాస్య బంధముల్ బాసిపోమె
సత్యమెవ్వాని జీవిత సారమగును
అల నహింసకు నెవ్వాడ నాటపట్టు
అట్టి గాంధీ మహాత్మన కంజలిడుతు

- కనుపర్తి వరలక్ష్మమ్మ

ఖాదీ అంటే రంగులకు సంబంధించిన స్వాతంత్ర్యం

- మహాత్మాగాంధీ

## అల్లంత దూరం...గ్రామ స్వరాజ్యం!



మహాత్ముడు స్వప్నించిన గ్రామస్వారాజ్యం మాత్రం అల్లంత దూరంలో నిలిచి పోయిందని చెప్పాలి. దానికోసం చేసిన చట్టాలు ఆచరణకు నోచుకోక పోవడమే అందుకు ప్రధాన కారణం. మన దేశంలో అత్యంత ప్రాచీన పాలనా వ్యవస్థ పంచాయితీ! ప్రజాస్వామ్యం వచ్చిన తర్వాత స్థానిక స్వపరిపాలనా వ్యవస్థను బలోపేతం చేయడానికి అనేక చర్యలు తీసుకున్నా... అవి గ్రామస్థాయికి చేరలేదు. దీంతో గ్రామరాజ్యం ద్వారా రామరాజ్యం ఏర్పాటు చేయాలన్న గాంధీజీ కన్నకలల కల్లలయ్యా యి. గాంధీజీ ఉద్దేశ్యం ప్రకారం ప్రతి గ్రామ పంచాయితీ ఒక చిన్న గణతంత్ర రాజ్యం..అవి ప్రగతి సాధించడం ద్వారా భారత గణతంత్ర రాజ్యం బలోపేతం అవ్వాలి. అలాగని పాలకులు దానికి ప్రియారిటీ ఇవ్వలేదా అంటే ఇచ్చారు చట్టాల్లో...! కాని ఆచరణ మరిచారు. గ్రామాల ప్రగతి కోసం గ్రామ పంచాయతీలను బలోపేతం చేసేది శలో రాజ్యాంగంలోని అధికరణ 243(బి) ద్వారా వాటికి ప్రాధాన్యత కల్పించారు. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామపంచాయితీలకు 29 అధికారాలు కట్టబెట్టారు. కానీ పాలకులు ఆ అధికారాలను స్థానిక సంస్థలకు బదిలీ చేయక పోవడంతో .. అవి అమలులో నీరుగారిపోయిు. ఫలితంగా గ్రామాలు ఆర్థిక స్వా వలంబన సాధించలేక, సమస్య లతో కునారిల్లి పోతున్నా యి. మనదేశంలో మూడంచల పం చాయతీ రాజ్ వ్యవస్థ మొదటి సారిగా రాజస్తాన్‌లో ప్రారంభించ బడింది. 1959 నవంబర్1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మహబూబ్ నగర్ జిల్లా షాద్ నగర్‌లో ప్రారంభమైంది. అలా స్వపరిపాలనకు తొలి అడుగు పడిం ది. మలి అడుగునుంచి అన్నీ అవరోధాలే. ఆ తర్వాత ఎన్నో మార్పులు చేర్పులు..ఆశించిన ఫలితం మాత్రం అంతంత మాత్రమే.

### స్థానిక సంస్థలకు నిరాదరణ

గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి...అని చెప్పే పాలకులు ఎందుకో గ్రామాల పట్ల చిన్నచూపు చూస్తున్నారు. గ్రామ స్వరాజ్యానికి వెన్నుముక అయిన అన్నదాతల ఉసురు తీస్తున్నారు.కుటీర పరిశ్రమలు గ్లోబలైజేషన్ దెబ్బకు కుదేల య్యాయి. వాస్తవానికి వ్యవసాయం, పశుసంవర్ధక, గ్రామీ ణ నీటి పారుదల, విద్య,వైద్యం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, మహిళాశిశు సంక్షేమం,మత్స్యశాఖ తదితర అంశాలు దేశప్రగతి తో ముడిపడి న్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పల్లెలకు అందించాలని తాపత్రయ పడుతున్న పాలకులు ..పై అంశాలను ఎందుకు విస్మరిస్తున్నారో అర్థం కాదు. దీంతో గ్రామాలలో తాగునీరు, రహదారులు, పారిశుధ్యం పడకేశాయి. వైద్యం అందని ద్రాక్ష అవుతోంది. వలసల నివారణ, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పన కోసం చేపట్టిన ఉపాధి హామీ పథకం ఆశించిన భరోసా ఇవ్వ డం లేదు. గ్రామ సచివాలయాలు అంతంత మాత్రమే. గ్రామపంచాయితీలకు ఎన్నికల నిర్వహణే సక్రమంగా జరగడం లేదు. కోర్టుల్లో వ్యాజ్యాలతో జాప్యం జరుగుతోంది. పార్టీలకు అతీతంగా జరగాల్సిన పంచాయితీ ఎన్నికలపై రాజకీయ నీలి నీడలు కమ్ముకుని...స్థానిక స్వపరిపాలన నీరుగారి పోతోంది. ప్రభుత్వాలు నిధులు మంజూరు చేసిన రాజకీయ చట్రంలో చిక్కుకుంటున్నాయి. సద్వినియోగం కావడం లేదు. న్యాయంగా గ్రామపంచాయతీలకు రావాల్సిన అధికారాలు, నిధుల బదలాయింపు పూర్తిగా జరగలేదు. ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగాల్సిన గ్రామ సభలు తూతూ మంత్రంగా సాగుతున్నాయి. ప్రస్తుతం దేశంలో ఉన్న 2,50,000 పంచాయితీలలో అధిక శాతం గ్రామాల పరిస్థితి దాదాపుగా ఇలానే ఉంది. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు ఇవ్వాలని కేంద్రం ముందు గగ్గోలు పెట్టే రాష్ట్రాల పాలకులు..గ్రామ పంచాయతీలకు రాజ్యాంగ బద్ధంగా దక్కాల్సిన అధికారాలను బదలాయించేందుకు మీనమేశాలు లెక్కించడం అనేది నిజంగా గాంధీజీ కలలు కన్న గ్రామస్వారాజ్యానికి గొడ్డలి పెట్టు!

## మహిళా సాధికారత

సమాజంలో పురుషులతో సమానమైన హక్కులు,హోదా, అవకాశాలు మహిళలకు లభించి...వారు నిర్ణయాత్మక పాత్రను పోషించగలిగే స్థితిలో ఉండడమే మహిళా సాధికారత. అందుకే మహిళలు అర్ధరాత్రి స్వేచ్ఛగా తిరుగాడిన రోజే నిజమైన ప్రజాస్వామ్యం అన్నారు గాంధీ. అందుకోసం కలలు కన్నారు. కాని ఏడు దశాబ్దాలు దాటిన స్వతంత్ర భారతంలో మహిళల పరిస్థితి ఏంటి? ఎన్నో చట్టాలు, సంక్షేమ పథకాలు అమలు అవుతున్నా..ఆమెపై గృహ హింస పెరిగి పోతోంది. ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీతి లోకంలో అని పాడుకోవా ల్సిన పరిస్థితులు దాపురించాయి. పసి పాప నుంచి పండు ముసలి వరకు మానభంగ పర్వంలో సమిధలవుతు న్నారు. అదే సమయంలో అన్ని అవరోధాలను అధిగమించి మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో దూసుకు పోతున్నారు. ఆకాశంలో సగం కాదు..ఆకాశమంతా మాదే అనేంతగా తమ శక్తిని ప్రదర్శిస్తున్నారు. దేశప్రగతికి మహిళలే కీలకమ ని భావించిన కేంద్రం వారి రక్షణ కోసం, మహిళా సాధికారత కోసం అనేక చట్టాలు చేశాయి. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. వాటి వివరాల్లోకి వెళితే....సతీసహగమన నిషేధ చట్టం(1829), వితంతు పునర్వివాహ చట్టం(1856), బాల్య వివాహాల నిరోధక చట్టం(1952), హిందూ వివాహ చట్టం(1955), హిందూ వారసత్వ చట్టం(1956), అశ్లీల,అవినీతి వ్యాపార నిరోధక చట్టం(1956), వరకట్న నిషేధ చట్టం(1961),మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్(1971),మెటర్నిటీ రిలీఫ్ యాక్ట్ (1976), సమానవేతన చట్టం(1976), జాతీయ మహిళా కమిషన్ చట్టం(1991), గృహహింస నిరోధ చట్టం(2005), పని ప్రదేశాల్లో వేధింపులకు వ్యతిరేకంగా రక్షణ చట్టం( 2013),నిర్భయ చట్టం(2013) తదితరాలు. ఇన్ని చట్టాలు ఉన్నా సమాజంలో మహిళల పట్ల వివక్ష కొనసాగుతోంది. గృహహింస, అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. ప్రజాప్రతినిధులే మహిళలపై అత్యాచారం చేసిన సంఘటనల్లో నేరారోపణలు ఎదుర్కోవడం ఇందుకు ప్రబల నిదర్శనం.

### ప్రత్యేక పథకాలు..

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే ప్రజాస్వామ్య పరమార్థం నెరవేరుతుంది. అందుకే మహిళల సాధికారిత కోసం స్వాతంత్ర్యానంతరం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ఇందిరా మహిళా యోజన, సమగ్ర శిషు అభివృద్ధి సేవా పథకం, గ్రామీణ ప్రాంత మహిళా శిశు అభివృద్ధి పథకం, మహిళా సమృద్ధి యోజన, బాలికా సమృద్ధి యోజన, స్వశక్తి, కిశోర శక్తి యోజన, పావలా వడ్డీ, జననీ సురక్ష యోజన, మాతా ఆరోగ్య రక్షణ సేవలు, ఇందిరా గాంధీ మాతృత్వ సహయోగ్ యోజన, స్త్రీనిధి పథకం, మహిళల కోసం ప్రత్యేకంగా భారతీయ మహిళా బ్యాంక్...ఇలా చాలా పథకాలు అమలులో ఉన్నాయి. అయితే దేశంలో చాలా మంది మహిళలకు ఇలాంటి పథకాలు ఉన్నాయన్న సంగతి తెలయదనడం అతిశయోక్తి కాదు. మహిళల విషయంలో ప్రతిదీ ఆరంభ శూరత్వమే తప్ప, ఆచరణలో మాత్రం నిర్లక్ష్యం వహించడం జరుగుతోంది.

### అయినా మారని పరిస్థితి



లింగ వివక్ష అనేది మన దేశంలోనే కాదు..ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతోంది. పురుషుల కంటే స్త్రీలే అధికంగా శ్రమ దోపిడికి గురవుతున్నారు. సంఘటిత రంగంలో మహిళా ఉద్యోగుల శాతం... ఎనిమిదికి మించలేదు. మహిళా అక్షరాస్యత 58 శాతం.దేశంలోని 87శాతం మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. మహిళల పట్ల కొనసాగుతున్న నిర్లక్ష్యం గురించి ఏనాడు చట్టసభల్లో ప్రస్తావనకు రాదు. కారణం సరైన ప్రాతినిధ్యం లేకపోవడం. చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కోసం దశాబ్దాలుగా మహిళలు పోరాడాల్సి వస్తుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఎన్ని చట్టాలు ఉన్నా మహిళలకు సమాజంలో రక్షణ కరువైందనే చెప్పాలి. భ్రూణహత్యలు, వరకట్న హత్యలు, అత్యాచారాలు, బాలికల అక్రమ రవాణా కొనసాగుతోంది. రాజకీయంగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు అవుతున్నా.. మహిళా సర్పంచ్‌లు ఉన్న చోట వారి భర్తలు అధికారం చలాయిస్తూ.. వారిని వంటింటికే పరిమితం చేయడం అనేది సమాజంలో నేటి మహిళల స్థితికి అద్దం పడుతోంది. అందుకే మాటల్లో కాకుండా చేతల్లో మహిళలకు సమానత్వం రావాలి. అప్పుడే మహాత్ముని కలలు సాకారమవుతాయి!

## అసత్య మార్గం-హింసా ప్రవృత్తి



సత్యం..అహింస ఆయుధాలుగా తెల్లదొరలను దేశం నుంచి పారద్రోలిన ఘన చరిత మహాత్మాగాంధీజీది. సత్య వ్రతాన్ని పాటిస్తూ..హింసను వీడి నీతి,నిజాయతీలతో ప్రగతి పథంలో సాగాలన్నది బాపూజీ ప్రవచించిన మార్గం. స్వాతంత్రం వచ్చిన తొలినాళ్ల సంగతి పక్కన పెడితే ..స్వాతంత్రం వచ్చి ఏడు పదుల వసంతాలు దాటిన తరుణంలో సమాజంలో హింసా ప్రవృత్తి పెరిగింది. అధికారమే పరమావధిగా సాగే రాజకీయ జాతరలో పొంగిపొర్లే హామీల వరదల్లో నిజాయితీ కొట్టుకు పోతోంది. యధారాజా తథా ప్రజ..అన్నట్లు ప్రజల్లోనూ నిజాయితీ కనుమరుగవుతోంది. అధిక శాతం అధికారులు లంచావతారులుగా మారితే, కొందరు అవినీతి,లంచగొండితనం మూలంగా జైళ్లపాలవుతున్న సంఘటనలు కోకొల్లలు. దేశానికి దిశానిర్దేశం చేసే చట్టసభలకు క్రిమినల్స్ ఎంపిక కావడం అనేది ప్రజల పాలిట శాపంగా మారుతోంది. అలాంటి వాళ్లను చట్టసభలకు పంపే స్థితికి ప్రజల స్వార్థం కూడా కారణం అనేది అంగీకరించక తప్పని నిష్టుర సత్యం!

### ప్రస్తుత లోక్‌సభలో...

ప్రస్తుత లోక్ సభలో దాదాపు సగం మంది సభ్యులపై క్రిమినల్ అభియోగాలు ఉన్నాయన్నది అక్షర సత్యం. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ అనే సంస్థ ఎన్నికల్లో అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్‌ల ప్రకారం రూపొందించిన నివేదికలో ఈ విషయం స్పష్టమవుతోంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన ఎంపీలలో 43శాతం మంది నేరాభియోగాలు ఎదుర్కొంటున్నారు. 2014తో పోల్చితే నేరాభియోగాలున్నవారి సంఖ్య 26శాతం పెరగడం దేశంలో పెరుగుతున్న నేరప్రవృత్తికి అద్దం పడుతోంది. 2014లో గెలిచిన లోక్ సభ సభ్యులలో 185 మందిపైన, ప్రస్తుత లోక్ సభలో 233మంది ఎంపీలపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. 2009లో జరిగిన ఎన్నికల్లో 162మంది క్రిమినల్ కేసులు ఉన్నవారు ఎన్నికయ్యారు. అంటే లోక్ సభకు మనం క్రిమినల్ కేసులు ఉన్నవారిని ఎన్నుకోవడం ద్వారా పార్లమెంట్ పవిత్రతకు భగం కల్గిస్తున్నామన్నమాట. దేశానికి దిశానిర్దేశం చేసేందుకు చట్టాలు చేయాల్సిన వాళ్లు నేరచరిత్ర కలిగి ఉంటే( అభియోగం) ఇక సమాజం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. విచారకరమైన విషయం ఏమిటంటే..ఎన్నికల బరిలో నిలిచినప్పుడు తమ మీద ఉన్న క్రిమినల్, సివిల్ ఇతరత్రా కేసులు అఫిడవిట్‌లో దాఖలు చేస్తారు అభ్యర్థులు. అలాంటి వారిని ఎన్నుకుంటున్నారు ప్రజలు. అయితే ఇక్కడ ప్రజలను తప్పుపట్టాల్సిన పనిలేదు.. ఎందుకంటే అఫిడవిట్‌లో వారు ఏఏ అంశాలు పొందు పరిచారు అనేది సామాన్య ప్రజలకు తెలియడం లేదు. మీడియా కూడా వారి ఆస్తులను పరిగణనలోకి తీసుకుని వార్తలు అందిస్తున్నాయి తప్ప, ఎవరి మీద ఎన్ని కేసులు ఉన్నాయన్న విషయం పట్టించుకోవడం లేదు.దీంతో ప్రజలకు నిజాలు తెలియడం లేదు. అందుకే ఎన్నికల సంఘం ఇలాంటి అంశాలను ప్రజలకు తెలియ చెప్పడం ద్వారా వారిని అప్రమత్తం చేయాల్సిన బాధ్యతను తీసుకోవాలి.

### 35శాతం సీఎంలపై...

దేశంలోని మొత్తం ముఖ్యమంత్రుల్లో 35శాతం మంది నేరాభియోగాలు ఎదుర్కొంటున్నారు. అందులో 26శాతం మందిపై తీవ్రమైన నేరాభియోగాలు ఉండడం ఇక్కడ గమనార్హం. 31 మంది ముఖ్యంత్రుల్లో 11మంది ఏదో

రకమై క్రిమినల్ అభియోగాలు ఎదుర్కొంటున్నవారే. 2018లో అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ అనే సంస్థ ఎన్నికల్లో పోటీ చేసేటప్పుడు వారు దాఖలు చేసిన అఫిడవిట్స్ ప్రకారం రూపొందించిన నివేదికలో ఈ విషయాలు వెల్లడించింది.

### అవినీతి,బంధుప్రీతి...

సమాజంలో అవినీతి, బంధుప్రీతి రోజురోజుకు పెరిగి పోతోంది. ఈ జాడ్యం రాజకీయాల్లో పెచ్చుపెరిగి పోయింది. పార్టీలు సామాజిక వర్గాల సమతుల్యత పేరుతో కులాల వారిగా టికెట్లు కేటాయిస్తుంటే...ఓటర్లు సైతం అభ్యర్థి కులం చూసి ఓటేస్తున్నారు. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో కోట్లు కుమ్మరిస్తున్నారు. ఓటర్లు సైతం నోటుకు ఓటు వేసే స్థాయికి దిగజారారు(అందరు కాదు). కోట్లు పెట్టి ఓట్లు కొన్నవారు గెలుపొందిన తర్వాత ,వాటిని తిరిగి ఎలా రాబట్టుకోవాలనే ఆలోచిస్తారు తప్ప, ప్రజలకు ఏమిచేయాలని ఆలోచన ఎందుకు చేస్తారు? పర్యవసానంగా ప్రజా ధనం దోపిడీకి గురవుతోంది. ప్రజాప్రతినిధులు కోట్లు పోగేసుకుంటున్నారు. తాము చేసిన తప్పుల నుంచి తమను తాము కాపాడుకునేందుకు చట్టాలను తమ చుట్టాలుగా మార్చుకుంటున్నారు. ఆర్థిక నేరాల చిట్టాలో జైళ్లకు వెళ్లిన ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు ఉండండం ఇందుకు నిదర్శనం. మర్రి చెట్టుకు పైనుంచి ఊడలు నేలమీదికి వచ్చినట్లే.. అవినీతి పరులు,క్రిమినల్ నేరాభియోగాలు ఉన్నవారు ఉన్న కారణంగా ఆ జాడ్యం లోక్ సభనుంచి గ్రామ స్థాయికి చేరుతోంది. అందుకే స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని రోజులైనా.. బాపూజి కన్న గ్రామ స్వరాజ్యం కల్లగానే మిగిలి పోయిందని చెప్పక తప్పదు.



# కమల్‌కు విలన్‌గా అనిల్‌కపూర్

కథానాయకుడి పాత్రల్లోనే కాదు ప్రతినాయకుడి పాత్రల్లో కూడా నటించడానికి బోలెడంత అవకాశం ఉంటుందని కొందరు నటులు అనుభవ పూర్వకంగా అనడం మనం వింటూనే ఉంటాం. నిజానికి కెరీర్ ఆరంభంలో విలన్ పాత్రల్లో రాణించిన నటులు ఎందరో ఆ తర్వాత హీరోలుగా మారిన సంగతి తెలిసిందే. హీరో పాత్రలకు సమాంతర స్థాయిలో ఉండే విలన్ పాత్రలను పోషించడానికి ఎందరో నటులు ఆసక్తిని కనబరచడం చూస్తున్నదే. ఈ కోవలో లోగడ బాలీవుడ్‌లో కథానాయకుడిగా ఓ వెలుగు వెలిగిన అనిల్‌కపూర్ ఇప్పుడు ప్రతినాయకుడిగా కూడా అలరించబోతున్నట్లు సమాచారం. అదీ ప్రఖ్యాత నటుడు కమల్‌హాసన్ నటిస్తున్న ఇండియన్-2 చిత్రంలో అని వినిపిస్తోంది. ఇదే చిత్రాన్ని తెలుగులో భారతీయుడు-2గా విడుదల చేయనున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రంలో కమల్‌కు ప్రత్యర్థిగా అనిల్‌కపూర్ కనిపించనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆ మేరకు అనిల్‌కపూర్‌కు దర్శకుడు శంకర్ సీన్ వివరిస్తున్నప్పటి ఫొటో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. తొలుత ఈ చిత్రం కోసం ప్రతినాయకుడిగా బాలీవుడ్ నటుడు అజయ్‌దేవ్‌గణ్‌ను అనుకున్నారు. కానీ ప్రాజెక్టు ఆలస్యం కావడంతో ఆయన చిత్రం నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత ప్రతినాయక పాత్ర కోసం అక్షయ్‌కుమార్‌ను తీసుకోవాలని అనుకున్నారట. అయితే ఆ ప్రతిపాదన కూడా కార్యరూపం దాల్చకపోవడంతో అనిల్‌కు ఆ అవకాశం వచ్చిందని అంటున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రంలో కాజల్ కథానాయికగా నటిస్తుండగా...సిద్ధార్థ్, రకుల్‌ప్రీత్‌సింగ్, విద్యుత్ జమ్వాల్, ప్రియా భవానీ శంకర్ తదితరులు తారాగణం.

# అమ్మాయిలకీ కనెక్ట్ అయ్యే పాత్ర

ఊరంతా అనుకుంటున్నారు చిత్రంలో ఘాడీ అనే పేరు గల పక్కింటి అమ్మాయి తరహా పాత్రను పోషించాను. చాలా సంప్రదాయబద్ధంగా... ఇండిపెండెంట్ భావాలుండే అమ్మాయిగా కనిపిస్తాను. ఒక్క మాటలో చెప్పాలంటే...ప్రతీ అమ్మాయికీ కనెక్ట్ అయ్యేవిధంగా నా పాత్ర ఉంటుంది అని కథానాయిక మేఘాచౌదరి వెల్లడించారు. నవీన్ విజయ్‌కృష్ణకు జోడీగా ఆమె నటించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా ఆమె పాత్రికేయులతో కొద్దిసేపు ముచ్చటించారు.

నేను కోల్‌కత్తాలో పుట్టాను. ప్రస్తుతం ముంబాయిలో ఉంటున్నాను. నా పదహారవ ఏట నుంచి నటించడం మొదలుపెట్టాను. బాంబేకు వెళ్లి అసిస్టెంట్ డైరెక్టర్‌గానే కాకుండా కాస్టింగ్ అసిస్టెంట్‌గా కూడా పనిచేశాను. ఇప్పుడు తెలుగు, తమిళ భాషల్లో నటిస్తున్నాను. తెలుగులో రెండు వారాల కింద విడుదలైన మార్షల్ నా తొలి సినిమా. దాని తర్వాత ఈ సినిమా చేశాను. ఇది పూర్తి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఇందులోని ప్రతీ పాత్ర మన కుటుంబంలో ఉన్నట్లే ఉంటుంది. రోజూ మన కుటుంబంలో ఉన్న పాత్రలే సినిమాలో కూడా కనిపిస్తాయి. ప్రతీ పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. ముఖ్యంగా జయసుధ, రావు రమేష్, కోట శ్రీనివాసరావు లాంటి సీనియర్ నటులతో స్క్రీన్ పంచుకోవడం గౌరవంగా భావిస్తున్నాను. ప్రతీ ఇంట్లోలానే ఈ చిత్రంలోని పాత్రలు ఉంటాయి. కేవలం కథ కోసమే ఈ చిత్రాన్ని అంగీకరించాను. ఇందులో హీరో 50 సన్నివేశాలు చేస్తే...అందులో నా సీన్లు కూడా 50 ఉంటాయి. రెండు కథలు సమాంతరంగా వెళుతుంటాయి. కె.ఎం.రాధాకృష్ణన్ పాటలు వీనులవిందుగా ఉంటాయి. కన్నా అనే పాట నాకు బాగా నచ్చింది. రాశీఖన్నా ఈ పాటను పాడారు. దసరాకు కుటుంబంతో కలిసి ఆనందంగా చూడదగ్గ సినిమా ఇది. దీనికి ముందు నేను నటించిన మార్షల్ సినిమాకు...దీనికి చాలా తేడాలున్నాయి. అందులో మేఘా అనే యంగ్ జర్నలిస్ట్ పాత్రలో నటించాను. పూర్తిగా అది గ్లామరస్ పాత్ర. కానీ ఈ చిత్రంలో పక్కా తెలుగమ్మాయి పాత్ర. కుటుంబానికి బాగా విలువనిచ్చే అమ్మాయి పాత్ర. తప్పులున్నా కూడా ధైర్యంగా చెప్పలేదు. కుటుంబం కోసం అన్నీ భరించే పాత్ర. అభినయానికి బాగా అవకాశం ఉన్న పాత్ర ఈ చిత్రంలో శ్రీనివాస్ అవసరాల కూడా ఉన్నారు. భాషలో సమస్యలు వచ్చినపుడు నాకు తను ఎంతో సహకారాన్ని అందించారు అంటూ ముగించారు.



మేఘాచౌదరి

# బాలీవుడ్‌లో రణవీర్.. తెలుగులో...!



రకుల్ ప్రీత్‌సింగ్

రణవీర్, విజయ్ దేవరకొండ వీరిద్దరితో స్క్రీన్ షేర్ చేసుకోవాలని ఉందని నటి రకుల్ ప్రీత్ సింగ్ చెప్పింది. తెలుగు అగ్రశ్రేణి హీరోలందరితో కలిసి నటించిన ఈ భామకు ఇప్పుడు కొంత గ్యాప్ వచ్చింది. దానికి కారణం వరుస ఫ్లాపులు రావడమే అని చెప్పవచ్చు. నిజానికి తక్కువ సమయంలోనే స్టార్ రేంజ్‌కి చేరుకుంది రకుల్. వచ్చిన అవకాశాలు ఉపయోగించుకుంది. కానీ తన ప్రమేయం లేకుండానే ఫ్లాప్ సినిమాల్లో భాగమైంది. ఈ కారణంగా ఆమెకు కొత్త అవకాశాలు తగ్గాయి. పైగా బాలీవుడ్ నుండి కొత్త వారి సంఖ్య పెరగడం మరోకారణం. ఇంత నిరాశ ఉన్నప్పటికీ భవిష్యత్తుపై నమ్మకంతో ఉంది. అందుకే ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తనకు హిందీలో రణవీర్‌తో తెలుగులో విజయ్ దేవరకొండతో కలిసి నటించాలని ఉందని మనసులో మాట వెల్లడించింది. ఆమె చెప్పిన ఇద్దరు హీరోలు ఇప్పుడు మంచి స్టార్‌డమ్‌లో ఉన్నారు. వారితో కలిసి నటించాలని రకుల్‌కు మాత్రమే కాదు హీరోయిన్లు అందరికీ ఉంటుందనేది వాస్తవం.



మధుసూదన్, శ్రీజిత ఘోష్, రానా సునీల్ కుమార్ సింగ్

# మన చుట్టూ జరిగే సంఘటనలతో మీనా బజార్

వైభవ్ జోషి, శ్రీజిత ఘోష్, రాజేష్ నటరంగ, మధుసూదన్ తదితరులు ప్రధాన పాత్రలలో రూపొందిన చిత్రం డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు మీనాబజార్ డాట్ కామ. రానా సునీల్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహించడంతో పాటు చిత్రంలో దర్శకుడి పాత్రలో నటించారు. నాగేంద్రసింగ్ నిర్మించిన ఈ చిత్రం టీజర్, ఫస్ట్‌లుక్ పోస్టర్స్ విడుదల కార్యక్రమం మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. అతిథిగా విచ్చేసిన నిర్మాతల మండలి అధ్యక్షుడు సి.కల్యాణ్, పోస్టర్స్‌ను తుమ్మలపల్లి రామసత్యనారాయణతో పాటు మీడియాకు చెందిన పలువురు ఆవిష్కరించారు. అనంతరం సి.కల్యాణ్ మాట్లాడుతూ, నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా టీజర్ ఉంది. కొన్ని జరిగిన సంఘటనల ఆధారంగా చిత్రాన్ని మలచినట్లు అనిపిస్తోంది అని అన్నారు. తుమ్మలపల్లి రామసత్యనారాయణ మాట్లాడుతూ, కంటెంట్ బావున్న చిన్న సినిమాలు విజయం సాధించడం సహజమే. ఆ కోవలో ఈ చిత్రం విజయం సాధించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. దర్శకుడు రానా సునీల్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ, నేను కన్నడంలో ఒక సినిమా చేశాను. తెలుగులో చేస్తున్న మొదటి సినిమా ఇది. మాకు సపోర్ట్ చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నా అని అన్నారు. హీరో మధుసూదన్ మాట్లాడుతూ, మన చుట్టూ జరిగే సంఘటనల ఆధారంగా ఈ సినిమా ఉంటుంది. ప్రతీఒక్కరూ ఈ సబ్జెక్టుకు కనెక్ట్ అవుతారు అని చెప్పగా...ఈ చిత్రం ద్వారా తెలుగులో పరిచయం అవుతున్నందుకు ఆనందంగా ఉందని హీరోయిన్ శ్రీజిత ఘోష్ అన్నారు. ఇంకా పలువురు చిత్రబృందం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణాన్ని మ్యాథ్యూ అందించగా...కద్రి మణికాంత్ సంగీతాన్ని సమకూర్చారు.

# టైగర్‌తో ప్రేమ నిజమే..!

బాలీవుడ్ స్టార్స్‌లో టైగర్ ష్రాఫ్ ఒకరు. సీనియర్ నటుడు జాకీ ష్రాఫ్ వారసుడైన టైగర్ ఇప్పుడిప్పుడే స్టార్‌గా ఎదుగుతున్నాడు. ఫిజిక్ విజయంలో ఎంతో జాగ్రత్తగా ఉండే టైగర్ యువ ప్రేక్షకుల్లో మంచి ఫాలోయింగ్ ఉంది. ఇక టైగర్ ష్రాఫ్, హీరోయిన్ దిశాపటాని మధ్య ప్రేమాయణం ప్రచారంలో ఉన్న విషయం తెలిసిందే. టైగర్ కానీ, దిశా కానీ దీనిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. అయినప్పటికీ ఇద్దరు కలిసి జంటగా కనిపించడం, విదేశీ టూర్లకు వెళుతుండడం వల్ల ప్రేమాయణం నిజమే అని, త్వరలో పెళ్లి కూడా చేసుకుంటారని ప్రచారం జరిగింది. దీనికి సంబంధించి అనేక కథనాలు బాలీవుడ్‌లో వినిపించసాగాయి. ఇలా ఉండగా వీరిద్దరి మధ్య బ్రేకప్ జరిగిందని ఆశ్చర్యం కలిగించే విషయం వెలుగులోకి వచ్చింది. అంతేకాదు టైగర్ దిశాకి దూరమై శ్రద్ధాకపూర్‌కు దగ్గరైనట్టుగా ప్రచారం జరుగుతోంది. శ్రద్ధాకపూర్‌కు సంబంధించిన మరో వార్త ప్రచారంలో ఉంది. ఆమె గాయకుడు ఫర్హాన్‌తో కొంతకాలంగా డేటింగ్ చేస్తోందని అంటారు. తాజాగా వీరిద్దరు విడిపోయారని, దాంతో శ్రద్ధ టైగర్‌కు దగ్గరైందని బాలీవుడ్ సమాచారం. దీనిపై శ్రద్ధ కూడా స్పందించింది. సోషల్ మీడియాలో వినిపిస్తున్న వార్తలు ఆమె దృష్టికి వచ్చింది. దాంతో తనకు టైగర్ ష్రాఫ్ అంటే ఇష్టమని, నాకు ప్రియమైన వ్యక్తి అని తెలిపింది. ఈ మాటతో శ్రద్ధ, టైగర్ వ్యవహారం నిజమే అని బాలీవుడ్ వర్గాలు అంటున్నాయి.



శ్రద్ధాకపూర్



కంగనారనౌత్

# చైనాలో మణికర్ణిక

భారతీయ సినిమాలకు చైనా మార్కెట్ కూడా కొత్తగా చేరింది. దంగల్, బాహుబలి, 2.ఓ చిత్రాలు అక్కడ మంచి రెవెన్యూ రాబట్టాయి. ఈ క్రమంలో ఇండియాలో సూపర్‌హిట్ అయిన సినిమాలను చైనాలో విడుదల చేసేందుకు నిర్మాతలు ప్రయత్నాలు చేస్తున్నారు. చైనీయులు ఆసక్తిని కనబరితే యుద్ధనేపథ్యం ఉన్న సినిమాలను చైనా భాషలో అనువదిస్తారు. తాజాగా మణికర్ణిక చిత్రం కూడా చైనాలో విడుదలకానుందని తెలిసింది. ఈ ఏడాది జనవరిలో మణికర్ణిక విడుదలైంది. టైటిల్ పాత్రలో కంగనా రనౌత్ నటించిన విషయం తెలిసిందే. క్రిష్‌తో పాటుగా కంగనా దర్శకత్వం వహించారు. కమర్షియల్‌గా మంచి విజయాన్ని నమోదు చేసింది. వచ్చే ఏడాది జనవరిలో ఈ సినిమాను చైనాలో విడుదల చేస్తారని తెలిసింది.

మణికర్ణిక పాత్రలో కంగనా మంచి ప్రతిభను కనబరిచింది. వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయ్ జీవిత కథ ఆధారంగా ఈ సినిమా తీశారు. యుద్ధ సన్నివేశాల్లో, కత్తి సాములో చాలా ఈజీగా నటించి మెప్పించింది. నటిగా మంచి మార్కులు తెచ్చుకుంది.



శింబు

# కొత్తలుక్‌లో శింబు

కోలీవుడ్ హీరో శింబు పేరు చెప్పగానే వివాదాలు గుర్తుకువస్తాయి. తమిళ స్టార్ హీరోల్లో శింబు ఒకరు. ఆయన నటించిన పలు తమిళ్ చిత్రాలు తెలుగులో అనువాదం అయ్యాయి వాటిలో మన్మథ సినిమా బాగా ఆడింది. అనేక మంది హీరోయిన్లతో సన్నిహితంగా మెదిలే శింబు అకస్మాత్తుగా కొత్త లుక్‌లో కనిపించి ఆశ్చర్యపరిచారు. కొద్ది రోజుల క్రితం తన విదేశీ పర్యటన నుండి తిరిగి వచ్చేశారు. స్టైలిష్ లుక్‌తో కనిపించారు. కొత్త హెయిర్ స్టైల్‌తో, బ్లాక్ డ్రస్‌తో కనిపించిన శింబును చూసి అభిమానులు ఖుషీ అయ్యారు. ఈ లుక్ సినిమా కోసమా లేక మరేదైన ప్రత్యేకత ఉందా? అని సినీ వర్గాలు సంశయం వ్యక్తం చేస్తున్నారు. కోలీవుడ్‌లో సరైన సక్సెస్‌లు లేక శింబు కొంత వెనుకపడ్డాడు. దాంతో అందరినీ ఆకర్షించేందుకు ఇలా కొత్త గెటప్ వేశాడనే మాట వినిపిస్తోంది.

Vaccum Therapy లింగవర్ధక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?
అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్కలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076